అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 10-08-2024

సంపుటి : 10 సంచిక : 172 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

కలం బలం నిరూపిస్తున్న పత్రిక



రచయిత పరుచూరి గోపాలకృష్ణ

నేను నిత్యం చదివే దిన పత్రిక నవతెలంగాణ. దిన పత్రిక అంటే నిన్న ఏం జరిగిందో, రేపు ఏమి జరగబోతోందో ప్రజలకు తెలియజేసే దర్పణం లాంటిది. ఇది దాని ధర్మం కూడా. నిజాన్ని నిజంగా, నిర్భయంగా తెలియజేయడం ఆ పత్రికలో పనిచేసే వారి విధ్యుక్త ధర్మం. అలా వారు పనిచేసేలా చెయ్యడం ఆ పత్రిక యాజమాన్య ధర్మం. ఈ మూడు ధర్మాలను పాటిస్తున్న ...11లో

9వ వార్షికోత్సవం

తెలంగాణ ఫ్యూచర్ స్టేట్..

మన లక్ష్యాన్ని సూచించే కొత్త నినాదమిదే

- అదే మన ట్యాగ్‌లైన్ : సీఎం రేవంత్
- కాలిఫోర్నియాలో ఏఐ యూనికార్న్ కంపెనీ ప్రతినిధులతో సీఎం భేటీ
- తెలంగాణ పెట్టుబడులకు అనుకూలం : మంత్రి శ్రీధర్‌బాబు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇకపై మన రాష్ట్రాన్ని 'తెలంగాణ ఫ్యూచర్ స్టేట్...' అని పిలుద్దామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ పునర్ నిర్మాణంలో భాగంగా తమ ప్రభుత్వం చేపడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ 'ది ఫ్యూచర్ స్టేట్'కు పర్యాయపదంగా ...11లో



రెడ్ సెల్యూట్ కామ్రేడ్..

కమ్యూనిస్టు యోధునికి కన్నీటి వీడ్కోలు

కోల్‌కతా : పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బుద్ధదేవ్ భట్టాచార్యకు అశేష ప్రజానీకం అశ్రునివాళులర్పించారు. పార్టీ కార్యాలయం నుంచి ఎస్ఆర్ఎస్ మెడికల్ కళాశాల ఆస్పత్రి వరకూ ఆయన భౌతికకాయం వెంట భారీగా తరలివచ్చారు. 'రెడ్ సెల్యూట్ కామ్రేడ్ బుద్ధదేవ్' అంటూ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బుద్ధదేవ్ భౌతికకాయాన్ని పరిశోధన నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్ఆర్ఎస్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు అప్పగించారు. సీపీఐ(ఎం) ఎర్ర జెండాతో కప్పివున్న బుద్ధదేవ్ భౌతికకాయాన్ని గురువారం దక్షిణ కోల్‌కతాలోని పామ్ అవెన్యూలో ఆయన ఉండే రెండు గదుల నివాసం నుంచి మార్చురీ పీస్ వరల్డ్‌కు తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఆయన పార్థివ దేహాన్ని పార్టీ కార్యాలయానికి తీసుకువచ్చారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్, ప్రకాశ్ కరత్, బృందాకరత్, ఎంఏ బేబీ, నీలోత్పల్ బసు, రామచంద్రడోమ్, రాష్ట్ర కార్యదర్శి ఎండి సలీమ్, సీనియర్ నాయకులు హన్నన్‌మొల్లా తదితరులు నివాళులర్పించారు. పూలమాలలు, ఎర్ర గులాబీలతో అనేక మంది కార్యకర్తలు తరలివచ్చారు. అంతిమ యాత్రలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సహా అశేష జన వాహిని కదిలింది. భట్టాచార్య భార్య మీరా కన్నీళ్లతో పార్టీ నాయకులు, ...2లో



ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమీ లేయర్ వర్తించదు

బీజేపీ ఎంపీలకు ప్రధాని మోడీ భరోసా



సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తూ వందమంది బీజేపీ ఎంపీల సంతకాలతో వినతి

న్యూఢిల్లీ : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమీ లేయర్ సూత్రం వర్తించదని బీజేపీ ఎంపీలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం హామీ ఇచ్చారు. బీజేపీలోని ఎస్సీ, ఎస్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు శుక్రవారం పార్లమెంట్ హౌస్‌లో మోడీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రధాని వద్ద ఇటీవల నలుగురు సుప్రీంకోర్టు జడ్జీలు చేసిన సూచనను ఎంపీలు ప్రస్తావించారు. ఎస్సీల్లో వర్గీకరణ విచారణ సందర్భంగా ఏడుగురు జడ్జీలు ఉన్న విస్తృత ధర్మాసనంలో నలుగురు జడ్జీలు ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లలోనూ క్రీమీ లేయర్ సూత్రాన్ని వర్తింపచేయాలని సూచించిన సంగతి తెలిసిందే. దీన్ని ఎంపీలు ప్రధాని వద్ద ప్రస్తావించగా మోడీ స్పందిస్తూ ఇది కేవలం ఒక పరిశీలన మాత్రమే అని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్‌ను వర్తింపచేయమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సమావేశం అనంతరం కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ ఫగ్గన్ సింగ్ కులస్తే ఎక్స్ పోస్టు ద్వారా తెలిపారు. ఈ సమావేశంలో ...10లో

యూట్యూబ్‌పై పెత్తనమా?

అది ప్రజల గొంతుక

- సెన్సార్‌షిప్ మంచిది కాదు
- స్వీయ నియంత్రణే మేలు
- ప్రసార సేవల బిల్లుపై మీడియా ప్రముఖుల ఆందోళన
- కొందరికే ముసాయిదా పంపడం ఏమిటని నిలదీత



ప్రసార రంగానికి ఏకీకృత చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురావటం కోసం ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ (నియంత్రణ) బిల్లు, 2023 ముసాయిదాను విడుదల చేసింది. ప్రభుత్వం ఎంపిక చేసిన బిల్లు కొత్త ముసాయిదా.. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో స్వతంత్ర వార్తల సృష్టికర్తల(న్యూస్ క్రియేటర్స్)ను నియంత్రించేలా తీసుకురాబడిందనీ, ఈ ముసాయిదాపై కేంద్రం కావాలనే లీకులు ఇస్తున్నదని మీడియా సంస్థలు ఆరోపిస్తున్నాయి. కేంద్రం తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

న్యూఢిల్లీ : 'మీరు చెప్పేది ఇష్టం లేక ప్రభుత్వం మీ సంస్థను మూసేస్తుందేమోనని నిరంతరం భయపడుతుంటే అది భయానక వాతావరణాన్ని సృష్టించడమే అవుతుంది' అని ఎన్డీటీవీ మాజీ సంపాదకుడు రవిష్ కుమార్ వ్యాఖ్యానించారు. ప్రసార సేవల (నియంత్రణ) బిల్లు కారణంగా ఎదురయ్యే సవాళ్ల, ప్రభావాలపై డిజిపబ్ న్యూస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రసార బిల్లు రెండో ముసాయిదాను కొందరు ఎంపిక చేసిన మీడియా సంస్థలకు గత నెలలో విడుదల చేశారు. ధృవ్ రథి, రవిష్ కుమార్ వంటి డిజిటల్ కంటెంట్ రూపకర్తలను డిజిటల్ న్యూస్ ...3లో

హక్కులను కాపాడండి

పార్లమెంట్ సభ్యులు,

రాజకీయ పార్టీలకు జర్నలిస్టు సంఘాల పిలుపు

13 డిమాండ్లతో చార్టర్ విడుదల 3లో..

ఆ ప్రమాదానికి సీఎం రేవంతే పూర్తి బాధ్యత వహించాలి

ఆయన అసమర్థత వల్లే ఈ ఘటన



వివరాలు 11లో

తెలిసినా తెలియనట్టు నటించారా..?

'సుంకిశాల'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్

కేసీఆర్ మానస పుత్రిక సుంకిశాల

నిర్మాణ లోపంతోనే కుప్పకూలింది

- నష్టాన్ని నిర్మాణ సంస్థే భరిస్తుంది..ప్రభుత్వానికి నష్టం లేదు
- బీఆర్ఎస్ హయాంలో కట్టిన మిగతా ప్రాజెక్టుల పరిస్థితీ తేలాలి
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు
- సుంకిశాలలో ప్రమాద స్థలం పరిశీలన



నవతెలంగాణ - పెద్దవూర

కేసీఆర్ మానస పుత్రిక సుంకిశాల ప్రాజెక్టు, దాని గురించి తండ్రీతనయులకు, కాంట్రాక్టర్లకే తెలుసని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో సుంకిశాల ప్రాజెక్టులో కూలిన రక్షణ గోడ, గేట్లను శుక్రవారం శాసన మండలి చైర్మెన్ గుత్తా ...11లో

అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించం

ఆదివాసీల అభివృద్ధే మా ప్రభుత్వ లక్ష్యం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క

గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా కృషి : స్పీకర్ ప్రసాద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యూపీఏ హయాంలో తీసుకొచ్చిన అటవీహక్కుల చట్టానికి తూట్లుపొడిచేందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రయత్నిస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) ఆందోళన వ్యక్తం చేశారు. ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు.ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కొమరం భీం ఆదివాసీ భవనంలో రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన వేడుకలకు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో కలిసి మంత్రి సీతక్క హాజరయ్యారు. ఆదివాసీ సాంప్రదాయ వాయిద్యాలు, నృత్యాలతో కళాకారులు మంత్రికి ఘన స్వాగతం ...10లో

ముగిసిన పార్లమెంట్ సమావేశాలు



136 శాతం ఉత్పాదకత

లోక్‌సభ కార్యకలాపాలు 115 గంటలు

రాజ్యసభ 90.35 గంటలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. వాస్తవానికి ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 12 వరకు సమావేశాలు జరగాల్సి ఉండగా, మూడ్రోజుల ముందుగానే ముగిశాయి. ఈ మూడు రోజుల్లో శని, ఆదివారాల్లో పార్లమెంట్‌కు సెలవు. సోమవారం ...3లో



స్వేచ్ఛా ప్రపంచంలోకి మనీశ్ సిసోడియా

సుప్రీం బెయిల్ మంజూరు

శిక్ష పేరుతో బెయిల్‌ను నిలుపుచేయలేం

సీబీఐ, ఈడీలనుద్దేశించి కీలక వ్యాఖ్యలు

నియంతృత్వానికి చెంప పెట్టు : ఆప్ 3లో..

ఆ భూములపై పెద్దల కన్ను

కీలక నేతల అండతో రియల్ వ్యాపారుల పాగా

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వ పెద్దల అనుచరుల ఆగడాలకు సర్కారు భూములు మాయమవుతున్నాయి. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములపై దృష్టి సారించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు.. ప్రభుత్వ పెద్దల అండతో కొండలను సైతం పిండి చేసి ఆ భూములను కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. కొండలు, గుట్టలు, చెరువులని కూడా చూడకుండా ఆ భూములు తమకు అవసరం అనుకుంటే వాటి స్వరూపాలనే మార్చేస్తున్నారు. వీటి పట్ల అధికారులు కూడా చూసీచూడనట్టుగా ఉండటంతో కబ్జాదారుల పని సులువైపోయింది. ప్రభుత్వ భూముల్లో పేదోడు గుడిసె వేసుకుంటే జులుం ప్రదర్శించే అధికారులు.. బడా నేతలు వందల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతుంటే ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కబ్జాకు గురవుతున్న భూములను కాపాడాలని కోరుతున్నారు.



రూ. కోట్ల విలువ చేసే వందల ఎకరాల స్వాహాకు కుట్ర

నిర్మాణాలు చేపడుతున్నా కన్నెత్తి చూడని అధికారులు

నోటీసులు, పీవోటీ అంటూ కాలయాపన

ప్రభుత్వ భూములు కాపాడాలని ప్రజల డిమాండ్

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 189లో సుమారు 191 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత భూమిని నాటి ప్రభుత్వం దళితులకు వ్యవసాయం కోసం అసైన్డ్ చేసింది. మిగతా భూమిలో కొంత ఇండ్ల జాగాలకు కేటాయించింది. మరో 60 నుంచి 70 ఎకరాల వరకు మిగులు భూమిగా ఉంది. అలాగే, అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం అనాజ్‌పూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 281లో 357 ఎకరాల భూమి ఉంది. ఇందులో సుమారు 50 నుంచి 60 ఎకరాల వరకు మాత్రమే పట్టా భూమి ఉన్నట్టు సమాచారం. మిగతా భూమిలో కొందరు సీలింగ్ పట్టాదారులు ఉండగా.. సుమారు 70 ఎకరాలు ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉంది. ఈ భూముల మీద కన్నేసిన ఓ బడా నేత.. ప్రభుత్వంలోని కీలక నేతలతో చేతులు కలిపి ఆ భూములను కాజేసే కుట్రకు తెరలేపుతున్నట్టు తెలిసింది. రెండు ...11లో

ఆదివాసీ హక్కుల సంరక్షణకు సమరం

- గిరిజనుల సమస్యలపై ఉద్యమించాలి : తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం నాయక్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్
- సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు
- ఘనంగా ఏటూరునాగారంలో ఆదివాసీ దినోత్సవం
- మూఢాచారాలకు దూరంగా ఉండాలి :ఐటీడీఏ పీఓ రాహుల్
- పలు జిల్లాల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు హాజరు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/విలేకరులు

పోడు భూములకు పట్టాలు, ఆదివాసీ హక్కులు సంరక్షణ కోసం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం స్ఫూర్తితో ఆదివాసీలు సమరం సాగించాలని తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాం నాయక్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఏజీఎస్, టీజీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, సభలు నిర్వహించారు. ములుగు జిల్లా ఏటూరునాగారం బస్టాండ్ నుంచి ఐటీడీఏ వరకు గిరిజన సంప్రదాయ డోలీ నృత్యాలు, లక్ష్మీ దేవర డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ ఆవరణలో కొమురంభీం విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బండారు రవికుమార్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం స్ఫూర్తితో పోడు భూములకు పట్టాలు, ఆదివాసీ హక్కుల సంరక్షణ కోసం ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సాగులో ఉన్న ప్రతి ఎకరానికి పత్రాలు ఇవ్వాలన్నారు. వలస ఆదివాసీ గూడాల ప్రజలను గిరిజనులుగా గుర్తించి గిరిజన కుల సర్టిఫికెట్ ఇవ్వాలని, గూడాల్లో తాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఐటీడీఏ పరంగా గిరిజన గూడాలను అభివృద్ధి చేయాలన్నారు. గిరిజన గూడాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి హెల్త్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. గిరిజన గ్రామాలు అన్నింటికీ రోడ్లు, కరెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో జీవో 3 ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఖాళీ ఉద్యోగాలన్నింటినీ స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొంది రాజేష్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జేజేర్ దామోదర్, నాయకులు దుగ్గి చిరంజీవి, తోలేం కిష్టయ్య, చిరంజీవి, వంక రాములు, కృష్ణ బాబు, సౌమ్య, శాంత కుమారి, ప్రవీణ్, కమలతో పాటు గిరిజనులు పాల్గొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో డీఎల్ఆర్ గార్డెన్ నుంచి గిరిజన భవన్ వరకు ఆదివాసీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో దాదాపు 3 కి.మీ మేర చంటి పిల్లలతో సహా ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యంలో మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజన భవన్‌లో జెండావిష్కరణ చేసి కొమురం భీమ్‌కు నివాళులు అర్పించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో అన్ని గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గిరిజన భవన్ నుంచి నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ ముజిమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో శ్రీరాం నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సకాలంలో అమలు చేయాలని, ఐక్య ఉద్యమాల ద్వారానే గిరిజన హక్కులు కాపాడబడతాయని అన్నారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ఐక్యంగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పాల్గొన్నారు. ఆదివాసీ అమరవీరుల స్థూపాలకు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన ఆదివాసీల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ తెగ అంతరించిపోకుండా వారి సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు అందేలా కాపాడాలని అన్నారు. ఆదివాసీ విద్యార్థులు బాగా చదువుకొని మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని, మూఢవిశ్వాసాలకు దూరంగా ఉండాలని ఐటీడీఏ పీఓ కోరారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ(ఎం) భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాత మార్కెట్ సెంటర్‌లో కొమరం భీమ్ విగ్రహానికి రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆళ్లపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇల్లందులో కొత్త బస్టాండ్ వద్దనున్న కొమురం భీమ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. టేకులపల్లి మండలం బోడు గ్రామంలో కొమురం భీమ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆవిష్కరించారు. పినపాకలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. పాల్వంచ మండలం రాజాపురం గ్రామంలో ఆదివాసీలు ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించి మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో చెంచు సేవా సంఘం రాష్ట్ర నాయకులు మండ్లి రాములు, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలనతో అడవి బిడ్డల బతుకుల్లో వెలుగులు నిండుతాయని అన్నారు. నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలో త్రివేణి ఒకేషనల్ కాలేజీలో ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవ సభను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కోర్ర శంకర్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజన హక్కులను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్, కొమరం భీం చిత్రపటాలకు జిల్లా అధ్యక్షులు రమేశ్ నాయక్.. విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఆదివాసీలు, గిరిజనులు అన్ని రంగాల్లో ముందుండాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. ఆదిలాబాద్‌లో సీపీఐ(ఎం) నేతలు కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

ప్రజావాణికి 502 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 502 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూకు 112, పౌరసరఫరాల శాఖకు 69, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 42, మైనారిటీ వెల్ఫేర్‌కు 71, మున్సిపల్ శాఖకు 35, ఇతర శాఖలకు 173 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.

ప్రాజెక్టులకు నష్టం లేకుండా పూడికతీత

- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- ఇసుకను ప్రాజెక్టుల నిర్మాణానికి వాడుకోవచ్చు : రిజర్వాయర్ల అధ్యయనంపై క్యాబినెట్ సబ్‌కమిటీ నిర్ణయాలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రాజెక్టులకు ఎలాంటి నష్టం జరగకుండా ఉండేలా పూడికతీత పనులు చేపట్టాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సూచించింది. అలాగే ప్రాజెక్టుల రక్షణలో రాజీ పడొద్దని ఆదేశించింది. ఈ సందర్భంగా వచ్చే సారవంతమైన మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలనీ, ఇసుకను ప్రాజెక్టుల నిర్మాణంలో వాడుకోవచ్చని చెప్పింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉపసంఘం చైర్మెన్, నీటిపారుదల శాఖామంత్రి యన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉపసంఘం సమావేశానికి సభ్యులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. అలాగే నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, నీటిపారుదల శాఖా సలహాదారుడు ఆదిత్యానాథ్ దాస్, గనులు, భూగర్భవనుల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ సుశీల్‌కుమార్, ఈఎన్సీ జి అనిల్‌కుమార్, డిప్యూటీ ఈఎన్సీ కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పూడికతీతపై మంత్రులు విస్తృతంగా చర్చించారు. పలు నిర్ణయాలు చేశారు. ఈసందర్భంగా మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల పూడికతీతకు కేంద్రం అనుమతులు ఇచ్చిందన్నారు. ఆ సమయంలోనే పర్యావరణ అనుమతులు అవసరం లేదని కూడా స్పష్టం చేసిందని గుర్తు చేశారు. అందుకు అనుగుణంగా ముందుకు పోదామని చెప్పారు. పూడికతీత అంశంపై నీటిపారుదల శాఖ, గనులు, భూగర్భ వనరుల శాఖలు ఒక నిర్ణయానికి రావాలనీ, ఈనెల 14 నాటికి నివేదిక ఇవ్వాలని సూచించారు. పూడికతీత సమయంలో సారవంతమైన మట్టి అందుబాటులోకి వస్తే, రైతాంగానికి ఉచితంగా ఇవ్వాలని సూచించారు. అందుకుగాను రవాణా చార్జీలు రైతులే భరించేలా విధి విధానాలు రూపొందించాలని కోరారు. ఇసుకను ప్రాజెక్ట్‌తోపాటు ఇతర నిర్మాణాలకు వినియోగించాలని ఆదేశించారు. మట్టిని ఎప్పటికప్పుడు ఖాళీ చేయించాలని చెప్పారు. దీని ద్వారా ప్రాజెక్టుల యథాస్థితిని పునరుద్ధరించాలని అన్నారు. తద్వారా నీటి నిల్వలు పెంపొందించుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. ఇప్పటికే పూడికతీతను చేపట్టిన రాష్ట్రాలలో ప్రాజెక్టుల పురోగతిపై అధ్యయనం చేయాలని ఆదేశించారు.

15న రైతులను రుణ విముక్తులను చేస్తాం

- గోదావరి జలాలను జాతికి అంకితం చేయనున్న సీఎం
- వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం
- నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన కేసీఆర్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ -వైరా

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15న వైరాలో నిర్వహించే రైతు బహిరంగ సభ నుంచి తెలంగాణలోని రైతులను సంపూర్ణ రుణవిముక్తులం చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించి రూ.122 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం తన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మెన్ దొడ్డా పుల్లయ్య ఇంటివద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల15న సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను విడుదల చేసి జాతికి అంకితం చేస్తారని తెలిపారు. ఆ తర్వాత వైరాలో నిర్వహించే రైతు బహిరంగ సభలో రూ.2 లక్షల రుణమాఫీతో రాష్ట్రంలోని రైతులను రుణ విముక్తుల్ని చేస్తామని, అందరూ సంబరాలు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు రెండు విడతల్లో రూ.1.50 లక్షలలోపు రుణమాఫీని 16.29 లక్షల కుటుంబాలకు అందించామని తెలిపారు. 17.01 లక్షల రైతుల ఖాతాల్లో రూ.12,283 కోట్ల రుణమాఫీ నిధులను జమచేశామన్నారు. రుణమాఫీతో పాటు వ్యవసాయ, వ్యవసాయేతర అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో రూ.72వేల కోట్లు తొలిసారి కేటాయించినట్టు చెప్పారు. రైతుబీమా కింద రూ.1540కోట్లు, పంటల బీమా కింద రూ.1350 కోట్లను ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో నీటిపారుదల రంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని విమర్శించారు. కేవలం రూ.1450కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను రీడిజైన్ పేరుతో సీతారామ ప్రాజెక్టుగా మార్చి రూ.23వేల కోట్లకు అంచనాలు పెంచారని విమర్శించారు. రూ.8వేల కోట్ల నిధులను ఖర్చుచేసినా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేకపోయారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రూ.75కోట్లతో రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా 1.50 లక్షల ఎకరాలకు సాగు నీరందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మెన్ నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మెన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపాలిటీ చైర్మెన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్ సెల్యూట్ కామ్రేడ్..

(మొదటిపేజీ తరువాయి)

వందలాది మంది అభిమానులతో పాటు రాజకీయ శ్రేణులు, సాధారణ ప్రజలతో పాటు అంతిమ యాత్రలో నడిచారు. ఆయన భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు రహదారుల నిండా జనం బారులు తీరారు.

ఆయనెప్పుడూ ఆడంబరాలు కోరుకోలేదు

గన్‌సెల్యూట్‌ను తిరస్కరించిన బుద్ధదేవ్ కుటుంబం


బుద్ధదేవ్ భట్టాచార్య భౌతికకాయానికి గన్ సెల్యూట్ చేసేవిధంగా ఏర్పాట్లు చేయాలన్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ప్రతిపాదనను ఆయన కుటుంబ సభ్యులు తిరస్కరించారు. బుద్ధదేవ్ భట్టాచార్య ఎన్నడూ ఆడంబరాలను కోరుకోలేదని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీమ్ మాట్లాడుతూ బుద్ధదేవ్ చివరి శ్వాస విడిచే వరకూ అత్యంత సాధారణ జీవితాన్నే కోరుకున్నారని, రెండు గదుల ఫ్లాట్‌లోనే నివసించారని చెప్పారు.

ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన మనుభాకర్‌కు అభినందనలు

- మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఒలింపిక్స్‌లో మను భాకర్ రెండు పతకాలను గెలుచుకోవడం అభినందనీయమని మంత్రి సీతక్క తెలిపారు. అసాధారణ ప్రతిభ, కృషి, అంకితభావం యావత్ దేశం గర్వించేలా చేశాయని తెలిపారు. 'ఒక మహిళగా, మీ విజయాలు ప్రతిధ్వనిస్తాయి. ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తాయి' అని కొనియాడారు. ఆమె విజయం మహిళా శక్తికి నిదర్శనమని తెలిపారు. వారు మరింత ఉన్నత శిఖరాలను సాధించి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



హక్కులను కాపాడండి

పార్లమెంట్ సభ్యులు, రాజకీయ పార్టీలకు జర్నలిస్టు సంఘాల పిలుపు

న్యూఢిల్లీ : పెరుగుతున్న ముప్పుల నుంచి పత్రికా స్వేచ్ఛను, జర్నలిస్టు హక్కులను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సభ్యులు, రాజకీయ పార్టీలకు నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఏజే), ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (డీయూజే), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజెఎఫ్), దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు 13 డిమాండ్లతో చార్టర్‌ను విడుదల చేశాయి. తాజా 18వ లోక్‌సభ ఏర్పడిన తరువాత ప్రస్తుతం తొలి బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ డిమాండ్లను విడుదల చేశాయి. 17వ లోక్‌సభలో కాకుండా ఈ కొత్త లోక్‌సభలో ఏ పార్టీకి సొంతంగా మెజారిటీ లేదని, కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉందని గుర్తు చేశాయి. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు దేశ ప్రజలు నిర్ణయాత్మక తీర్పు ఇచ్చారని ప్రొఫెషనల్ జర్నలిస్టుల ట్రేడ్ యూనియన్లుగా తాము బలంగా విశ్వసిస్తున్నట్లు సంఘాలు పేర్కొన్నాయి. ప్రతీ ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ మీడియా, జర్నలిజం నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయని మనందరికి తెలుసునని తెలిపాయి. అయితే దురదృష్టవశాత్తూ గత పదేండ్లుగా దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాయి. దేశంలో ప్రజాస్వామ్య సంప్రదాయాలను పునరుద్ధరింపచేసేందుకు తాజా ఎన్నికల్లో ప్రజలు నిర్ణయాత్మక తీర్పు ఇచ్చినప్పటికీ మీడియాపై దాడి మాత్రం యథాతథంగా కొనసాగుతోందని ఆందోళన వెలిబుచ్చాయి. కాబట్టి దేశంలో పత్రికా స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ, జర్నలిస్టు హక్కులను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్యలను మీ దృష్టికి తీసుకొస్తున్నట్లు, వీటిని పార్లమెంట్‌లో లేవనెత్తాలని ఎంపీలను, రాజకీయ పార్టీలను జర్నలిస్టు సంఘాలు అభ్యర్థించాయి. ముఖ్యంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, చిన్న, స్వతంత్ర వార్తా ప్రసారకర్తలను నియంత్రించడానికి ఉద్దేశించిన బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ (రెగ్యులేషన్) బిల్లు 2023 యొక్క తాజా ముసాయిదాలోని వివాదాస్పద, రహస్య నిబంధనలపై చర్చలు నిర్వహించాలని జర్నలిస్టుల యూనియన్‌లు ఎంపీలు, పార్టీలకు పిలుపునిచ్చాయి. అలాగే జర్నలిస్టులపై దుర్వినియోగం అవుతున్న రాజద్రోహం, పరువు నష్టం, ఉపా వంటి అన్ని చట్టాలపై సమీక్షించి, వాటి రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. అక్రిడేషన్ ఉన్న మీడియా వ్యక్తులకు విరివిగా ప్రవేశం కల్పించాలని కోరాయి. అదేవిధంగా మెదటి, రెండో ప్రెస్ కమిషన్ల తరహాలో స్వతంత్ర మీడియా కౌన్సిల్‌ను, మీడియా కమిషన్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాయి. అలాగే కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొన్ని ఏండ్ల నుంచి వేతనాల పెరగక సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు ఉపశమనం కలిగించే విధంగా తాజా వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని, గౌరవప్రదమైన పెన్షను, రిస్క్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను కూడా కల్పించాలని కోరాయి. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పొందుపర్చిన అన్ని భాషలను ప్రోత్సహించేలా ప్రభుత్వ చర్యలు ఉండాలని డిమాండ్ చేశాయి. జర్నలిస్టులను ఏకపక్ష అరెస్టులు, విచారణ నుంచి రక్షించడానికి ఒక ప్రత్యేక చట్టాన్ని డిమాండ్ చేశాయి. ఇంటర్నెట్ నిషేధం చట్టాన్ని దుర్వినియోగాన్ని అరికట్టాలని డిమాండ్ చేశాయి. ఫ్రీలాన్స్ జర్నలిస్టులు, స్ట్రింగర్లు, కన్సల్టెంట్ల సంక్షేమం, సామాజిక భద్రతకు సరైన చట్టపరమైన నిబంధనలు రూపొందించాలని సంఘాలు డిమాండ్ చేశాయి.

యూట్యూబ్‌పై పెత్తనమా?



(మొదటిపేజీ తరువాయి)

బ్రాడ్‌కాస్టర్లుగా ఈ ముసాయిదా బిల్లు పరిగణిస్తోంది. తద్వారా వివిధ వేదికలు, మాధ్యమాలకు చెందిన డిజిటల్ రూపకర్తల కోసం నూతన నిబంధనలు, నియమాలను నిర్దేశిస్తోంది. ఈ బిల్లుతో సంబంధమున్న కీలక భాగస్వాములకు దాని ముసాయిదాను అందజేయకపోవడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పాత్రికేయుల సమావేశంలో రవిష్ కుమార్‌తో పాటు పాల్గొన్న 'క్వింట్' సహ-వ్యవస్థాపకురాలు, డిజిపబ్ ప్రధాన కార్యదర్శి రితూ కపూర్, 'ది కారవాన్' సంపాదకుడు, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అనంత్ నాథ్, ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ సహ-వ్యవస్థాపకుడు, న్యాయవాది అపర్ గుప్తా కూడా బిల్లుపై ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లుపై సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖను సంప్రదించేందుకు డిజిపబ్ ప్రయత్నిస్తోందని, అయితే ఎన్ని లేఖలు రాసినా సమాధానం లేదని రితూ కపూర్ చెప్పారు.

గత కొన్ని సంవత్సరాలలో ఐటీ నిబంధనలు, డాటా రక్షణ చట్టం, టెలికం బిల్లు, నూతన ప్రెస్ చట్టం, నూతన క్రిమినల్ చట్టాలు వంటి విధానాలు, చట్టాలు ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రసార బిల్లును పరిశీలించాల్సిన అవసరం ఏర్పడిందని అనంత్ నాథ్ తెలిపారు. సమాచారాన్ని నియంత్రించేందుకు, అందులో మార్పులు చేసేందుకు తీసుకొస్తున్న వ్యవస్థలో ప్రసార బిల్లు కేవలం ఒక భాగం మాత్రమేనని అన్నారు. 'ఇప్పటికే ఐదు వేర్వేరు చట్టాలు, చర్యల ద్వారా సమాచారాన్ని నియంత్రిస్తున్నారు. ఇదెలా ఉందంటే ఎవరైనా ప్రతిపక్ష పార్టీ నాయకుడిని జైలులో పెట్టారనుకోండి. సీబీఐ కేసులో ఆయనకు బెయిల్ వచ్చినా ఐటీ, ఈడీ కేసులు ఉంటాయి కదా..! అచ్చం అలాగే వుంది.' అని వ్యాఖ్యానించారు. నియంత్రణ విషయంలో తుది నిర్ణయం ప్రభుత్వానికి వదిలేయకూడదని అన్నారు. ఏదైనా నియంత్రణ అవసరమైతే అది స్వీయ నియంత్రణే అయి ఉండాలని, దానికి మించి ఇతర నియంత్రణ వ్యవస్థలు ఉండకూడదని చెప్పారు.

ముసాయిదా బిల్లును కేవలం కొందరికి మాత్రమే పంపడంపై వక్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. బిల్లును ఎవరెవరికి పంపారో సాధ్యమైనంత త్వరగా బహిర్గతం చేయాలని, ముసాయిదా బిల్లును ప్రజలకు అందుబాటులో ఉంచాలని రవిష్ కుమార్ కోరారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిపిన సర్వేలు, వచ్చిన వ్యాఖ్యలు డిజిటల్ జర్నలిస్టుల సత్తా ఏపాటిదో, వారి ప్రభావం ఎంతో నిరూపించాయని రితూ కపూర్ గుర్తు చేశారు. ఎన్నికల తరుణంలోనే ముసాయిదాను తీసుకొచ్చారన్న వాస్తవాన్ని విస్మరించకూడదని చెప్పారు. తమ ఆందోళన కేవలం బిల్లుపై మాత్రమే కాదని, దానిని తీసుకొచ్చిన తీరుపై కూడా అని తెలిపారు. 'గత కొన్ని సంవత్సరాలుగా మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానల్స్‌పై దాడులు జరుగుతున్నాయి. ఎలాంటి హెచ్చరికలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ బిల్లు సెన్సార్‌షిప్‌కు దారితీస్తుందేమోనన్నదే మా ఆందోళన' అని ఆమె అన్నారు. గ్రామాల్లో సైతం యూట్యూబ్ ద్వారా లక్షలాది మంది క్రియేటర్లు కార్యక్రమాలు రూపొందిస్తూ డబ్బు సంపాదించుకుంటున్నారని, లధక్ నుండి కన్యాకుమారి వరకూ ప్రతి యూట్యూబర్‌పై ఈ బిల్లు దాడి చేస్తుందని రవిష్ కుమార్ చెప్పారు. 'సమాచారాన్ని మదింపు చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసుకోవడం ప్రతి యూట్యూబర్‌కు ఎలా సాధ్యం? అలాగే ఫిర్యాదుల కోసం అధికారిని ఎలా నియమించుకోగలరు? మా వంటి వ్యక్తులకు యూట్యూబే వేదిక. ప్రధాన స్రవంతి మీడియా మాకు ఉద్యోగాలు ఇవ్వలేదు. మా నోరు మూసే మార్గం కోసం ప్రభుత్వం అన్వేషిస్తోంది. అయితే వారు తెలుసుకోవాల్సిన విషయం ఒకటుంది. యూట్యూబ్ ద్వారా మేమే దాని నోరు మూయించగలం. మీడియా వార్తలపై వారు దృష్టి కేంద్రీకరించి, పరిశీలించి ఉంటే పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేది. బడా మీడియా సంస్థలు ఈ బిల్లుపై ఎందుకు నోరు మెదపడం లేదు? తమ భావ ప్రకటనా స్వేచ్ఛపై వారికి ఆందోళన లేదా?' అని ప్రశ్నించారు. లక్షలాది మంది యువత ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన వార్తలను కోరుకుంటున్నారని, అందుకే వారు డిజిటల్ రూపకల్పన వైపు మళ్లి యూట్యూబ్ సంస్థలను ఏర్పాటు చేసుకుంటున్నారని రవిష్ కుమార్ తెలిపారు. యూట్యూబ్ నుండే వాస్తవ సమాచారాన్ని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. దీంతో ఇప్పుడు ప్రభుత్వం తమను నియంత్రించాలని అనుకుంటోందని, ఇబ్బందుల కారణంగా గోడీ మీడియా వెబ్‌సైట్ల నుండి వైదొలిగిన లక్షలాది మందిని తిరిగి వాటిలోకి పంపుతున్నారని ఆయన అన్నారు.

వాయనాడ్ బాధిత కుటుంబాలకు

రూ. 10 వేల తక్షణ సాయం

తిరువనంతపురం : వాయనాడ్ జిల్లాలోని ముండక్కై, చురల్‌మల కొండచరియలు విరిగిపడిన ఘటనలో ప్రతీ బాధిత కుటుంబానికి రూ. 10 వేల తక్షణ ఆర్థిక సాయం అందచేస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. ముండక్కై, చురల్ మాల ప్రాంతంలో విపత్తు వల్ల నష్టపోయిన వారందరికీ ఈ సహాయం అందుతుందని, ప్రమాదంలో కట్టుబట్టలతో ప్రాణాలతో మిగిలిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఈ తక్షణ సాయం చేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. దీని ప్రకారం ప్రస్తుతం పునరావాస శిబిరంలో ఉంటున్న ఒక్కో కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా పది వేల రూపాయలు అందజేస్తారు.

మరో నాలుగు మృతదేహాలు లభ్యం

కొండచరియలు విరిగిపడిన ఘటనలో శుక్రవారం మరో నాలుగు మృతదేహాలు లభ్యమయ్యాయి. కాంతన్‌పర, సూచిపర కలిసే అనకాప్‌లో ఈ మృతదేహాలను గాలింపు బృందం గుర్తించింది. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయని బృందం తెలిపింది. కాగా, మృతదేహాలను గుర్తించిన ఈ ప్రాంతం పూర్తిగా అటవీప్రాంతం. నిటారుగా ఉన్న కొండలు, జలపాతాలు ఉన్న ఈ ప్రాంతంలో గాలింపు చర్యలు కష్టంగా మారాయి. అయినా అటవీ శాఖ, పోలీసులు, అగ్నిమాపక దళం, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు, వాలంటీర్లు ఆ ప్రాంతంలో సోదాలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని మృతదేహాలు లభ్యమయ్యే అవకాశం ఉందని నిర్ధారణ కావడంతో సోదాలు ముమ్మరం చేశారు. అలాగే, కొండచరియలు విరిగిపడిన పుంఛిరిమట్టు, ముండక్కై, చురల్‌మల తదితర ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున సోదాలు కొనసాగుతున్నాయి.

బుద్ధదేవ్‌కు సీఐటీయూ, వ్యకాస నేతల నివాళి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఐ(ఎం) నేత, పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం కోల్‌కతాలో ఆయన భౌతికకాయంపై అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తదితరులు పుష్పగుచ్ఛాన్ని వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బుద్ధదేవ్‌తో తమకున్న అనుభవాలను పంచుకున్నారు. పశ్చిమబెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వంలో మూడు దశాబ్దాల పాటు మంత్రిగా, ముఖ్యమంత్రిగా విధానాల రూపకల్పనలో బుద్ధదేవ్ విశిష్ట పాత్ర పోషించారని కొనియాడారు. కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు అనుకూలంగా అనేక చట్టాలు చేసి అండగా నిలిచారని చెప్పారు. పారిశ్రామికీకరణకు, కార్మిక హక్కుల కోసం అలుపెరుగని కృషి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ విలువలకు కట్టుబడి పద్మవిభూషణ్ లాంటి పురస్కారాలను సైతం తృణీకరించిన గొప్ప నేత అని కొనియాడారు. ఆయన తణీకరించిన గొప్ప నేతని కొనియాడారు. ఆయన కన్నుమూత పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమంతో పాటు దేశంలో జరుగుతున్న వామపక్ష పునరేకీకరణ ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఆయన లేని లోటుని ఎవరూ పూడ్చలేరని చెప్పారు. ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుద్ధదేవ్ భట్టాచార్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించిన వారిలో సీఐటీయూ ఆలిండియా కౌన్సిల్ సభ్యులు ఎస్వీ రమ, పి.జయలక్ష్మీ, భూపాల్, జె.వెంకటేష్, ఎం.పద్మశ్రీ, కళ్యాణం వెంకటేశ్వరరావు, జె.మల్లికార్జున్, టి.వీరారెడ్డి, కె.ఈశ్వర్ రావు, ఆర్.కోటంరాజు, వంగూరు రాములు, వీఎస్.రావ్, బి.మధు, జె.చంద్రశేఖర్, ఆర్.త్రివేణి, ఎ.నాగేశ్వరరావు ఉన్నారు.

స్వేచ్ఛా ప్రపంచంలోకి మనీశ్ సిసోడియా

- సుప్రీం బెయిల్ మంజూరు
- శిక్ష పేరుతో బెయిల్‌ను నిలుపుచేయలేం
- సీబీఐ, ఈడీలనుద్దేశించి కీలక వ్యాఖ్యలు
- నియంతృత్వానికి చెంప పెట్టు : ఆప్



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీ లాండరింగ్ అభియోగాలను ఎదుర్కొంటున్న ఆప్ నేత, ఢిల్లీ డిప్యూటీ ముఖ్యమంత్రి మనీశ్ శిసోడియాకు సుప్రీం కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఆ వెంటనే ఆయన తీహార్ జైలు నుండి విడుదలయ్యారు. ఈ కేసులో గతేడాది ఫిబ్రవరిలో ఆయనను సిబిఐ అరెస్టు చేసింది. దాదాపు 17 నెలలుగా ఆయన జైల్లోనే వున్నారు. ఈ నేపథ్యంలో ఆయన బెయిల్‌పై విచారణ సందర్భంగా సుప్రీం సీబీఐ,ఈడీలనుద్దేశించి కీలక వ్యాఖ్యలు చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించి ప్రతి రోజూ కీలకమైనదేనని, లెక్కలోకి వస్తుందని పేర్కొంది. సత్వర విచారణ, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులు అత్యంత పవిత్రమైనవని వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తి చేసిన నేరం చాలా తీవ్రమైనదన్న కారణంగా ఆ వ్యక్తికి శిక్షగా బెయిల్‌ను నిలుపుచేయలేమని పేర్కొంది. అపరిమితమైన కాలం ఆయనను జైల్లో వుంచడం వల్ల రాజ్యాంగంలోని 21వ అధికరణ కింద ఆయన స్వేచ్ఛ హక్కు ఉల్లంఘించబడిందని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.

ఈడీ, సీబీఐలు దాఖలు చేసిన కేసుల్లో శిసోడియాకు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.10లక్షల పూచీకత్తుపై ఆయనను విడుదల చేయాలని ఆదేశించింది. ఆప్ నేత తన పాస్‌పోర్ట్‌ను అప్పగించాలని, ప్రతి సోమవారం పోలీసు స్టేషన్‌కు వచ్చి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

ఢిల్లీ సెక్రెటేరియట్‌కు వెళ్లకుండా శిసోడియాను నిషేధించాలని ఈడీ, సీబీఐ చేసిన అభ్యర్ధనను జస్టిస్ గవాయ్ తోసిపుచ్చారు. సమాజంలో ఆయనకు లోతైన మూలాలు వున్నాయని, ఆయన ఎక్కడకూ పారిపోలేరని, సాక్షులను లేదా సాక్ష్యాధారాలను ప్రభావితం చేయలేరని కోర్టు పేర్కొంది. విచారణ సమీప భవిష్యత్తులో ముగిసే అవకాశాలు అస్సలు కనిపించడం లేదని పేర్కొంది. 493మంది సాక్షులు వున్నారని,వెయ్యికి పైగా డాక్యుమెంట్లు వున్నాయని, వాటికి సంబంధించి లక్షకు పైగా పేజీలు వున్నాయని అన్నారు.

విచారణను జాప్యం చేయడానికి విచారణా కోర్టులో పనికిమాలిన దరఖాస్తులను శిసోడియా దరఖాస్తు చేశారని ఈడీ, సీబీఐలు చేసిన వాదనను కోర్టు కొట్టిపారేసింది. సీబీఐ కేసులో 13, ఈడీ కేసులో 14 అప్లికేషన్లు ఆయన పెట్టుకున్నారని జస్టిస్ గవాయ్ తెలిపారు. అనారోగ్యంతో వున్న తన భార్యను చూసేందుకు అనుమతి కోరడం, గల్లంతైన డాక్యుమెంట్లకు సంబంధించిన సమాచారం వరకు అనేక అంశాలపై ఆయన అప్లికేషన్లు పెట్టారని చెప్పారు. విచారణా కోర్టు వీటన్నింటినీ అనుమతించిందని, ఏ ఒక్కదాన్ని పనికిరానిదని కొట్టివేయలేదని జస్టిస్ గవాయ్ గుర్తు చేశారు. గతేడాది ఫిబ్రవరి 26న ఆప్ నేతను సీబీఐ అరెస్టు చేసింది. మార్చి 9న ఈడీ మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేసింది.

17నెలల తర్వాత జైలు నుంచి..

ఎలాంటి విచారణ లేకుండా 17నెలల పాటు జైల్లో మగ్గిన మనీశ్ శిసోడియా, సుప్రీం ఉత్తర్వులు వెలువడిన వెంటనే శుక్రవారం సాయంత్రం తీహార్ జైలు నుంచి విడుదలై స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. ఈ ఉత్తర్వుల తర్వాత బాబా సాహెబ్ అంబేద్కర్‌కు రుణపడినట్టు భావిస్తున్నానని శిసోడియా వ్యాఖ్యానించారు. పెద్దసంఖ్యలో ఆప్ మద్దతుదారులు జైలు వద్దకు చేరుకుని తమ ప్రియతమ నేతకు స్వాగతం పలికారు. జైలు బయట వారినుద్దేశించి శిసోడియా మాట్లాడారు. ఢిల్లీ ప్రజల సంక్షేమం కోసం నేను బయటకు వచ్చానని వ్యాఖ్యానించారు. ఇన్ని నెలల పోరాటంలో ఇంతమంది తనతో వున్నందుకు ఆనందంగా వుందని అన్నారు. కేజ్రీవాల్, కేజ్రీవాల్ అన్న నినాదాల మధ్య ఆయన మాట్లాడారు. నియంతృత్వానికి చెంపపెట్టుగా, రాజ్యాంగమన్న అధికారాన్ని ఉపయోగించిన సమున్నత న్యాయస్థానానికి తాను కృతజ్ఞుడినని వ్యాఖ్యానించారు.రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఈ రెండింటి శక్తి సామర్థ్యాల వల్లనే తాను బెయిల్ పొందగలిగానని పేర్కొన్నారు. మన నేత అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇదే అధికారంతో బయటకు వస్తారని ఆకాంక్షించారు.

"ఈనాడు నిజం గెలిచింది. అంతిమంగా గెలుపు సాధించేది నిజమొక్కటే." అని ఢిల్లీ ముఖ్యమంత్రి అధికార హ్యాండిల్ అయిన టీమ్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇదే కేసులో కేజ్రీవాల్ కూడా తీహార్ జైల్లోనే వున్నారు.

ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)


పార్లమెంట్ సమావేశాలు జరగాల్సి ఉంది. కానీ శుక్రవారంతోనే పార్లమెంట్ సమావేశాలను ముగించేశారు.

లోక్‌సభ 136 శాతం ఉత్పాదకత జరిగింది. అలాగే 115 గంటల పాటు కార్యకలాపాలు జరిగాయి. కేంద్ర బడ్జెట్‌పై 27.19 గంటల పాటు చర్చ జరిగింది. 181 మంది సభ్యులు ఈ చర్చలో పాల్గొన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జులై 30న చర్చకు సమాధానమిచ్చారు. జులై 30 నుంచి ఆగస్టు 5 వరకు ఎంపిక చేసిన మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్ల డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌పై చర్చ జరిగింది. అనంతరం డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌ను ఆమోదించారు. ఆగస్టు 5న కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన బిల్లును లోకసభ ఆమోదించింది.

ఈ సమావేశాల్లో 12 బిల్లులు ప్రవేశపెట్టగా, నాలుగు బిల్లులు ఆమోదం పొందాయి. ఫైనాన్స్ బిల్లు, కేటాయింపు బిల్లు, జమ్మూ కాశ్మీర్ విభజన బిల్లు, ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ బిల్లును ఆమోదించారు. 15 రోజుల పాటు జరిగిన ఈ సమావేశంలో 86 ప్రశ్నలను సభ్యులు సభలోనే అడగగా, కేంద్ర మంత్రులు సమాధానం ఇచ్చారు. అలాగే వివిధ అత్యవసర, ప్రజా ప్రాముఖ్యత కలిగిన 400 అంశాలను సభ్యులు లేవనెత్తారు. రూల్ 377 కింద 358 అంశాలను లేవనెత్తారు. 73ఏ కింద 25 స్టేట్‌మెంట్‌లు, ప్రభుత్వ పనికి సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రెండు స్టేట్‌మెంట్‌లు, బంగ్లాదేశ్, ఒలింపిక్స్‌లో రెజ్లర్ వినేష్ ఫోగట్ అనర్హత వంటి మూడు అంశాలపై సంబంధిత మంత్రులు స్టేట్‌మెంట్లు సహా మొత్తం 30 స్టేట్‌మెంట్‌లు ఇచ్చారు.

ఒలింపిక్ క్రీడల కోసం ఇండియా సన్నాహాలకు సంబంధించి రూల్ 193 కింద స్వల్పకాలిక చర్చ జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టంపై రూల్ 197 కింద కాలింగ్ అటెన్షన్ మోషన్‌పై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో 65 ప్రయివేట్ బిల్లులను ప్రవేశపెట్టారు. దేశంలో విమానచార్జీల నియంత్రణకు తగిన చర్యలపై ఎంపీ షఫీ పరంబిల్ ప్రవేశపెట్టిన ప్రయివేట్ మెంబర్ బిల్లుపై చర్చ జరిగింది.

రాజ్యసభలో కేంద్ర బడ్జెట్‌పై 21.48 గంటల పాటు చర్చ జరిగింది. వ్యవసాయం, పట్టణ వ్యవహారాలు, విద్యుత్ మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్ల డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌పై చర్చ జరిగింది. బంగ్లాదేశ్ పరిస్థితులపై కేంద్ర మంత్రి స్టేట్‌మెంట్ ఇచ్చారు. రాజ్యసభ మొత్తం 90.35 గంటల పాటు లోక్‌సభ కార్యకలాపాలు జరిగాయి. ఈ పార్లమెంట్ సమావేశాలను నీట్ లీకేజీ వ్యవహారం, రైల్వే భద్రత, ధరలు పెరుగుదల తదితర అంశాలు ఉభయ సభలను కుదిపేశాయి.



విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా జైరాం రమేష్ ప్రివిలేజ్ మోషన్

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా జైరాం రమేష్ ప్రివిలేజ్ మోషన్ ప్రవేశపెట్టారు. శుక్రవారం రాజ్యసభలో కొన్ని ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి రాజ్యాంగం ఉపోద్ఘాతం తొలగించినందుకు విద్యా మంత్రికి వ్యతిరేకంగా జైరాం రమేష్ ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెట్టారు. కొన్ని ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచి ఉపోద్ఘాతం తొలగించడం గురించి సభను తప్పుదారి పట్టించారని ఆరోపిస్తూ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ రాజ్యసభలో ప్రివిలేజ్ మోషన్ నోటీసును సమర్పించారు.

ఎదురుచూపులు



- ఇంకా రుణమాఫీ కానీ రైతులు 30 లక్షల మంది
- అన్నదాతకు అనుమానాలెన్నో
- సర్కారుకు సవాలెన్నో
- ఆగస్టు 15 తర్వాతే వారిపై ఫోకస్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు రుణమాఫీ ప్రక్రియ కొనసాగు తున్నది. ఇప్పటికే రెండు దఫాలుగా రుణమాఫీ జరిగింది. ఈనెల 14న మూడో దఫా ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలో ప్రారంభించాలని సర్కారు నిర్ణయించింది. కానీ రెండు దఫాల్లో రుణమాఫీ కాని రైతులు 30 లక్షల మంది ఉన్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కూడా భరోసా ఇచ్చారు. కానీ రుణమాఫీ కాని రైతులను మాత్రం ఆందోళన నీడలా వెంటాడుతున్నది. మూడో దశ రుణమాఫీ ముగిసిన తర్వాత ఇంకెంత మంది రుణమాఫీ కాని రైతులు తేలుతారో తెలియదు. ఈ లెక్కన రుణమాఫీ కాని రైతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో రైతులు తమకు రుణమాఫీ అవుతుందో, లేదో, అయితే ఎప్పటిలోగా అవుతుందో, సాకులు చూపించి ఎగ్గొడుతుందా? ఇలాంటి అనుమానాలెన్నో రైతులను తొలిచివే స్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ రుణం మాఫీ అవుతుందన్న భరోసాతో రెన్యూవల్ చేసుకుంటూ వస్తున్నారు. తీరా సాంకేతిక సమస్యలు సదరు రైతులను ఇబ్బందుల్లోకి నెట్టాయి. దీంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. 30 లక్షల మందిలో కొన్ని బ్యాంకులు చేసిన పొరపాట్లు ఉండగా, మరికొన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు కూడా ప్రతిబంధకంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులు నిర్లక్ష్యంగా రైతుల డేటాను తప్పుడుగా పంపించారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా అత్యధికంగా రుణాలిస్తున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతుల జాబితాను తప్పుగా పంపించాయనీ, దానికి అంతర్గత విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. వాణిజ్య బ్యాంకులు కూడా సరైన సమాచారం పంపకపోవడం వల్ల కూడా కొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదని రైతులు చెబుతున్నారు. ఇన్ని చిక్కుముడుల మధ్య సర్కారుకు సవాలెన్నో ఎదురు కానున్నాయి. ఇప్పటికే రేషన్‌కార్డు, పాస్‌బుక్ అని నిబంధన పెట్టింది. ఆ తర్వాత పాస్ బుక్‌ను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుం టామని ప్రకటించింది. కానీ చాలా బ్యాంకులు రేషన్‌కార్డు, పాస్‌బుక్‌ను పరిగణనలోకి తీసుకుని జాబితా రూపొందించినట్టు తేలింది. కొంత మంది రైతులకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ కార్డు లింక్ కాలేదు. కొంత మంది రైతుల ఫోన్ నెంబర్లు లింక్ చేయించుకోలేదని తెలిసింది. బ్యాంక్ ఖాతాను రెగ్యులర్‌గా ఉపయోగించకపోతే అది స్తంభించడం కూడా జరుగుతుంది. రెన్యూవల్ చేయకపోతే రుణం కూడా ఎక్కువగా చూపిస్తున్నది. వీటన్నింటిని పరిశీలించిన తర్వాతే సర్కారు ముందుకు పోవాలని భావిస్తున్నది. రుణమాఫీ కాని రైతుల సమస్యల పరిష్కారం కోసం సర్కారు ప్రాథమికంగా కొన్ని నిర్ధారణలకు వచ్చినట్టు తెలిసింది. తొలుత కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. తెల్ల రేషన్‌కార్డు లేని వారికి తహసీల్దార్ నిర్ధారణకు ఆదేశించాలా? లేక రైతు సెల్ఫ్ సర్టిఫికేట్ ఇవ్వాలా? చివరకు గ్రామ సభల్లో రుణమాఫీ కాని రైతులను ఎంపిక చేయాలా? అనే అంశాలను సర్కారు ప్రాథమికంగా చర్చించినట్టు అధికార వర్గాలు చెప్పాయి.

నవతెలంగాణ

పతనం సంపూర్ణ వ్యక్తిగా మారిస్తే.. చర్చ సన్నద్ధుడిని చేస్తుంది. రాయడం వల్ల నిర్దిష్టత చేకూరుతుంది - ఫ్రాన్సిస్

సంపాదకీయం

ఉద్యమ పథికులు



అది టూరిస్టు బస్సూ కాదు, వాళ్ళు టూరిస్టులంతకంటే కాదు. 'సింగరేణి పరిరక్షణ యాత్ర' లక్ష్యం దానిని కాపాడుకోవడం ఒక్కటే కాదు. బొగ్గు బ్లాకులను వేలం వేస్తే, అక్షరాల సింగరేణిని 'కరిమింగిన వెలగపండు'లా మిగిలితే ముందు ఆ కార్మికులకు జరిగే నష్టం, మన తెలంగాణకు జరిగే నష్టం వివరించడం ఒకటికాగా, దానికి కారణమైన కేంద్ర ప్రభుత్వ విధానాలను, దానికి వంతపాడే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను అర్థం చేయించడం మరో కీలక లక్ష్యం. ఆ విధానాలను వ్యతిరేకించి ఓడించకుండా కార్మికుల రోజువారీ సమస్యలు సైతం పరిష్కారం కావడం కష్టమనే అంశాన్ని అర్థం చేయించడం కీలక విషయం. అప్పుడేకదా మోడీ సర్కార్ ఎటు నడుస్తుందో, దేశాన్ని ఏ కార్పొరేట్ భోషాణాల లాబీల్లోకి తీసుకుని పోతోందో కార్మికులకు, సాధారణ ప్రజలకు అర్థమయ్యేది.

బూర్జువా పార్టీలన్నీ ఏకోన్ముఖంగా సింగరేణి వేలం పాటకు 'సై' అంటున్నాయి. వారి కార్మిక సంఘాల నాయకత్వం వారి పార్టీల వైఖరి తప్పని తెల్సినా, వారి మాట జవదాటలేరు. అయితే ఇక్కడ సమస్య పార్టీలదీ కాదు, యూనియన్ నాయకులదీ కాదు. సమస్య తెలంగాణ అస్థిత్వానిది. నాలుగు కోట్ల ప్రజల జీవితాలకి సంబంధించి నది. ఒకరి జెండా ఒకరు మోయాల్సిన అవసరం లేదు. ఏ సంఘం, ఏ పార్టీ జెండా వారే ఎత్తుకుని రంగంలోకి దూకాల్సిన సమయమిది.

"అందరూ శ్రీ వైష్ణవులే.. మధ్యలో రొయ్యల బుట్ట మాత్రం మాయమైంద"న్నట్టు ప్రస్తుత తెలంగాణ రాజకీయం నడుస్తోంది. "మా సింగరేణిని ప్రయివేటీకరించవద్దని" కేసీఆర్ అంటాడు. రేవంత్‌రెడ్డి సర్కారూ అదే పల్లవి అందుకుంటుంది. ఆశ్చర్యకరంగా మోడీ "సింగరేణిని ప్రయివేటీకరించం" అంటాడు. మరి, వారి వారి అస్మదీయులకు వేలంపాటలో కట్టబెట్టిందీ, కట్టబెడుతోంది ఎవరు? ఈ పని దేశవ్యాప్తంగా చేసేదెవరు? దేశవ్యాప్తంగా ఉన్న 500పై చిలుకు బొగ్గు బావుల్లో 300 ఇప్పటికే వేలం పాటలో ఇచ్చేశాం అని మొన్ననే కేంద్ర గనుల మంత్రి సర్వశ్రీ కిషన్‌రెడ్డి చెప్పగా విన్నవారు విస్తుపోయారు. పైగా దానివల్ల రాష్ట్రాల రెవెన్యూ పెరుగుతుందని మరో చౌకబారు వాదన చేశారు. ఆయన చెప్పిన వేల కోట్ల రూపాయల ఆదాయం ఏ రాష్ట్రానికి పెరిగిందో చెప్పి ఉంటే సంతోషించేవారం. అంటే తవ్వే బొగ్గులో రాష్ట్ర ప్రభుత్వానికి "రెవెన్యూ షేరింగ్" ద్వారా వచ్చే ఆదాయం, అంటే 30 ఏండ్లపాటు రానున్న ఆదాయం గురించి మన బొగ్గు శాఖామాత్యులవారు సెలవిచ్చేది!

పాలకులు, వారి యజమానులు ఎప్పటికప్పుడు వచ్చే విమర్శలనుబట్టీ తమ విధానాలను సరిచేసుకుంటూ ముందుకు పోతారనేందుకు మోడీనే పెద్ద ఉదాహరణ. మన్మోహన్ సర్కార్ పూర్తిగా బద్నామ్ అయ్యింది "కోల్ గేట్" కుంభకోణం తోనే. ఇప్పుడున్న పెట్టుబడిదారుల బృందాలన్నీ ఆనాడున్నాయి. థర్మల్ స్టేషన్లను అనుమతించి, దానికవసరమైన బొగ్గు తవ్వుకునేందుకు క్యాప్టివ్ మైన్స్ ఇచ్చారు. దేశంలోని కోల్‌మైన్స్ చట్టాన్ని సవరించకుండానే ఇష్టారాజ్యంగా బొగ్గుతవ్వుకున్నారు. మన్మోహన్ సర్కార్‌కు ఒళ్ళంతా మసి అంటింది.

నేడు కోల్ బేరింగ్ ఏరియాస్ (అక్విజిషన్ అండ్ డెవలప్‌మెంట్) యాక్ట్ (1957)ను సవరించారు. కోకింగ్ కోల్‌మైన్స్ (నేషనలైజేషన్ యాక్ట్ 1972), కోల్‌మైన్ నేషనలైజేషన్ యాక్ట్ (1973) సవరించారు. సమస్య ఏమంటే పార్లమెంటులో ఈ సవరణలు పాస్ చేసుకునే సమయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు ఏ పక్క నిల్చుని ఉన్నారు? దీనిపై ఆ పార్టీల విధానమేమిటి? సింగరేణి గురించి బట్టలు చించుకుంటూ మాట్లాడే ఈ రెండు పార్టీల నేతలు దీనికి సమాధానం సింగరేణి కార్మికులకు, రాష్ట్ర ప్రజలకు వివరణిస్తే తెలంగాణ సమాజం సంతోషిస్తుంది.

కొత్తగా నిర్మిస్తున్న యదాద్రి పవర్ ప్లాంట్ తప్ప మన రాష్ట్రంలోని థర్మల్ స్టేషన్లన్నీ దాదాపు పిట్‌హెడ్ స్టేషన్లే (బొగ్గు బావి సమీపంలోని పవర్‌ప్లాంట్లే). బొగ్గు రవాణా ఖర్చు తక్కువ. విద్యుదుత్పత్తి చౌక. రాష్ట్ర ప్రజానీకానికి చౌకైన విద్యుత్ అందించడంలో సింగరేణి పాత్ర కీలకం. ఒకసారి వేలంలో పాడుకున్న వ్యక్తి లేదా సంస్థ బొగ్గు తవ్వుతారో లేదో తెలీదు. తవ్విన బొగ్గు ఇక్కడే అమ్మాలనే రూల్ లేదు. అమ్మినా సింగరేణిచ్చిన రేటుకే ఇస్తారనే గ్యారంటీ లేదు. ఇన్ని 'ఇఫ్'లు, 'బట్'ల మధ్య రాష్ట్ర విద్యుత్‌రంగం దెబ్బతింటూంటే దానికి సింగరేణి బొగ్గు బ్లాకుల వేలమే కారణం.

దాదాపు బూర్జువా పార్టీలన్నీ ఏకోన్ముఖంగా బొగ్గు బ్లాకుల వేలం పాటకు 'సై' అంటున్నాయి. వారి కార్మిక సంఘాల నాయకత్వం వారి పార్టీల వైఖరి తప్పని తెల్సినా, వారి మాట జవదాటలేరు. అయితే ఇక్కడ సమస్య పార్టీలదీ కాదు, యూనియన్ నాయకులదీ కాదు. సమస్య తెలంగాణ అస్థిత్వానిది. నాలుగు కోట్ల ప్రజల జీవితాలకి సంబంధించినది. ఒకరి జెండా ఒకరు మోయాల్సిన అవసరం లేదు. ఏ సంఘం, ఏ పార్టీ జెండా వారే ఎత్తుకుని రంగంలోకి దూకాల్సిన సమయమిది.

సకల జనుల సమ్మెతో రోజుల తరబడి రాష్ట్రాన్ని స్తంభింపజేసి 29వ రాష్ట్ర ఏర్పాటుకు బాటలు పరిచిన కార్మికవర్గం, నేడు తెలంగాణ పునాదులనే పెకలించచూస్తున్న పాలకులపై తిరగబడలేమా? సింగరేణిని కాపాడుకుంటే అది అంతటితో ఆగదు. నేషనల్ మోనిటైజేషన్ పైప్‌లైన్ బద్దలౌతుంది. పాలకులు చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదన్న విషయం బహిర్గతమవుతుంది. అదే జరిగితే బస్సు యాత్ర సఫలమైనట్టే లెక్క.

ప్రభుత్వోద్యోగుల్ని ఆరెస్సెస్‌లో చేరేందుకు అనుమతించాలా?



రామ్ పునియానీ

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ. హిందూ రాజ్య స్థాపన దాని లక్ష్యం. కానీ అది మోసపూరితంగా ఒక సాంస్కృతిక సంస్థ అని చెప్పుకుంటుంది. అది మన రాజ్యాంగంలో వక్కాణించబడిన భారత జాతీయవాదానికి విరుద్ధంగా హిందూ జాతీయవాదం కోసం కృషి చేస్తుంది. ఇది హిందువులను ఒక జాతిగా పరిగణిస్తుంది కాబట్టి దానికి అనుగుణంగానే తన లక్ష్యాలను నిర్దేశించుకుంది. భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి, మనదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలని బీజేపీకి చెందిన నాయకులు పదే పదే డిమాండ్ చేస్తున్నారు. ఆరెస్సెస్ సర్సంగ్ చాలక్ కె.సుదర్శన్ 2000 సంవత్సరంలో ఆరెస్సెస్ అధినేతగా ఎన్నికైన సందర్భంగా ఇదే విషయాన్ని ప్రకటించాడు. బీజేపీ స్వయం సమృద్ధి చెందిందని, ఎన్నికల ప్రచారంలో ఆరెస్సెస్ మద్దతు తమకు అవసరం లేదని, 2024 ఎన్నికలకు ముందు బీజేపీ అధ్యక్షుడు జే.పీ.నడ్డా ప్రకటన చేశాడు. కానీ 2019 ఎన్నికల వరకు బీజేపీకి, ఆరెస్సెస్ మద్దతుగా నిలిచింది. ఆరెస్సెస్ ప్రతిజ్ఞ, ప్రార్థనలు తన లక్ష్యం గురించి మనకు ఏమి చెప్తాయి?

భారతీయ జనతాపార్టీ (బీజేపీ)ని, దాని రాజకీయ సంతతిని రూపొందించడంలో ఆరెస్సెస్ పాత్రను, ఆరెస్సెస్ నాయకుల రచనలు, వారి చర్యల ద్వారా తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. బీజేపీకంటే ముందుగా ఉన్న భారతీయ జనసంఘ్ స్థాపనలో హిందూ మహాసభ నాయకుడైన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, ఆరెస్సెస్‌తో కలిసి పని చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఆరెస్సెస్ ప్రధాన సిద్ధాంతకర్త, నాటి ఆరెస్సెస్ అధినేత ఎం.ఎస్.గోల్వాల్కర్ (గురూజీ), జనసంఘ్ లేక బీజేపీలో శిక్షణ పొందిన ఆరెస్సెస్ స్వయం సేవకులు, ప్రచారకుల పాత్రను గురించి వివరించాడు.

గోల్వాల్కర్ ఇలా రాశాడు: "ఉదాహరణకు, మాలో కొంతమంది స్నేహితులకు వెళ్లి రాజకీయాల్లో పనిచెయ్యాలని చెపితే, వారికి దానిలో ఆసక్తి ఉందని లేదా రాజకీయాలు వారికి ప్రేరణ అని అర్థం కాదు. నీరు లేని చోట చేపలు చనిపోయిన విధంగా వారు రాజకీయాల కోసం మరణించరు. ఒకవేళ రాజకీయాల నుండి విరమించుకోవాలని వారికి చెప్పినా గానీ వారికెలాంటి అభ్యంతరం ఉండదు. వారి విచక్షణతో ఎలాంటి అవసరం ఉండదు." జనసంఘ్ లేదా బీజేపీ, ఆరెస్సెస్ సూచనలను తప్పకుండా అనుసరించాలనే విషయాన్ని ఇది స్పష్టంగా తెలియజేస్తుంది.

గురూజీ ఇంకా ఇలా చెప్పాడు: "మా స్వయం సేవకుల్లో కొందరు (కార్యకర్తలు) రాజకీయాల్లో పనిచేసే విషయం మాకు తెలుసు. అక్కడ వారు బహిరంగ సభలు, ప్రదర్శనలకు సంబంధించిన పని చెయ్యాలి, నినాదాలు ఇవ్వాల్సి ఉంటుంది."



గోల్వాల్కర్ ఇలా రాశాడు: "ఉదాహరణకు, మాలో కొంతమంది స్నేహితులకు వెళ్లి రాజకీయాల్లో పనిచెయ్యాలని చెపితే, వారికి దానిలో ఆసక్తి ఉందని లేదా రాజకీయాలు వారికి ప్రేరణ అని అర్థం కాదు. నీరు లేని చోట చేపలు చనిపోయిన విధంగా వారు రాజకీయాల కోసం మరణించరు. ఒకవేళ రాజకీయాల నుండి విరమించుకోవాలని వారికి చెప్పినా గానీ వారికెలాంటి అభ్యంతరం ఉండదు. వారి విచక్షణతో ఎలాంటి అవసరం ఉండదు." జనసంఘ్ లేదా బీజేపీ, ఆరెస్సెస్ సూచనలను తప్పకుండా అనుసరించాలనే విషయాన్ని ఇది స్పష్టంగా తెలియజేస్తుంది.

ఆ లక్ష్యాలకు అనుగుణంగానే ఆరెస్సెస్, స్వయం సేవకుల్ని పెంచి పోషించి, శిక్షణ ఇచ్చిన తరువాతనే అనేక సంస్థల్ని ప్రారంభించింది. మహాత్మాగాంధీ హంతకుడైన నాథూరామ్ గాడ్సే ఒక శిక్షణ పొందిన ఆరెస్సెస్ ప్రచారకుడు. ఆరెస్సెస్ సభ్యత్వానికి సంబంధించి ఎలాంటి రికార్డులు ఆ సమయంలో దాచిపెట్టలేదు కాబట్టి గాంధీజీ హత్యకు సంబంధించి ఆధారాలేవీ దొరక్కుండా ఆరెస్సెస్ జాగ్రత్త పడింది. హంతకుడు, ఆరెస్సెస్ ముఖ్యుడైన నాథూరామ్ గాడ్సేను సంఘ్ నుండి బహిష్కరించలేదు లేదా అతడు ఆ సంస్థను వదిలిపెట్టి వెళ్లలేదని నాథూరామ్ గాడ్సే కుటుంబం విశ్వసిస్తుంది.

హిందూ జాతీయవాదంపై విజ్ఞాన సంపన్నుడైన షంసుల్ ఇస్లాం ఇలా పేర్కొన్నాడు: "ఆరెస్సెస్ కేంద్ర ప్రచురణ సంస్థ అయిన సురుచి ప్రకాశన్, ఝండేవాలన్, న్యూఢిల్లీ 1977లో 'పరమ్ వైభవ్ కే పాత్ పర్' అనే గ్రంథాన్ని ప్రచురించింది. దానిలో వివిధ లక్ష్యాల సాధన కోసం ఆరెస్సెస్ స్థాపించిన 40కి పైగా సంస్థల వివరాలను ఇచ్చారు. మూడు ప్రధాన సంస్థల్లో బీజేపీ ఒక రాజకీయ సంస్థగా ఉంది. ఏబీవీపీ, హిందూ జాగరణ్ మంచ్, విశ్వహిందూ పరిషత్, స్వదేశీ జాగరణ్ మంచ్, సంస్కార్ భారతి లాంటి సంస్థలు ఆ జాబితాలో ఉన్నాయి.

అదేవిధంగా ఆరెస్సెస్ ప్రార్థన, ప్రతిజ్ఞలు, సంఘ్ అనుచరులు హిందూ దేశానికి కట్టుబడి ఉన్నట్టు స్పష్టం చేస్తాయి. ఆరెస్సెస్ ప్రార్థన ఇలా: "ఓ ప్రభువా, హిందూ రాజ్యంలో అంతర్భాగంగా ఉన్న మేము నీకు గౌరవంతో వందనం చేస్తున్నాం/నీ కోసం మేము నడుం బిగించాం/దీని సాధన కోసం మాకు మీ ఆశీర్వాదాలివ్వండి." ప్రతిజ్ఞ కూడా అంతే సూటిగా ఉంది: "నా పవిత్రమైన హిందూ మతం, హిందూ సమాజం, హిందూ సంస్కృతిని పెంపొందించడం ద్వారా భారతవర్ష గొప్పతనాన్ని సాధించడానికి నేను ఆరెస్సెస్ సభ్యుడిని అయ్యాను."

ఆరెస్సెస్ ఒక 'సాంస్కృతిక సంస్థ' అనే ముసుగు, అనేకమంది భావోద్వేగాలను ఆకర్షించడం ద్వారా ఆరెస్సెస్ విస్తరించడానికి ఉపయోగపడుతుంది. ఆరెస్సెస్ స్వభావం గురించి స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో పాల్గొన్న ముఖ్యమైన నాయకులకు స్పష్టత ఉంది. పంజాబ్ శరణార్థుల కోసం వాఘా వద్ద ఏర్పాటు చేసిన ఒక ప్రధాన రవాణా శిబిరంలో ఆరెస్సెస్ కార్యకర్తలు ప్రదర్శించిన వారి సామర్థ్యం, క్రమశిక్షణ, ధైర్యసాహసాలను గాంధీజీ పరివారంలోని ఒక సభ్యుడు ప్రశంసించాడు.'హిట్లర్ నాజీలు, ముస్సోలినీ నాయకత్వంలోని ఫాసిస్టులు కూడా అలానే ఉంటారనే' విషయాన్ని మర్చిపోకూడదని గాంధీజీ వెంటనే తిరిగి చమత్కరించాడు. ఆరెస్సెస్, ఒక నిరంకుశ దృక్పథం గల మత సంస్థ అని గాంధీ వర్ణించాడు.

ఆరెస్సెస్ ఒక 'సాంస్కృతిక సంస్థ' అనే ముసుగు, అనేకమంది భావోద్వేగాలను ఆకర్షించడం ద్వారా ఆరెస్సెస్ విస్తరించడానికి ఉపయోగపడుతుంది. ఆరెస్సెస్ స్వభావం గురించి స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో పాల్గొన్న ముఖ్యమైన నాయకులకు స్పష్టత ఉంది. పంజాబ్ శరణార్థుల కోసం వాఘా వద్ద ఏర్పాటు చేసిన ఒక ప్రధాన రవాణా శిబిరంలో ఆరెస్సెస్ కార్యకర్తలు ప్రదర్శించిన వారి సామర్థ్యం, క్రమశిక్షణ, ధైర్యసాహసాలను గాంధీజీ పరివారంలోని ఒక సభ్యుడు ప్రశంసించాడు.'హిట్లర్ నాజీలు, ముస్సోలినీ నాయకత్వంలోని ఫాసిస్టులు కూడా అలానే ఉంటారనే' విషయాన్ని మర్చిపోకూడదని గాంధీజీ వెంటనే తిరిగి చమత్కరించాడు. ఆరెస్సెస్, ఒక నిరంకుశ దృక్పథం గల మత సంస్థ అని గాంధీ వర్ణించాడు.

ఆరెస్సెస్‌కు ఫాసిజం లక్షణాలు ఉన్నాయని నెహ్రూ అభిప్రాయం. "ఆరెస్సెస్ చాలా రహస్యంగా ఉంటుంది. దాని ఫలితంగానే అది ఫాసిస్ట్ మార్గాల్లో అభివృద్ధి చెందింది. అది కచ్చితంగా ప్రజల శాంతియుత సహజీవనానికి విఘాతం కలిగిస్తుందని" భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ అభిప్రాయపడ్డాడు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇలా అన్నాడు: "గాంధీజీ హత్య కేసుకు సంబంధించి మా వద్ద ఉన్న నివేదికల ప్రకారం ఆరెస్సెస్, హిందూ మహాసభల కార్యకలాపాల ఫలితంగా ముఖ్యంగా ఆరెస్సెస్ కార్యకలాపాలు దేశంలో ఇలాంటి ఘోరమైన విషాదం చోటు చేసుకునే వాతావరణాన్ని సృష్టించాయి.

ఆరెస్సెస్ కార్యకలాపాలు ప్రభుత్వం, రాజ్యం ఉనికికి ముప్పును కలిగించాయి. నిషేధం విధించినప్పటికీ కూడా ఆ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టలేదని మా నివేదికలు చెబుతున్నాయి. వాస్తవానికి, సమయం గడిచేకొద్దీ ఆరెస్సెస్ వర్గాలు మరింత ధిక్కారాన్ని ప్రదర్శిస్తూ, విధ్వంసపూరిత చర్యలకు పాల్పడుతున్నాయి."

ఆరెస్సెస్ మూడుసార్లు నిషేధించబడి, సాంస్కృతిక సంస్థ అనే ముసుగును ధరించడం ద్వారా ఆ నిషేధం నుండి బయటపడిన విషయాన్ని మనం గుర్తుచేసుకోవాలి. ప్రభుత్వోద్యోగులు రాజకీయాల్లో పాల్గొనడంపై విధించిన నిషేధం, మన(బ్యూరోక్రసీ) ఉద్యోగస్వామ్యం రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉందనీ, రాజకీయ పక్షపాతం లేకుండా ఉందనే విషయాన్ని నిర్ధారిస్తుంది. ఆరెస్సెస్ కార్యక్రమాల్లో పాల్గొనే ప్రభుత్వోద్యోగులపై విధించిన ఈ నిషేధం యాభై సంవత్సరాలకు పైగా అమలులో ఉంది. ఇలా జరగడం ఇది మూడోసారి.

జనతాపార్టీ, అటల్ బిహారీ వాజపేయిలు కూడా రాజకీయ వ్యవహారాలకు నాయకత్వం వహించారు కానీ ఈ నిషేధాన్ని ఎత్తివేయలేదు. నరేంద్ర మోడీ గడిచిన పది సంవత్సరాలకు పైగా అధికారంలో ఉంటున్నాడు. ఆయన ఇప్పుడు ఈ నిర్ణయం ఎందుకు తీసుకుంటున్నాడు? ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్, అత్యున్నత నాయకుని పై విమర్శలు చేస్తున్న తరువాతే ఈ నిర్ణయమా? భారతీయ సంస్కృతికి, ఆరెస్సెస్ అందిస్తున్న సేవలను సాంస్కృతిక కార్యకర్తలు, సామాజిక శాస్త్రవేత్తలు అంచనా వేయాల్సిన అవసరం ఉంది. ఆరెస్సెస్ ఒక సాంస్కృతిక సంస్థ అనే ముసుగును తొలగించి, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దాని రాజకీయ ఎజెండాను అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది అత్యున్నతమైన రాజకీయ వేషం.

("ఇండియన్ కరెంట్స్" సౌజన్యంతో)
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451




సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545

'ఒక దేశం - ఒక పన్ను' నేటి కేంద్ర ప్రభుత్వ నినాదం. వస్తుసేవల ఒకే కేంద్ర పన్ను (జి.యస్.టి.) చట్టాన్ని, మరో స్వాతంత్ర వేడుకలా 2017 జులై 1 అర్ధరాత్రి నుండి 5, 12, 18, 28 శాతాల పన్నుతో అస్తవ్యస్తంగా అమలు చేసింది. 1,300 వస్తువులను, 500 సేవలను ఈజాబితాలో చేర్చింది. ఉమ్మడి జాబితా అంశాలరాష్ట్రాల పన్ను వాటాను, రాష్ట్రాల జాబితా అంశాల పన్నును కేంద్రమే వసూలు చేస్తుంది.ఏది వస్తువు, ఏది సేవ,ఏ వస్తువుపై, ఏ సేవపై పన్ను వేయాలి అన్న అంశాలపై కార్పొరేట్ అవగాహనను పాటించింది.

నిత్య జీవితావసరాల సరఫరాతో పాటు ప్రజల చదువులు, ఆరోగ్యం, రోగనిరోధం, వైద్యం, చికిత్స ప్రభుత్వాల బాధ్యత.ఈ బాధ్యత నుండి ప్రభుత్వాలు తప్పుకున్నాయి. వీటి ఖర్చులను 99శాతం ప్రజలు భరించలేరు. ఈ భద్రతారంగ వ్యాపారమే బీమా. ప్రభుత్వరంగ బీమా సంస్థలు తక్కువ ప్రీమియంతో ఎక్కువ సౌకర్యాలు అందిస్తాయి. లాభాల నుండి దేశాభివృద్ధికి నిధులిస్తాయి. బీమా రంగ లాభాలను దోచు కోటానికి ప్రయివేటు బీమా సంస్థలు పుట్టాయి. వస్తువాహనాల భద్రత బాధ్యత కూడా ప్రభుత్వాలదే. వస్తువులకు, వాహనాలకు నష్టం చేయని ప్రమాద నివారణ జాగ్రత్తలను, సౌకర్యాల కల్పనలను ప్రభుత్వాలు చేపట్టాలి. ప్రజారోగ్యం, వస్తు వాహనాల భద్రతలను కాపాడలేని ప్రభుత్వాలే బీమా ఖర్చులను భరించాలి. ప్రభుత్వాలు ఈ ఖర్చులను ప్రజలపైనే రుద్దుతున్నాయి. స్పృహ జాగ్రత్తలు తెలిసినవారే జీవిత, వస్తు వాహనాల బీమా చేసుకుంటారు. బీమా వస్తువూ కాదు, సేవా కాదు. ప్రభుత్వాలు వదిలేసిన బాధ్యత. ప్రజలు మోస్తున్న బరువు. వీటిపై జీఎస్టీ విధించకూడదు.మోడీ సర్కారు జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంపై 18శాతం జీఎస్టీ విధించింది.ఏ దేశంలోనూ బీమాపై ఇంత పన్ను లేదు. దీనితో మోడీ సర్కారు ఏడాది ఆదాయం 24 వేల కోట్లు. ఒక్క ఆరోగ్య బీమా ప్రీమియంలపైనే 2023-24 ఆర్థిక సంవత్స రానికి 8,263 కోట్లు వసూలయిందని కేంద్రమంత్రి లోకసభకు తెలిపారు.

శిస్తు(క్ష)ల 'వికసిత భారత్'




మన దేశంలో ప్రాథమిక హక్కయిన విద్య ప్రయివేటీకరించబడింది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో కార్పొరేటీకరించబడింది. విద్యార్థులను మార్కుల యంత్రాలుగా, డాలర్ల సంపాదకులుగా మానవత్వం నుండి మనిషితత్వం వైపుగా పాశవిక స్థితికి దిగజార్చుతున్నారు. విద్యాసంస్థల్లో బోధించే విద్య పోటీ పరీక్షలకు పనికిరాదు. పదిరకాల ప్రవేశ పరీక్షలకు కోచింగ్ కేంద్రాలు తయారయ్యాయి. 2024కు మూడొంతుల విద్యార్థులకు అనగా పది కోట్ల మందికి ప్రవేశ పరీక్షలు అవసరాలుగానేగాక జీవన విధానంగా మారాయి. ప్రభుత్వాలు ఉపాధి కల్పన నుండి తప్పుకున్నాయి. ఫలితంగా అతి తక్కువ వృత్తి విద్యలకు, ఉద్యోగాలకు పెద్ద సంఖ్యలో విద్యార్థుల మధ్య పోటీ అనివార్యమయింది. 2015లో రూ.24 వేల కోట్లుగా ఉన్న కోచింగ్ మార్కెట్ 2022కు రూ.58 వేల కోట్లకు పెరిగింది. 2028కి రూ.1.33 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. మోడీ సర్కారులో ఇది విపరీతంగా పెరిగింది. పిల్లలకు చదువు చెప్పడం ప్రభుత్వాల సామాజిక బాధ్యత. ఇది వస్తుసేవల పరిధిలోకి ఎలా వస్తుంది? 2014కు ముందు విద్యపై జీఎస్టీ లేదు. కోచింగ్ కేంద్రాల నుండి కోచింగ్ రుసుముల ఆదాయ పన్ను వసూలు చేయాలి. కోళ్లఫారాలుగా నడుపబడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల నుండి ఆదాయ పన్ను వసూలు చేసే ధైర్యం ప్రభుత్వాలు చేయలేవు. చేస్తే పాలక పక్షాల చందాలు, ఎన్నికల ప్రచారం, ఓట్ల సమీకరణ దెబ్బతింటాయి.

విద్యపై 2021లో 2,215 కోట్లు, 2024లో 5,517 కోట్లు18శాతంతో జీఎస్టీ వసూలైంది.మూడేండ్లలో 149శాతం పెరిగింది. 2023-24 విద్యా సంవత్సర లెక్కల ప్రకారం విద్యా సంస్థల నుండి ఉత్తీర్ణులైనవారిలో 51శాతం మాత్రమే ఉద్యోగాలకు పనికి వస్తారు. ఉద్యోగ ప్రావీణ్యతలను పెంచుకోడానికి 2014 కు ముందు జిఎస్టీ లేదు. 2023 లో 18శాతం జీఎస్టీతో ఈ ఖర్చు 34 వేల కోట్లు. విద్యార్థుల ప్రయాణ ఖర్చు, భద్రత సౌకర్యాలు, వసతిగృహాల శుభ్రత, నిర్వహణ ఖర్చు, తిండి పై 18శాతం జీఎస్టీ విధించారు. వీటిపై 2014కు ముందు జీఎస్టీ లేదు. ఎరేజర్లపై 5శాతం, పెన్సిళ్ళు, వాటి ముక్కులు చెక్కే పరికరాలు, జామెట్రీ బాక్సులపై 12శాతం జీఎస్టీ, ప్రాథమిక విద్యపై 3శాతం, ఉన్నత విద్యపై 4శాతం ఎడ్యుకేషన్ సెస్సు విధిస్తారు. విద్యపై 2024లో 62,250 కోట్ల జీఎస్టీ వసూలైంది. విద్యార్థులు విద్యపై 2024 విద్యా సంవత్సరంలో 26.3 లక్షల కోట్లు ఖర్చుపెట్టారు. ఈ ఖర్చు భరించలేనివారెందరో! ఉత్పాదక శక్తిసామర్థ్యాల దేశ నిర్మాతలు, భావి భారత పౌరులు ఎలా తయారవుతారు? ఇన్ని ఖర్చులతో విద్యను కొన్న విద్యార్థులు పౌరజ్ఞానం, సామాజిక బాధ్యతలు గల పౌరులుగా తయారవుతారా?

సామాన్యుల ప్రయాణ సాధనాలైన రైల్వే వస్తువులు, బ్యాగులు, విద్యార్థుల పెన్నులు, మాధ్యమాల పరికరాలు, ముడి ప్రింటు, శబ్దనమోదు పరికరాలు, లైసెన్సులు, అచ్చయిన సమాచారం, ప్యాకేజి పెట్టెలపై12 నుండి 18శాతానికి జీఎస్టీ పెంచింది. లోహాలు, తుక్కు, ప్లాస్టిక్, పాలిథీన్ లపై 5 నుండి 18శాతానికి, విద్యుత్తును పొదుపుచేసే సోలార్ కుక్కర్లు, జీవన అత్యవసరాలైన ఇంధన పునరుత్పత్తి పరికారాలపై 5 నుండి 12శాతానికి, పిల్లల పాల డబ్బాలపై 0 నుండి 12శాతానికి జీఎస్టీ విధించింది. సంపన్నులు కొనే బంగారుపై 3శాతం, విలువ రాళ్లపై 0.25 శాతం మాత్రమే ప్రత్యేక స్థాయి పన్నులు వేయడం విచిత్రం.

బీమాపై పన్నును పూర్తిగా తొలగించాలని కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరి, ప్రహ్లాద్ జోషి ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు రాసిన లేఖల్లో చిత్తశుద్ధిని చూడలేము. తమను కలిసిన ఉద్యోగ ఓటర్ల తృప్తికి, మోడీపై తమ అసంతృప్తితో రాసినవే ఈ ఉత్తరాలు. నిర్మల నిస్సహాయురాలని మోడీ సూత్రధారి అని ఈ వరిష్ఠ బీజేపీ నాయకులకు తెలియదా? వీరు తమ శాఖలలో ఆశ్రితపక్షపాతులే. ప్రజా పక్షపాతులు కారు. మంత్రివర్గ సమావేశంలో వీరు బడ్జెట్‌ను ఆమోదించారు. బడ్జెట్‌లో అన్యాయాలు వీరికి అప్పుడు కనిపించలేదా?

నాడు హిట్లర్...నేడు యోగి!





డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి
8985037713

హిట్లర్ నాజీ, ఫాసిస్టు పాలన ఎంతటి భయంకరంగా ఉండేదో ప్రపంచం ఇంకా మరిచిపోలేదు. మనుషుల్ని విభజించి నాటిన విషబీజం అరవై లక్షల మంది యూదుల ఊచకోతకు కారణమైంది. హిట్లర్ ఆనాడు జర్మనీ నేషనలిజం పేరుతో జర్మనీలోని యూదుల వ్యాపార కేంద్రాల న్నిటి పై డేవిడ్ నక్షత్రాన్ని ప్రదర్శించాలని, వారి శరీరం పైన కూడా వారి పేర్లు ప్రదర్శించాలని హుకుం జారీ చేశారు. డేవిడ్ నక్షత్రం యూదు మతస్తుల గుర్తు. తదనంతరం యూదులను గుర్తించి వారి వ్యాపార కేంద్రాలను స్వాధీనం చేసుకోవ డం, ఆ తర్వాత వారిని నిర్బంధ కేంద్రాలకు పంపడం, అరవై లక్షలమంది యూదులను హతమార్చడం, రెండు కోట్ల మంది ప్రజలు,సైనికులు ప్రాణాలు కోల్పోవటం చరిత్ర చెప్పే సత్యం. సరిగ్గా అలాంటి విభజనకు బీజేపీ పాలిత ప్రభుత్వాలు ఆజ్యం పోస్తున్నాయి. నాడు మనుషులను విభజిస్తే, నేడు యూపీలోని యోగి ప్రభుత్వం హిందూ, ముస్లింలను విభజిస్తూ పాలిస్తోంది.

కన్వర్ యాత్ర. ప్రతి ఏటా శ్రావణ మాసంలో హిందువులు పవిత్రంగా భావించే గంగా జలాన్ని హరిద్వార్ నుండి కావడిలో కాలినడకన తెచ్చి తమ గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకం కోసం భక్తులు ఢిల్లీ హరిద్వార్ జాతీయ రహదారిపై లక్షల సంఖ్యలో భక్తులు కాలి నడకన ప్రయాణించటం పరిపాటి. ఈ యాత్ర ఈనాటిదికాదు. శతాబ్దాలుగా సాగుతున్న యాత్ర. ఈ యాత్రలో పంజాబ్, రాజస్థాన్, హరి యాణా, ఢిల్లీ,యూపీ, మధ్యప్రదేశ్ ,జార్ఖండ్, ఒరిస్సా రాష్టాల నుండి కూడా కన్వర్ యాత్రలో పాల్గొనటం ఆనవాయితీ. హరిద్వార్ నుండే కాకుండా గంగోత్రి, బీహార్‌లోని హజారీబాగ్ దగ్గరలోని గంగానది నుండి కూడా కావడి పాత్రల్లో జలాన్ని సేకరించటం ఎప్పుడూ జరుగుతున్నదే. కానీ ఈ యేడు ఉత్తరప్రదేశ్ బీజేపీ యోగి ప్రభుత్వం ఒక ఫర్మానా జారీ చేసింది. ఢిల్లీ -హరిద్వార్ జాతీయ రహదారి పొడవునా వున్నా దాబాలు,హోటళ్ళు, పండ్లు, కూరగాయలు బండ్లపైన ఆఖరికి రేషన్ దుకాణాల పైన యజమానులు, అందులో పనిచేసే వర్కర్ల పేర్లు ప్రముఖంగా ప్రదర్శించాలని ఉత్తర్వు లిచ్చింది.దీన్నిచూసి ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా ఇదే ఆర్డర్ ఇచ్చింది. ఇలాంటి ఆర్డర్ ఇవ్వటంలో ఏ అంశాలు ఆ ప్రభుత్వాలను ప్రేరేపించినవో పరిశీలిస్తే ఇందులో ప్రధానంగా రాజకీయ,ఆర్థిక కోణాలతో పాటు మతవిభజన కూడా ఇమిడి వున్నట్టుగా తెలుస్తోంది.

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో యూపీ, ఉత్తరాఖండ్ బీజేపీ పభుత్వాలకు ఆ మాటకొస్తే మోడీ,షాలకు అక్కడి ఓటర్లు వారు ఊహించని ఫలితాలనిచ్చారు. ఈ యాత్ర మార్గంలో వున్నా షహారన్పూర్ డివిజన్‌లో తుడిచి పెట్టుకుపోయింది. అంతేకాకుండా శామిలి, ముజఫర్‌గర్ సీట్లలో ఇండియా బ్లాక్ గెలుచుకొంది. మీరట్‌లో మాత్రం బీజేపీ తక్కువ మెజారిటీ సాధించింది.కాంగ్రెస్ గెలుచుకున్న ముజఫర్‌నగర్ సీట్ హరిద్వార్ దగ్గర్లో ఉండటం ఇటీవల ఉత్తారాఖండ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో హరిద్వారాను అనుకోని వున్న మంగ్లర్ ,బద్రీనాథ్ అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్ గెలవటం, త్వరలో యూపీలో పది సీట్లలో జరిగే ఉప ఎన్నికల్లో బీజేపీ గెలవాలంటే మెజార్టీ, మైనార్టీ విభజన తెచ్చి మతకలహాలు రెచ్చగొట్టి లబ్దిపొందాలని చూస్తున్నట్టు అర్థమవుతోంది. అందుకే బీజేపీ కుట్రలో భాగంగా ఏ హోటళ్లపైనా, కూరగాయలు, పండ్ల బండ్ల పైన, ఆఖరికి రేషన్ దుకాణాలపైనా యజమానులు పేర్లు రాయాలని తద్వారా ఉద్రేకాలను, ముస్లిం యజమానులు వ్యాపారం మూసివేసి పెద్ద పెద్ద, ఇతర మతస్తుల వ్యాపారాలకు ఆర్థిక లాభం చేకూర్చమే ఈ ఉత్తర్వులకు సారాంశమని రాజకీయ పరిశీలకుల అంచనా.

2023 యాత్రలో మొత్తం కావడి యాత్రలో వివిధ ప్రాంతాల్లో సుమారు రెండు కోట్ల మంది భక్తులు పాల్గొన్నారు.అందులో కోటి మంది ఢిల్లీ - హరిద్వార్ జాతీయ రహదారి నుండే ప్రయాణించారు.ఈ మార్గంలో బీజేపీ నాయకుడు, ఛాందసవాది అయిన యాశ్వీర్ షామిలి రోడ్డులో ఒక ఆశ్రమాన్ని నడుపుతున్నాడు. ఇది ముజఫర్‌నగర్ దగ్గర్లోని బాంగ్రాలో వుంది. ఈయన మూడేండ్ల క్రితం ఒక 50 దాబాలను గుర్తించి, అవి ముస్లింలు యజమానులవని, శాఖాహారం పేరుతో హిందూ దాబాలుగా నడుపుతున్నారని, ఆ హోటళ్లలో కన్వర్ యాత్రికులు భోజనం చేస్తే కరప్ట్ అవుతారని, కాబట్టి వాటిని యాత్ర జరిగినన్ని రోజులు మూసెయ్యటమో లేక ముస్లింల పేరు హోటళ్లపై రాయాలని ముజఫర్ నగర్ పోలీసుకు పిటిషన్ ఇచ్చాడు.కానీ పోలీసులు పట్టించుకోలేదు.దీంతో ఆయన ముజఫర్‌నగర్‌లో ధర్నా చేసి మతాన్ని రెచ్చగొట్టేలా విద్వేష ప్రచారానికి ఆందోళనను చేపట్టి శాంతిభద్రతల సమస్యను సృష్టించాడు.దీంతో పోలీసులు 2022లో ముస్లిం హోటళ్ల యజమానులు పేర్లు, వర్కర్ల పేర్లు సేకరించారు.ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే హిందూ వర్కర్లు ముస్లింల దాబాల్లో, ముస్లిం వర్కర్లు హిందువుల దాబాల్లో పనిచేయటం. 2023లో పోలీసులు ముస్లిం దాబాలను అనధికారంగా మూసివేయించారు. ఈసారి ఏకంగా యోగి ఒక అడుగు ముందుకేసి హోటళ్లు, దాబాలే కాకుండా పండ్లు, కూరగాయల తోపుడు బండ్లు,రేషన్ దుకాణాల పైన యజమానులు,వర్కర్ల పేర్లు ప్రదర్శించాలి అని ఉత్తర్వులిచ్చారు. దీన్ని చూసి ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా ఇదే తరహా ఉత్తర్వులు జారీచేసింది. వాస్తవానికి యాత్ర సజావుగా జరగటానికి ముస్లింల సహాయ సహకారలం దిస్తున్నారు. జనాభా ఎక్కువగా వున్న ప్రాంతాలు, యాత్ర మార్గంలో ముస్లిములు మంచినీరు, భోజనాలు, మెడిసిన్స్ ఏర్పాటు చేయటం గత పదేండ్ల నుండి అక్కడ జరుగుతోంది. కానీ యోగి ప్రభుత్వం మాత్రం హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు నింపే ప్రయత్నం ఏకధాటిగా కొనసాగిస్తూనేవుంది.

ఉత్తారాఖండ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో హరిద్వారాను అనుకోని వున్న మంగ్లర్ ,బద్రీనాథ్ అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్ గెలవటం, త్వరలో యూపీలో పది సీట్లలో జరిగే ఉప ఎన్నికల్లో బీజేపీ గెలవాలంటే మెజార్టీ, మైనార్టీ విభజన తెచ్చి మతకలహాలు రెచ్చగొట్టి లబ్దిపొందాలని చూస్తున్నట్టు అర్థమవుతోంది. అందుకే బీజేపీ కుట్రలో భాగంగా ఏ హోటళ్లపైనా, కూరగాయలు, పండ్ల బండ్ల పైన, ఆఖరికి రేషన్ దుకాణాలపైనా యజమానులు పేర్లు రాయాలని తద్వారా ఉద్రేకాలను, ముస్లిం యజమానులు వ్యాపారం మూసివేసి పెద్ద పెద్ద, ఇతర మతస్తుల వ్యాపారాలకు ఆర్థిక లాభం చేకూర్చమే ఈ ఉత్తర్వులకు సారాంశమని రాజకీయ పరిశీలకుల అంచనా.

ఇదిలా ఉండగా ఈ అంశంపై సుప్రీంకోర్టును పిటిషన్ దాఖలైంది. ఇద్దరు సభ్యులు గల బెంచ్ యోగి ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ రాజ్యాంగ విరుద్ధమైనదని కొట్టివేసింది. కేవలం దాబాలు హోటల్స్ కేవలం శాఖాహారమా, మాంసాహారము తెలుపుతూ దాబాలు, హోటల్స్ ప్రదర్శించాలని ఉత్తర్వు లిచ్చింది. ఈ బెంచ్‌లో సభ్యుడైన ఎస్‌వి యెన్ భట్టి తాను కేరళ హైకోర్టులో జడ్జిగా పనిచేసే సమయంలో ముస్లింల హోటల్స్‌లోనే శాఖాహార భోజనం చేసేవాడినని, శుచికి, శుభ్రతకు, రుచిగా భోజనం ఉండేదని వ్యాఖ్యానించడం కొసమెరుపు.



ముివ్వా పద్మావతి మృతికి సీపీఐ(ఎం) సంతాపం

- నివాళులర్పించిన సుదర్శన్, నున్నా

నవతెలంగాణ-ఖమ్మం

ప్రముఖ విద్యావేత్త ముివ్వా శ్రీనివాసరావు మాతృమూర్తి ముివ్వా పద్మావతి (85) శుక్రవారం ఖమ్మంలో మరణించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు ఆమె మృతదేహాన్ని ఖమ్మం నగరం బైపాస్‌రోడ్‌లోని సృజన అపార్ట్‌మెంట్‌లో గల ముివ్వా శ్రీనివాసరావు స్వగృహానికి వెళ్ళి సందర్శించి నివాళులర్పించారు. ముివ్వా పద్మావతి అకాల మరణం పట్ల సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సంతాపం, కుటుంబానికి సానుభూతి తెలియజేసినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, యర్రా శ్రీకాంత్, ఎం.సుబ్బారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, వై.విక్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, ఆర్.ప్రకాష్, బివికె మేనేజర్ వై.శ్రీనివాసరావు, వాసిరెడ్డి వీరభద్రం, నెల్లూరి వీరబాబు, అఫ్జల్, కె.దేవేంద్ర, వీరారెడ్డి, వెంకన్నబాబు, ఎ.ఎస్.కుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు తదితరులున్నారు.



వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

- ప్రజలందరూ సహకారం అందించండి
- డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్

నవతెలంగాణ-వైరాటౌన్

కేరళ వయనాడ్ వరద బాధితులకు ప్రత్యక్షంగా అండగా డివైఎఫ్ఐ అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్నదని, వరద బాధితులకు డివైయఫ్ఐ విరాళాల సేకరణకు ప్రజలందరూ సహకారం అందించి సహకరించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా డివైయఫ్ఐ విరాళాల సేకరణ కార్యక్రమాలలో భాగంగా వైరాలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విరాళాలు అడిగిన వెంటనే ఇచ్చిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు బాధితులను ప్రజలందరూ కలిసి సహకరించాలని కోరారు. మనం చేసే సహాయం కొంతైనా, అందరం కలిస్తే అది కొండంత అవుతుందని సందర్భంగా అన్నారు. అందుకే చిన్న, చిన్న సహాయాలు చేసి మానవత్వం చాటుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సుజాత, గోపి, నరేష్, సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్ట్ విద్యాసంస్థలో విద్యార్థి ఎన్నికలు

నవతెలంగాణ-ఖమ్మం



విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, ప్రజాస్వామ్య పద్ధతులలో విద్యార్థి నాయకులను ఎన్నుకోవడానికి తమ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం విద్యార్థి ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి ఈవిఎం ఓటింగ్ విధానంలో విద్యార్థి ఎన్నికలు నిర్వహించడం జరిగిందని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవి మారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని పాఠశాల ఆవరణలో నిర్వహించిన విద్యార్థి ఎన్నికల కోసం 4 పోలింగ్ కేంద్రాలను, 8 ఈవిఎంలను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిజమైన లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను తలపించే విధంగా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని వారు వివరించారు. ఈ ఎన్నికలలో ఆరు నుండి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఓటింగ్లో పాల్గొన్నారని. ఈ ఎన్నికలలో విజేతలయిన వారిని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్.పార్వతి రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా సీనియర్ ఉపాధ్యాయులు సోషల్ డిపార్ట్మెంట్ హెడ్ వి.ఎస్.ఎన్.మూర్తి వ్యవహరించారు. ఎలక్షన్ మెంబర్లుగా రాజరాజేశ్వరి, వేణుగోపాల్, రామారావు, వెంకటేశ్వర్లు, దాసు, బసంత్ నిర్మల, రూపాశ్రీ, సుజాత, ప్రహ్లాద్ వ్యవహరించారు. పోలింగ్ సిబ్బందిగా ఉపాధ్యాయులు, సెక్యూరిటీగా ఎన్.సి.సి. విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ పొలం బాట

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా పడటంతో రైతులు పొలాలు సాగు చేసుకుని పంటలు ముమ్మరంగా వేస్తున్న తరుణంలో రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా మోటార్లకు కెపాసిటర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని మధిర డివిజన్ ఏడిఈ అనురాధ రైతులకు సూచించారు. మండల పరిధిలోని మామునూరు సెక్షన్‌లో గల తక్కెళ్ళపాడు గ్రామంలో నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ విద్యుత్ శాఖ-పొలం బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫారములు ఓవర్ లోడ్‌తో కాలిపోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తల గురించి రైతుల మోటర్లు హెచ్చుతగ్గుల విద్యుత్ సరఫరాతో మోటర్లు కాలి పోకుండా ఉండేందుకు కెపాసిటర్లు తప్పనిసరిగా అమర్చు కోవాలని తెలిపారు. మధిర సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖ -పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మామునూరు సెక్షన్ ఏఈ శ్రీనివాసరావు, వై.రాజేష్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోండి

- సౌత్ సబ్ డివిజన్ ఐపిఓ కె గోపీనాథ్

నవతెలంగాణ- నేలకొండపల్లి



తపాలా శాఖ (పోస్టాఫీస్) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ సౌత్ సబ్ డివిజన్ ఐపిఓ కే.గోపీనాథ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోరట్లగూడెం గ్రామంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో డిసిడిపి ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ తపాలా శాఖలో లభిస్తున్న పిఓఎస్బి ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు. తపాలా శాఖ గ్రామ ప్రజల కోసం చిన్న మొత్తాల పొదుపు, సేవింగ్ అకౌంట్, పిపిఎఫ్, టిడి, ఎస్సిఎస్ఎస్, ఎమ్ఎస్ఎస్సీ వంటి సేవలను అందిస్తుందన్నారు. గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్పిఎల్ఐ), ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రొఫెషనల్ డిగ్రీ ఉన్నవారు తపాలా జీవిత బీమా (పిఎల్ఐ), రికరింగ్‌తో అధిక వడ్డీ వంటి అనేక సేవలను పొందవచ్చు అన్నారు. తక్కువ ప్రీమియం అధిక బోనస్, ఐపిపిబి ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ ఏడాదికి 520 రూపాయల ప్రీమియంతో 10 లక్షల బీమా, 755 రూపాయలతో 15 లక్షల వరకు బీమా పొందవచ్చన్నారు. ప్రతి తపాలా కార్యాలయంలో ఈ పథకాల సేవలన్నీ అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఓలు పెరుగు నాగేశ్వరరావు, ఎం.లక్ష్మణ్, ఎస్పిఎం వివేక్, తపాలా శాఖ సిబ్బంది కణతాల గోవిందరావు, ప్రణయ్, రాకేష్, కృష్ణవేణి, వంశీ, శిరీష, ఓంకారమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.





ఐక్య ఉద్యమాలతో

గిరిజన హక్కులు కాపాడుకుందాం

- తెలంగాణ గిరిజనసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ శ్రీరాంనాయక్
- ఖమ్మంలో గర్జించిన గిరిజనులు
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హామీ

నవతెలంగాణ-ఖమ్మం



ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం సందర్భంగా అన్ని గిరిజన సంఘాలు ఐక్యంగా గిరిజన భవన్ నుంచి పెవిలియన్ గ్రౌండ్ మయూరి సెంటర్ మీదుగా గిరిజన సంస్కృతీ సంప్రదాయాలతో ఆటపాటలతో శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకులు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ శ్రీరాం నాయక్ మాట్లాడుతూ పాలకులు గిరిజన హక్కుల జోలికి వస్తే తగిన స్థాయిలో మూల్యం చెల్లించుకుంటారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సకాలంలో అమలు చేయాలని, ఐక్య ఉద్యమాల ద్వారానే గిరిజన హక్కులు కాపాడబడతాయని ఆయన తెలిపారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ఐక్యంగా కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు, ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్సవాల సందర్భంగా పెవిలియన్ గ్రౌండ్ విచ్చేసిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు గిరిజన సంఘ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, హక్కులు కాపాడటానికి ప్రయత్నం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా అధ్యక్షులు బానోత్ బాలాజీ, జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ నాయక్, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్ నాయక్, గిరిజన సంఘాల నాయకులు, తెలంగాణ గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి నాయక్, బోడ వీరన్న, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు భారత్ కిషన్ నాయక్, జిల్లా అధ్యక్షులు భానోత్ శ్రీకాంత్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు బస్కినాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ భద్రునాయక్, రాష్ట్ర గిరిజన సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి అజ్మీర కిషన్ నాయక్, ఎరుకల హక్కుల పోరాట నాయకులు, పుట్టబత్తిని బాలస్వామి, గరిక శ్రీనివాసరావు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు భూక్యా శోభన్ నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు భూక్యా శ్రీనివాస్ నాయక్, మూడు గన్యా నాయక్, బాణోత్ బన్సిలాల్ పాల్గొన్నారు.



కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్‌ను

ఉపసంహరించుకోవాలి

- బడ్జెట్, లేబర్ కోడ్‌ల ప్రతులు దహనం

నవతెలంగాణ- ఖమ్మం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్‌ను వెంటనే ఉపసంహరించుకొని, మధ్యంతర బడ్జెట్‌ను ఏర్పాటుచేసి కార్మికుల, రైతు సంక్షేమం కోసం నిధులు కేటాయింపు చేయాలని అఖిలపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్, లేబర్ కోడ్‌ల ప్రతులను దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాం జనేయులు, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నరాల నరేష్ మాట్లాడుతూ 48 లక్షల కోట్ల బడ్జెట్‌లో కార్మిక కర్షక సంక్షేమం గురించి ప్రస్తావించకపోవడం దురదృష్టకర మన్నారు. సంవత్సర కాలంగా రైతు వ్యతిరేక చట్టాలపై పోరాటం చేసినా కూడా రైతుల మీద కంటే కార్పొరేటు శక్తులే మీద మోడీకి అమితమైన ప్రేమ ఉందన్నారు. కనీస మద్దతు ధరను ప్రకటించకపోగా ఉన్న సంక్షేమ పథకాలన్నీ తొలగించారన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం పేరు చెప్పి ఒక్క సంవత్సర కాలంలో 59 వేల కోట్ల రూపాయలు రిలయన్స్ కంపెనీకి అప్పచెప్పారని ఆరోపించారు. ఎన్నో కాలంగా పోరాడే సాధించుకున్న 44 లేబర్ చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లుగా మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందో కార్మిక లోకానికి మోడీ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నూతన లేబర్ కోడ్‌ల వలన లేబర్ కోర్టులు రద్దయిపోయి కార్మికులకు జరిగిన నష్టాన్ని ప్రశ్నించే అవకాశమే లేదన్నారు. అందువలన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి పాత చట్టాలనే ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు నెలల కాలంలో మధ్యంతర బడ్జెట్‌ని ప్రవేశపెట్టి కార్మిక వ్యవసాయ సంక్షేమం కోసం అధిక నిధులను కేటాయించాలని వారు కోరారు. కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్ను వ్యతిరేకిస్తూ ఈనెల 14వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాదినేని రమేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు పి.రమ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాటి వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదే లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షులు పేర బోయిన మోహన్‌రావు, షేక్ ఇబ్రహీం, జిల్లా సమితి సభ్యులు రావుల శ్రీనివాస్, ఐఎన్‌టియుసి జిల్లా సెక్రెటరీ గజ్జి సూర్యనారాయణ, నగర ఉపాధ్యక్షులు పజల్, నాయకులు సంగయ్య, నాగరాజు ఐఎఫ్టియు ములకలపల్లి లక్ష్మినారాయణ, కోయ్యల శ్రీనివాస్, బొమ్మ కంటి రమేష్, జలగం రాంబాబు పాల్గొన్నారు.

ఇల్లు, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



ఇల్లు, పరిసరాలు, వీధుల పరిశుభ్రతను పాటించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఖమ్మంలోని ఎఫ్సిఐ రోడ్, సారథినగర్‌లలో పర్యటించి, పరిశుభ్రత, డ్రైడేలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది చేస్తున్న శానిటేషన్, తడి, పొడి చెత్త సేకరణ పనులను తనిఖీ చేశారు. స్థానికంగా తిరుగుతూ, ప్రజలతో మాట్లాడి వారి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరం నుంచి తడి, పొడి చెత్త సేకరించే ట్రాక్టర్లు, ఆటోలు తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా సేకరించాలని అన్నారు. తడి చెత్త, పొడి చెత్తని వేరువేరుగా ఇవ్వటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తాగునీటి సరఫరా క్రమంగా వస్తుందా, శానిటేషన్ సిబ్బంది రోజూ చెత్త సేకరణ చేస్తున్నారా, అంగన్‌వాడీ కేంద్రం మంచిగా నడుస్తుందా, ఆశా సిబ్బంది వైద్య సమస్యలు ఉంటే పట్టించుకుంటున్నారా అని స్థానికులను కలెక్టర్ ఆరా తీశారు. పరిసరాలు పరిశుభ్రతతో మెలిగితే వ్యాధుల బారి నుండి రక్షించుకోగల్గుతామని అన్నారు. వర్షాకాలం జాగ్రత్తలు తీసుకోకపోతే విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానాల్లో సరిపడా అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల సదుపాయాలు, వైద్యులు ఉన్నట్లు, ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచుకోవాలన్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండడం, డ్రైనేజీ మూసుకుపోవడం, పిచ్చి మొక్కలతో దోమలు వృద్ధి చెందుతాయని, వీటి పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటే, దోమలను నియంత్రించవచ్చని ఆయన తెలిపారు. మన ఇంటి పరిసరాలలో నీరు, మురుగు నిలువ ఉండకుండా చూసుకోవాలని, కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని ఆయన సూచించారు. నగరాన్ని అందంగా ఉంచుతూ, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే మున్సిపల్ సిబ్బంది కూడా సరైన ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని కలెక్టర్ అన్నారు. సానిటేషన్ సిబ్బంది అందిస్తున్న సేవలను కలెక్టర్ ప్రత్యేకంగా కొనియాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న దుకాణాలు, వృత్తి వ్యాపారాలు చేస్తున్న వారితో ముచ్చటించి వారి లాభ, నష్టాల గురించి ఆరా తీసారు. కిరాణాషాపు నడుపుతున్న మహిళాతో మాట్లాడి, మీరు గ్రూప్ సమాఖ్యలో ఉంటే ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి తోడ్పాటు నిస్తుందని తెలిపి, మహిళా శక్తి పథకం గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సంపత్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



టీఎన్జీవోస్ కాలనీ అభివృద్ధికి కృషి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

టీఎన్జీవోస్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలో పెద్దతండా పంచాయతీలోని టీఎన్జీఓఎస్ కాలనీలో నూతనంగా నిర్మించిన చర్చిని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఉద్యోగస్థులు, విశ్రాంత ఉద్యోగస్థుల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, ఉద్యోగస్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నింటిని అమలు చేస్తుం దన్నారు. గత ప్రభుత్వం పదేళ్లుగా తప్పులు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో బురదజల్లు తుందన్నారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు బండి జగదీశ్, టీఎన్జీఓఎస్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

విష జ్వరాలను అరికట్టాలి

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లాలో సీజనల్ విష జ్వరాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని, మునుపెన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం వర్షాకాలం మొదలుకాగానే ప్రజలు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి జిల్లాలో ఉందని పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోదాడ లక్ష్మి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో విష జ్వరాలే కాకుండా గ్రామాలకు గ్రామాలే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, తీవ్రంగా కాళ్ల నొప్పులు, ఒళ్ళు నొప్పులు, కీళ్ల నొప్పులతో డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా తదితర వ్యాధులతో ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని డిఆర్ఓకి వినతిపత్రం అందజేశారు.



కేరళ వరద బాధితుల సహాయార్థం

విరాళాల సేకరణ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మండల పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్‌లో శుక్రవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్ మాట్లాడారు. ప్రకృతి విపత్తు సంభవించి, కొండ చరియలు విరిగిపడి వందలాది మంది మృత్యువాతపడి అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయని, ఆపదలో ఉన్న కేరళ ప్రజలను ఆదుకోవడానికి మంచి మనస్సుతో ప్రజలు ముందుకు రావాలని కోరారు. తమకు తోచినంత ఆర్థిక సహాయం అందజేసి కేరళ ప్రజలకు అండగా ఉండాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు పి.సంగయ్య, యామిని ఉపేందర్, తాటి వెంకటేశ్వర్లు, రంజాన్, ప్రసాద్, వడ్లముడి నాగేశ్వరరావు, రామయ్య, సత్యనారాయణ, యాదగిరి, పగిడిపల్లి ఉపేందర్ పాల్గొన్నారు.

కాటేపల్లి నరసింహారావు సేవలు మరువలేనివి

- విగ్రహావిష్కరణలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం



కాటేపల్లి నరసింహారావు సేవలు మరువలేనివి అని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామంలో కామ్రేడ్ కాటేపల్లి నరసింహారావు 35వ వర్ధంతి సందర్భంగా నున్నా నాగేశ్వరరావు, చిరుమామిళ్ల హనుమంతరావు, కిలారి విశ్వనాథ్ చిన్నిలు కాటేపల్లి నరసింహారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అదాని, అంబానీలపై ఉన్న ప్రేమ ప్రాజెక్టులపై, నిరుద్యోగ సమస్యపై, పరిశ్రమలపై ఏమాత్రమూ లేదని అన్నారు. మోడీ ప్రభుత్వంపై ఒక్క కమ్యూనిస్టు పార్టీకి తప్ప ఏ పార్టీ నోరు మెదపడం లేదన్నారు. మద్యం, గంజాయి, ఏర్లై పారుతున్నా నియంత్రించాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాటేపల్లి నరసింహారావు పార్టీలో చురుకైన పాత్ర పోషించారని, గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ప్రజా సమస్యలపై పోరాడేది ఒక్క కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. కేరళ రాష్ట్రంలో జీవన ప్రమాణాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, కేరళ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యశాలలోనే వైద్యం అందిస్తున్న ఘనత ఆ రాష్ట్రానికే దక్కుతుందన్నారు. కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర పరిపాలనపై ఇతర రాష్ట్రాల్లో కూడా పరిపాలననూ అవలంబించాలని అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కోసం, రైతాంగం కోసం, తన తుది శ్వాస విడిచేంతవరకు పోరాడిన వ్యక్తి నరసింహారావు అని అన్నారు. రైతులు, కౌలు రైతులపై, కార్మిక వర్గాలపై పోరాడిన వ్యక్తి నరసింహారావు అని కొనియాడారు. పార్టీని బలోపేతం చేయటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కిలారు విశ్వనాథ్ చిన్ని మాట్లాడుతూ ఆస్తులు సంపాదించి పెట్టిన తల్లిదండ్రులను ఈ రోజుల్లో చూడటం లేదని, 35 సంవత్సరాల క్రితం తండ్రి చనిపోతే ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున కార్యక్రమం చేయటం ఓ గొప్ప వరమనే అన్నారు. ఆయన ఆశయాలను మనమందరం ముందుకు తీసుకుపోవాలని కోరారు. నరసింహారావు కుమారుడు కాటేపల్లి క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు డి.తిరుపతిరావు, పార్టీ మండల కార్యదర్శి తమ్మినేని రమేష్, చింతకాని ఎంపీపీ తోఫూరి పూర్ణయ్య, మండల కమిటీ సభ్యులు బి.రాము, కంచర్ల కొండయ్య, పెంటి కోటేశ్వరరావు, మల్లెంపాటి వీరభద్రం, కిలారి సూర్యనారాయణ, సామినేని నాగేశ్వరరావు, దారెల్లి నాగేశ్వరరావు, కిలారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరణ మండల కేంద్రంలో షాప్ టు షాప్ ప్రజల వద్ద విరాళాలు శుక్రవారం సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు నెరసుల వెంకటేష్, కొమ్ము నాగేశ్వరరావు, దిండు మంగపతి, పాపిట్ల సత్యనారాయణ, దేవ సహాయం, కొలిచలం స్వామి, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి : మండలం పింజరమడుగు గ్రామంలో కేరళ రాష్ట్రంలో వాయునాడు ప్రాంతంలో వరద బాధితుల సహాయ నిధి కోసం సీపీఐ(ఎం) పెంజరమడుగు గ్రామ శాఖ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు దుగ్గి కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు ఇంజం నాగభూషణం, పార్టీ శాఖ కార్యదర్శి కిన్నెర రామచంద్రయ్య, డివైఎఫ్ఐ మండల నాయకులు దేగల రాంబాబు, కంకిపాటి వీరభద్రం, సారింది సాయి, కిన్నెర రాంబాబు, బొడ్డు అశోక్, బొడ్డు తిరుమలి, కిన్నెర సతీష్, వెంకన్న, మల్లయ్య, శీను తదితరులు పాల్గొన్నారు.

మృతురాలు కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో పమ్మి గ్రామంలో చిన్నపంగు గౌరమ్మ(80) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. మృతురాలు కుటుంబ సభ్యులకు బైండ్ల సంఘం ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బైండ్ల సంఘం నాయకులు చిన్నపంగు కుటుంబరావు, చిన్నపంగు శివ, చిన్నపంగు పాపారావు, కుంభజడ వెంకటనరసయ్య, వెంకటనారాయణ, చిన్నపంగు రంజిత్ కుమార్, రజినీకాంత్, సైదులు, చిన్నపంగు బిక్షం, నాగరాజు, చిన్నపీరస్వామి, కుంభజడ ఉపేందర్, గౌరమ్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఫారెస్ట్ అధికారులు

నవతెలంగాణ-కల్లూరు

స్వచ్ఛతను పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఫారెస్ట్ అధికారులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేంజర్ జీ.ఉమా, వీఆర్వో రామ్సింగ్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొదిలి పద్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసిరెడ్డి నాగపద్మ, బీట్ ఆఫీసర్లు ఎండి.అజిమల్లి, భరత్ కుమార్, బీమా, ఉపేందర్, కేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భట్టికి మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ వినతి

నవతెలంగాణ-వైరాటౌన్



శుక్రవారం వైరా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వైరా మున్సిపాలిటీలోని సమ స్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ ముళ్ళపాటి సీతారాములు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీ జీవో నెంబర్ 33 రద్దు చేయాలని, వైరా మున్సిపాలిటీలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో మెయిన్ డ్రైనేజీ నిర్మించాలని, ఇటీవల వైరా మున్సిపాలిటీలో పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని వినతిపత్రంలో కోరారు.

జర్నలిస్ట్ వెంకటరెడ్డి సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఖమ్మం

దశాబ్ద కాలంగా జర్నలిస్టుగా పనిచేసిన ఏలేటి వెంకటరెడ్డి మృతి చెందడం చాలా బాధాకరమని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి అన్నారు. ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జర్నలిస్ట్ వెంకటరెడ్డి సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు విజేత, టీఎస్ చక్రవర్తి, మందుల ఉపేందర్, జానీ పాషా, యలమందల జగదీష్, నరేందర్, ఈశ్వరి, భారతి, కొరకొప్పుల రాంబాబు, కరీష అశోక్, ఉత్కంఠం శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, పానకాలరావు, రమేష్, వెంకటకృష్ణ, రోసిరెడ్డి, నల్లమోతు శ్రీనివాస్, సాయి, హుస్సేన్, వెంకటాద్రి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, యాదగిరి, కుమార్, రవి, వెంకటేష్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలబడాలి

నవతెలంగాణ-కల్లూరు



ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం పేరు తోటి మహిళా సంఘాల సభ్యులకు వారి కుటుంబాలకు జీవ నోపాదుల కల్పనలో వివిధ బ్యాంకులలో బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా ఇచ్చి యూనిట్ ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా నిలబడాలని మండల ప్రత్యేక అధికారి పీ.సునీత, ఎండీవో కే.చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం బొల్లం రాదా ఏర్పాటు చేసిన ఖుషి బ్యూటీ పార్లర్‌ను మండల అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్ పీ.సునీత, మండల పరిషత్ అభివృద్ధి అధికారి డీ.చంద్రశేఖర్, ఎంపీఓ ఏనుగు సురేష్ బాబు, ఏపీఎం ఏం.వెంకట్రామారావు ప్రారంభించారు. అదేవిధంగా డీ.లావణ్య టైలరింగ్, నాగ రాణి ఫ్యాన్సీ సెంటర్ ఎస్.స్వప్న, సోనీ హెయిర్, స్టైల్ ఫైక్ల నాగమణి కర్రీ పాయింట్, బ్యాంకింగ్ లింకేజీ ద్వారా రుణాలు పొందిన సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఆర్థికంగా బలోపేతం అవుతున్న ఇందిరా మహిళా శక్తి యూనిట్లను అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ మండల సమాఖ్య పాలకవర్గ కమిటీ సభ్యులు జీ.నిర్మల, సీసీ టీ.రాజ్యలక్ష్మి సిహెచ్.శ్యామలాదేవి, గ్రామదీపికలు జొన్నలగడ్డ కుమారి, నాగ లక్ష్మి స్వయం సహాయక సంఘాల లీడర్లు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం

నవతెలంగాణ-వేంసూరు



మండలంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారయింది. ఆరు రోజులపాటు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలకు ప్రభుత్వం చేపట్టినప్పటికీ క్షేత్రస్థాయిలో మండలంలో అమలు కాకపోవడంతో ప్రధాన రహదారులు, సీసీ రోడ్లపై వర్షపు నీరు పారుతూ నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తితో ప్రతి గ్రామంలోనూ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. స్వచ్ఛదనం పచ్చదనం మొక్కుబడిగా నిర్వహించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ సమస్యలు అక్కడే తాండ విస్తున్నాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఆచరణకు నోచుకోవటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

వైరా అభివృద్ధికి కృషి చేస్తా

- పలు పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన

నవతెలంగాణ-వైరా



వైరా ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, స్వంత మండల అభివృద్ధికి తన వంతు కృషి చేసి రుణం తీర్చుకుంటానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల సమీపంలో 6 ఎకరాల ప్రభుత్వ భూమిలో నిర్మించనున్న 100 పడకల ఆస్పత్రికి ఆయన శంకుస్థాపన చేశారు. వైరా మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనుల కోసం మంజూరైన అమృత్ 2.0 పథకంలో 26.87 కోట్ల రూపాయల పనులకు వైరా మునిసిపాలిటీ కార్యాలయం వద్ద శంఖుస్థాపన చేశారు. వైరా ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునీకరణకు మంజూరైన 42.10 కోట్ల నిధులతో చేపట్టనున్న పనులకు ప్రాజెక్టు కుడి కాలువ ప్రధాన గేట్ల వద్ద శంఖుస్థాపన చేశారు. భట్టి విక్రమార్క స్వగ్రామం స్నానాల లక్ష్మీ పురం గ్రామంలో 81.52 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు, లక్ష్మీపురంలో రూ.65 లక్షలతో నిర్మించనున్న బాతింగ్ ఘాట్, రూ.4.20 కోట్లతో నిర్మించనున్న చెక్ డ్యామ్, రూ. 7.70 కోట్లతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామైన స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

నూతన తరగతి గదులు, ల్యాబ్‌ల కోసం ప్రతిపాదనలు పంపండి

వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన తరగతి గదులు, ల్యాబ్ ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేసి తనకు పంపాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క డిఐఈఓ రవిబాబును ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని శిథిలమైన భవనాలను వారు పరిశీలించారు. 200 మంది విద్యార్థులు ఉన్న ఈ కళాశాలలో ల్యాబ్స్, సరిపోను క్లాస్ రూమ్స్ లేకపోవడంతో శిథిలమైన తరగతి గదుల్లో విద్యా బోధనకు ఇబ్బందిగా ఉందని డిప్యూటీ సీఎంకు కళాశాల ప్రిన్సిపల్ నవీన జ్యోతి వివరించారు. దీంతో వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మెన్ నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మార్కెఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మెన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, వైరా మున్సిపాలిటీ చైర్మెన్ సూతకాని జైపాల్, పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

- జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్

నవతెలంగాణ-ఖమ్మం



డివైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలను రాజకీయ చైతన్యవంతం చేయటానికి భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ తెలిపారు. శుక్రవారం సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం వీరబాబు అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. అందుకనే డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించి శాస్త్రీయ అవగాహన యువతకు కల్పించేందుకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్లాసులు నగరంలోని ఖానాపురం హవేలీలో సత్తెనపల్లి రామకృష్ణ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్లాసులకి జిల్లా వ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆయన కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సత్తెనపల్లి నరేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, కొంగర నవీన్, కార్తీక్, రావులపాటి నాగ రాజు, ఎర్ర సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కార్పొరేషన్ : డీవైఎఫ్ఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి శీలం వీరబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక త్రీ టౌన్‌లో శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని వివిధ డివిజన్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ త్రీ టౌన్ అధ్యక్షుడు యర్రా సాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన వివిధ సభల్లో శీలం వీరబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ త్రీ టౌన్ అధ్యక్షుడు యర్రా సాయికుమార్ ,కృష్ణ ,పాషా శివ ,గణేష్ ,వాసు , ముజీమ్ తదితరులు పాల్గొన్నారు.



కొమరం భీమ్ విగ్రహావిష్కరణకు శంకుస్థాపన

నవతెలంగాణ-కామేపల్లి

మండలంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామాలలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. కామేపల్లి క్రాస్ రోడ్డు వద్ద కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణకు శంకుస్థాపన చేశారు. కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవటం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి దుగ్గి కృష్ణ పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణ మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో తక్షణమే ఐటీడీఏను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కామేపల్లి క్రాస్ రోడ్ లో కొమరం భీం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కెప్టెన్ బంజర మాజీ సర్పంచ్ అరెం రవి, ఆదివాసి సంఘం సీనియర్ నాయకులు కరపటి సీతారామయ్య, సంఘం జిల్లా నాయకులు కిన్నెర రామచంద్రయ్య ఆదివాసి సంఘం జిల్లా నాయకులు జీ.బుచ్చి రాములు, ఆదివాసి ఉద్యోగ సంఘ నాయకులు దుగ్గి పాపారాణి, కోటమ్మ, సరూప, ఆదివాసి సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- తుంబూరు దయాకర్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని పొంగులేటి క్యాంప్ ఆఫీసు ఇన్‌చార్జ్ తుంబూరు దయకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (ఐఎన్టీయూసీ) జిల్లా అధ్యక్షులు సిహెచ్. విప్లవ కుమార్, నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఖమ్మం టూ బోనకల్ అడ్డా డ్రైవర్లు ఆ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు చట్టాలుగా మార్చడం సరికాదని అన్నారు. కార్మికులకు అండగా ఐఎన్టీయూసీ ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్తార్ మియా, ప్రధాన కార్యదర్శులు బొడ్డు సైదులు, తోట సైదులు, ఉపాధ్యక్షులు మధు గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, ఉపాధ్యక్షులు జానీ, కుక్కల రామకృష్ణ, సహాయ కార్యదర్శి రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.వెంకట్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీజన్ వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-కల్లూరు

స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్ఎస్పిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వీ.నవ్య కాంత్ పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులు, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు.

పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలి

నవతెలంగాణ-చింతకాని

మండల కేంద్రంలో పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం విజయ్ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 20 రోజుల నుండి చెత్త ట్రాక్టర్ తిరగడం లేదని, పంచాయతీ కార్మికులు కూడా కనిపించడం లేదని దీంతో గ్రామమంతా చెత్త పేరుకుపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి కార్మికులతో చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా స్పందించి చెత్త బండ్లు గ్రామంలో తిప్పి పెరగపోయిన చెత్తను శుభ్రం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ముదిగొండ

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మండలపరిధిలోని కమలాపురం, అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన నాయిని లక్ష్మి, పోనగళ్ల లక్ష్మి అనారోగ్య సమస్యలతో రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఎన్.లక్ష్మికి (రూ.20వేలు), పి.లక్షికి (రూ.43వేలు) మొత్తం రూ.63 వేలు లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ దేవరపల్లి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్నవారికి సాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పందిరి అంజయ్య, అయ్యగారిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మట్టా బాబురామిరెడ్డి, గ్రామ మాజీ ఉపసర్పంచ్‌లు అవసాని వెంకన్న, నూక బసవయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు కొండపల్లి రాంబాబు, ముత్తబోయిన నరసింహారావు, పోనగళ్ళ నాగిరెడ్డి, వత్సవాయి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు నెల నెలా ఉచిత వైద్య శిబిరం

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్జీఆర్ సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు పిలుపు

నవతెలంగాణ-నేలకొండపల్లి



ఈనెల 11 (ఆదివారం) నేలకొండపల్లి సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్‌రావు (ఎన్జీఆర్) సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగే నెల నెలా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సేవా కమిటీ కన్వీనర్ ఎటుకూరి రామారావు కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో బీపీ షుగర్ తో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు కూడా ఉచితంగా వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ గడిపూడి రాజేష్ ఎంబిబిఎస్, డిఎన్బి అండ్ ఈఎన్టి, డాక్టర్ కొల్లి అనుదీప్ ఎంబిబిఎస్, ఎండి (జనరల్ మెడిసిన్) రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. షుగర్ పరీక్షలు ముందుగా చేయించుకుని రావాలన్నారు. బీపీ షుగర్ రోగులకు వంద రూపాయలకే ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఖమ్మం శరత్ మాక్స్ విజన్ వారిచే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే వైద్య శిబిరం జరుగుతుందని ప్రజలు సకాలంలో హాజరై వైద్య సేవలు పొందాలని సూచించారు. పేదలకు వైద్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలనే సేవా దృక్పథంతో నెలనెలా వైద్య శిబిరాన్ని గత 18 నెలలుగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కొరకు 9490098225, 9030897480, 9949592544, 9110364581 లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్జీఆర్ సేవా కమిటీ నిర్వాహకులు గుడవర్తి నాగేశ్వరరావు, కెవి. రామిరెడ్డి, కట్టెకోల వెంకన్న పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరుడు మృతి

నవతెలంగాణ-తల్లాడ

మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరుడు అద్దంకి రంగారావు(55) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల కార్యదర్శి అయిన రామలింగేశ్వరరావు, రంగారావు మృతదేహంపై జెండా కప్పి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారావు పార్టీపట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పార్టీ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నివాళులర్పించిన వారిలో మేడి కృష్ణయ్య, మేడి కాటయ్య, వేల్పుల కృష్ణ, అద్దంకి అర్జున్‌రావు, అద్దంకి నాగభూషణం, అద్దంకి రవి, మేడి కాంతయ్య, అద్దంకి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జీఓ 33 వెనక్కి తీసుకోవాలి

- చదివిన కాలాన్ని తీసుకుని స్థానికత నిర్ణయించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ. ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్రంలో మెడికల్ ప్రవేశాలకు (ఎంబీబీఎస్, బీడీఎస్)లో స్థానికత నిర్ణయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబర్ 33 వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ.ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీని వల్లన తెలంగాణ విద్యార్థులు కూడా తమ స్థానికత కోల్పోయే అవకాశం ఉందని, తెలంగాణ విద్యార్థులు కూడా ఇతర రాష్ట్రాలో 9-12 తరగతులు చదివే అవకాశం ఉందని, ఈ జీవో వల్లన తెలంగాణ విద్యార్థులు కూడా స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 6-నుండి 12 వరకు 07 ఎండ్ల కాలంలో ఎదైనా 4 అకడమిక్ ఇయర్స్ చదివి ఉంటే స్థానికులు అని నిర్ణయించిందని, ప్రస్తుతం ప్రభుత్వం 9-12 వరకు చదివి ఉంటే స్థానికులు అని చెబుతుందని, దీనివల్లన తెలంగాణ రాష్ట్రంలో స్థానికత అంశంలో ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడకు వచ్చిన వారు కూడా స్థానిక కోటా పొందుతారని, దీంతో స్థానికులు నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. మెడికల్ విద్య ప్రవేశాలలో కూడా ఉద్యోగ నియామకాలు కోసం తీసుకుంటున్న స్థానికతనే (1 నుండి 07 తరగతి)పాఠశాల విద్యను ప్రమాణికంగా తీసుకోవాలని కోరారు. ఈ సవరణలు చేసి జీవో తీసుకుని రావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్నిరకాల ప్రవేశాలకు స్థానికతకు నష్టం లేకుండా చూడాలని కోరారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

నవతెలంగాణ-కామేపల్లి

పారిశుద్ధ్యం సమస్యలు పరిష్కరించి సీజనల్ వ్యాధులను అరికట్టాలని పీవైఎల్‌పీఓడబ్ల్యూ జిల్లా బృందం డిమాండ్ చేసింది. శుక్రవారం పీవైఎల్‌పీఓడబ్ల్యు జిల్లా బృందం మండలంలోని పలు గ్రామాలు పర్యటించి పారిశుద్ధ్యం, వైద్యం పైన సర్వే చేసి అనంతరం ప్రభుత్వ హాస్పిటల్లో సమస్యలు అడిగి తెలుసుకుని మండల ఎంపీడీవో రవీందర్, డాక్టర్ చందనాలకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకి ప్రజలు అవస్థలు పడుతున్న గాని అధికారులు పూర్తిస్థాయిలో స్పందించడంలేదన్నారు. గ్రామాలలో దోమలు నివారణకు బ్లీచింగ్ పౌడర్ పాగింగ్ చర్యలు చేపట్టాలని గ్రామాలలో వీధులన్నిటినీ శుభ్రపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధి బృందం పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. శిరోమణి, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్వి రాకేష్, జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్ సింగ్, పీఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ కార్యకర్త మంకెన సైదులు మృతి

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో సీపీఐ(ఎం) సీనియర్ కార్యకర్త, పార్టీ పట్ల, పని పట్ల ఎంతో నిజాయితీగా వ్యవహ రించే మంకెన సైదులు శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో గుండెపోటుతో మరణిం చారు. లాలాపురం గ్రామంలో ఒక సామాన్య కార్యకర్త అయిన మంకెన సైదులు చిన్నతనం నుండే సీనియర్ నాయకులు సంక్రాంతి మధుసూదనరావు ఇంటిలో పాలేరుగా పనిచేస్తూ ఎర్ర జెండా విలువలు తెలుసుకొని రజక సామాజిక వర్గంలో మొట్టమొదట ఎర్రజెండా పట్టుకొని బయటికి వచ్చిన వ్యక్తి సైదులు మాత్రమే. పార్టీ పట్ల ఎంతో నీతి నిజాయితీతో ఉండేవాడు. గ్రామంలో పార్టీకి నష్టం కలిగించే విషయంలో ఏమైనా తన దృష్టికి వచ్చినచో వెంటనే పార్టీ నాయకులకు తెలిపేవాడు. చనిపోయే వరకు కూడా ఒక నిబద్ధతగల కార్యకర్తగా ఉండటం వలన ఈరోజున తన మృతదేహం పైన ఎర్రజెండా కప్పించుకున్నాడు. శుక్రవారం అమరజీవి సైదులు మృతదేహంపైన సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు సంక్రాంతి మధుసూదన్ రావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు పార్టీ పతాకాన్ని కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, వైరా పట్టణ, రూరల్ కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, రజక సంఘం జిల్లా కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు, వైరా పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, మత్స్య కార్మిక సంఘం ప్రెసిడెంట్ రహీం, సెక్రెటరీ ఎస్కే. రహీం, సీఐటీయూ వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, మాజీ సర్పంచ్ సంక్రాంతి చంద్రశేఖర్, సంక్రాంతి పురుషోత్తమరావు, సంక్రాంతి నరసయ్య, సంక్రాంతి నరసింహరావు, ఇమ్మడి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | ఆగస్టు 10, 2024 | www.navatelangana.com

ఎంపీపీఎస్ సంధిబంధంలో సూపర్ బ్రెయిన్ యోగ

- ప్రకృతి ప్రేమికుడు ఎస్ఎం పాషా

నవతెలంగాణ-అశ్వాపల్లి

అశ్వాపల్లి మండల పరిధిలోని నడిమిగూడెం పంచాయతీ సంధిబంధం గ్రామం ఎంపీపీఎస్ పాఠశాలలో సూపర్ బ్రెయిన్ యోగ కార్యక్రమం గురువారం జరిగిందని ప్రకృతి ప్రేమికులు, జాకారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ పాషా ఓ ప్రకటనలో తెలిపారు. సూపర్ బ్రెయిన్ యోగ వల్ల విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరుగుతుందని, చురుకుతనం పెరిగి అభ్యాసంలో నిపుణులుగా తయారవుతారని చెప్పారు. అమెరికా లాంటి దేశాలలో బుద్ధి మాంద్యం ఉన్న పిల్లలను సాధారణ స్థితిలోకి తీసుకురావడానికి సూపర్ బ్రెయిన్ యోగ అద్భుతంగా పనిచేస్తుందని, సాధారణ విద్యార్థులకైతే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ యోగ ప్రక్రియకు అంగీకరించి పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేసిన హెచ్ఎం భోజ్య, ఉపాధ్యాయుడు రవికి కృతజ్ఞతలు తెలిపారు.

అటవీ సంరక్షణతోనే ప్రకృతిలో సమతుల్యత

- అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం - పచ్చదనం ర్యాలీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

అటవీ సంరక్షణతోనే ప్రకృతిలో సమతుల్యత ఏర్పడుతుందని అశ్వారావుపేట ఎఫ్ఆర్ఓ మురళి అన్నారు. అశ్వారావుపేటలో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం - పచ్చదనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడవులు ప్రాముఖ్యత, హరిత హారం ఆవశ్యకతను నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివరామ్ క్రిష్ణ, హెచ్ ఎం హరిత, ఉపాధ్యాయులు హరిబాబు, నరసింహారావు, దమ్మపేట ఎఫ్ఆర్ఓ కరుణాకర్ చారి, డీఆర్ఓ జయరాం, ఎఫ్ఎస్ఓ శ్రీనివాసరావు, ఎఫ్బిఓలు నరేష్, మల్సూర్ లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత

- సీఆర్పీఎఫ్ 81 బెటాలియన్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమం

నవతెలంగాణ-చర్ల

మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఆర్పీఎఫ్ 81 బెటాలియన్ కమాండెంట్ మనీష్ కుమార్ సూచించారు. శుక్రవారం సత్యనారాయణపురం గ్రామంలో ఉన్న సీఆర్పీఎఫ్ 81 బెటాలియన్ క్యాంప్ ఆవరణలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అంటు రోగాలు ప్రభలకుండా ఉంటారని అన్నారు. మొక్కలు నాటడం పచ్చదనానికి ఆహ్లాదకరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 81 బెటాలియన్ సెకండ్ కమాండెంట్ ఎస్ఎస్ చౌహన్, అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి కే.ప్రియదర్శిని, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బురదలో నాట్లు వేసి నిరసన

- అధికారులు కాలనీ సమస్యలు పరిష్కరించాలి
- డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు షేక్ షరీఫ్ డిమాండ్

నవతెలంగాణ-రఘునాథపాలెం రూరల్



మండల పరిధిలోని గ్రీన్ కాలనీ రోడ్లు బురద మయంగా మారింది. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలతో కలిసి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డుపై బురదలో నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు షేక్ షరీఫ్ మాట్లాడుతూ రోడ్డు వర్షపు నీటితో బురదమయంగా మారిందన్నారు. విషయంపై అధికారులు పట్టించుకోవడం లేదని, గుంతలు పూడ్చి రోడ్డును బాగు చేయాలని కోరారు. కాలనీలో సీసీ రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. రోడ్లపై నీళ్లు పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయని వాటి ద్వారా స్థానిక ప్రజలకు సీజనల్ వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీవైఎఫ్ఐ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సేవా సమితి ద్వారా వివిధ నైపుణ్యాభివృద్ధి కోర్సులలో నిరుద్యోగ, ఉద్యోగుల కుటుంబాల మహిళలకు ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఇల్లందు ఏరియా సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ అన్నారు. 2023-2024లో ఇల్లందు జేకే కాలనీలలో నిర్వహించినటువంటి టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం పరీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో ఎన్నో నైపుణాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని నిమ్మి ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) జివి మోహన్ రావు, ప్రిన్సిపాల్, ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయ, రాజేంద్రనగర్, హైదరాబాద్ శ్రీ, ఎస్. మంగ్తా, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ సాయి స్వరూప్, హైదరాబాద్ విభాగం సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ డి.ఎస్.శివకుమార్, ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతినిధి నరేష్, సేవా కార్యదర్శి విజయ ఇతర సేవా సభ్యులు, శిక్షకులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్ని నిరసిస్తూ క్విట్ ఇండియా డే

నవతెలంగాణ-ఇల్లందు



కేంద్ర కార్మిక సంఘాలు, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయుల ఐక్య పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్ని నిరసిస్తూ స్థానిక పెట్రోల్ బంకు బిల్డింగ్ అడ్డా వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్లో కార్మికులను, రైతాంగాన్ని, వ్యవసాయ, ఉపాధి కూలీలను విస్మరించారని అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం తరహాలో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కామ నాగరాజు, భద్రు, సత్యనారాయణ కోరి, సామ్య నాయక్, యాకూబ్ పాషా, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ పట్టాలు ఇప్పించాలి

- ఎమ్మెల్యే కోరంకు టీడీపీ వినతి

నవతెలంగాణ-ఇల్లందు

పెండింగ్లో ఉన్న క్రమబద్ధీకరణ పట్టాలు ఇప్పించాలని టీడీపీ నియోజక వర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. చిన్న చిన్న కారణాల కారణంగా తిరస్కరించిన వారికి తిరిగి దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కోరం కనకయ్య మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో జరిగే క్రమబద్ధీకరణ విషయంలో ప్రజల ఆశలు సన్నగిల్లి తున్నాయని, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారందరికీ తక్షణమే పట్టాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్యామ్ తీవరి, చాందావత్ రమేష్ బాబు, మాటేలా రత్నాకర్ పాల్గొన్నారు.

ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- రాజాపురంలో కొమరంభీం విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



ఆదివాసీల ఆస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాజాపురం గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అమాయక ఆదివాసీలపై నిర్బంధాలకు స్వస్తి చెప్పాలని, అడవినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసీల బతుకుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం..





- ఎమ్మెల్యే తెల్లం
- ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-భద్రాచల రూరల్

ఇతిహాస నాగరికత సంస్కృతీ సాంప్రదాయాలను పాటించడంలో నిలువుటద్దం ఆదివాసీలు అని, ఆదివాసీ తెగ అంతరించిపోకుండా కాపాడుకోవాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం భద్రాచలంలోని ఆదివాసీ గిరిజన భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు, గంటల దొర, మల్లు దొర ఎందరో ఆదివాసీల ప్రాణ త్యాగాల ఫలితంగా 1982వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ఆగస్టు 9న తీర్మానం చేసినందున ఆరోజు నుండి ప్రపంచం వ్యాప్తంగా ఆదివాసీ తెగల గిరిజనులు వారి వారి సంస్కృతీ సంప్రదాయాల పరంగా పండుగల జరుపుకుంటున్నారని అన్నారు.

గిరిజనులకు సేవ చేయటం ఒక అదృష్టం : కలెక్టర్ జితేష్ బి పాటిల్

ఆదివాసీ ప్రజలకు సేవ చేసే అవకాశం కలగటం ఒక అదృష్టంగా భావిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివాసీ దినోత్సవ వేడుకలలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ. స్వాతంత్ర రాకముందు బ్రిటిష్ వారు మన అటవీ సంపాదనను కొల్లగొడుతుంటే ఆదివాసీ మహనీయులు వారిని అడ్డుకొని పోరాడి అడవులు అంతం కాకుండా కాపాడారని అన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతాం : ఐటీడీఏ పిఓ బి.రాహుల్

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. గిరిజన విద్యార్థుల సంస్కృతి సాంప్రదాయాలు వారి భాషను పరిరక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ కోరారు. ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ విద్యార్థుల అభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు గురుకులాలు కళాశాలలు నెలకొల్పామని చెప్పారు. గర్భిణీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి ప్రత్యేక వైద్య సదుపాయాల అందిస్తున్నామని, ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఒక పండగ వాతావరణం లో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని బి.రాహుల్ తెలిపారు.

స్వచ్ఛమైన మనసు కలిగిన వారే ఆదివాసీలు : ఎస్పీ రోహిత్ రాజ్

మోసాలు, ద్వేషాలు తెలియని స్వచ్ఛమైన మనసున్న ఆదివాసీ బిడ్డలకు సేవ చేసే అదృష్టం కలగటం ఒక గొప్ప వరంగా భావిస్తున్నామని ఎస్పీ రోహిత్ రాజ్ అభిప్రాయపడ్డారు. భద్రాచలంలో జరిగిన ఆదివాసీ దినోత్సవం వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఆదివాసీ విద్యార్థులు విద్యను అభ్యసించి మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని మూఢవిశ్వాసాలకు దూరంగా ఉండాలని కోరారు. గిరిజన విద్యార్థులు చెడు స్నేహాలతో పాటు మాదకద్రవ్యాల అలవాటులకు దూరంగా ఉండాలని, పౌష్టిక ఆహారం తీసుకుంటూ విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆయన కోరారు. అంతకుముందు ఆదివాసీ అమరవీరుల స్థూపాలకు పూలమాలవేసి, ఆదివాసీ జెండా ఆవిష్కరణ చేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గిరిజన భవన్లో ఏర్పాటు చేసిన ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన నృత్యాలను వారు తిలకించారు. హాజరై వివిధ గిరిజన సంఘాల నాయకులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, ఏటిడిఓ అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ఏడి అగ్రికల్చర్ భాస్కర్, ఆర్సిఓ గురుకులం నాగార్జున రావు, డిఎం జిసిసి దావీద్, మేనేజర్ ఆదినారాయణ, డిటిఆర్ ఓఎఫ్ఆర్ శ్రీనివాస్, గిరిజన సంఘాల నాయకులు పూణే కృష్ణ దొర, పాయం రవి వర్మ పాల్గొన్నారు.

ఇల్లందు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ గిరిజన సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సున్నం రాజయ్య నగర్ లో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకురాలు ఈసం వెంకటమ్మ జండా విష్కరణ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గల కొమరం భీం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, కల్లెపల్లి మరియా, ఫాతిమా, బచ్చల రమా కుమారి పాల్గొన్నారు.



బూర్గంపాడు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంఘాల సమన్వయంతో ఆదివాసీల అభ్యున్నతికై, జాతి మనుగడ జాతి ఏకీకృతకై ఐక్యతగా కలిసి నిలవాలని భవిష్యత్లో జాతికోసం ఎటువంటి పోరాటలకైనా సిద్ధంగా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. ఉప్పసాక పంచాయతీలో ఆదివాసీల నేతృత్వంలో వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పుసాక మాజీ సర్పంచ్ పాయం వెంటేశ్వర్లు, సప్కం నాగేశ్వరరావు, ఆదివాసీ యువజన నాయకులు కోర్స వెంకట్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొత్తగూడెం : ఆదివాసీలు హక్కుల పరిరక్షణ కోసం పోరాడుదామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజులు పిలుపు నిచ్చారు. శుక్రవారం కొమరం భీం కాలనీలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కొమరం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు పాల్గొని మాట్లాడుతూ ప్రకృతి వనరుల దోపిడీ కోసం ప్రపంచ వ్యాప్తంగా కార్పోరేట్ ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులు కాలరాస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరికృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జబ్బు సంధ్యారాణి, కుంజ శారద పాల్గొన్నారు.

స్వచ్ఛదనం పచ్చదనం లోపించడంతోనే అతివృష్టి అనావృష్టి

- సాధకులుగా స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యులు కావాలి

నవతెలంగాణ-ఇల్లందు

స్వచ్ఛదనం పచ్చదనంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, సంఘ సేవకులు భాగస్వామ్యులు కావాలని సంఘ సంస్కర్త జాతీయ విపత్తుల నిర్వహణ రాష్ట్ర కమిటీ సభ్యుడు గాయత్రీ పరివార్ యుగ్ నిర్మాణ్ మిషన్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ శుక్రవారం ఒక పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛదనం పచ్చదనం లోపించుడం వలన అతివృష్టి అనావృష్టి వరదలు, ప్రకృతి విపత్తులు జరుగుతున్నాయని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వేత్తలు స్కౌట్ అండ్ గైడ్స్ వాసవి క్లబ్ ఎన్ఎస్ఎస్, ఎన్సిసి, నేషనల్ గ్రీన్ కోర్, పిరమిడ్ మాస్టర్లు క్రీడా రంగాల క్రీడాకారులు, కోచర్లు, సేవా భారతి గాయత్రీ పరివార్ కార్యకర్తలు, అనుబంధ మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, ఆధ్యాత్మిక సేవా సంఘాలు వాకర్స్ క్లబ్ సభ్యులు, యోగా సాధకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్యశాలలో పనిచేస్తున్న కార్మికులు ఇఫ్టులో చేరిక

నవతెలంగాణ-ఇల్లందు

ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు 20 మంది శుక్రవారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి, అధ్యక్ష కార్యదర్శులు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు సమక్షంలో చేరారు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న పేషెంట్ కేర్, సీపర్స్, సెక్యూరిటీ గార్డ్స్, ఎక్సరే విభాగం స్కానింగ్, అసిస్టెంట్ కార్మికులు ఉమ, కవిత, సునీత, సుజాత, ఝాన్సీ, లక్ష్మి, రవి, శ్రీను, నిషార్ రోజా రాణి, తదితరులు చేరారు.

ఆదివాసీ హక్కుల రక్షణకు ఐక్య ఉద్యమాలు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్
- పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఆదివాసీ హక్కుల రక్షణకు ఐక్య ఉద్యమాలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాత మార్కెట్ సెంటర్లో కొమరం భీమ్ విగ్రహానికి రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నాడు ప్రభుత్వాలు ఆర్భాటంగా హడావుడి చేసి, ఆ తరువాత మరలా మరిచిపోతున్నారని విమర్శించారు. ఇప్పటికే అనేక ఆదివాసీ గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్యం అందక సరైన రహదారి సౌకర్యాలు లేక, పౌష్టిక ఆహారం అందక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హడావుడి కార్యక్రమాలు మానుకొని వారి అభివృద్ధి కోసం, వారి హక్కుల కోసం, యువతకు ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే నిజమైన ఆదివాసీలకి ఆదివాసీ దినోత్సవం జరుపుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వైవి రామారావు, పట్టణ కమిటీ సభ్యులు డి.లక్ష్మి, నాగరాజు, కోరాడ శ్రీను, లక్ష్మణ్, కొరసా రవి, రామకృష్ణ పాల్గొన్నారు.



అశ్వాపల్లి : అశ్వాపల్లి, మర్కోడు గ్రామాల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అశ్వాపల్లి ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు పాయం రమేష్ ఆధ్వర్యంలో ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. అశ్వాపల్లి బస్టాండ్ సెంటర్లో స్థానిక మాజీ ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి జెండావిష్కరించారు. అనంతరం ఆదివాసీలు బస్టాండ్ సెంటర్ నుండి భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహిస్తూ వెళ్లి ఆదివాసీ కమ్యూనిటీ హాల్ స్థలంలో స్థానిక పీఏసీఎస్ చైర్మెన్ గొగ్గెల రామయ్య జెండావిష్కరించారు. తదనంతరం రైతు వేదిక కార్యాలయంలో తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి కొమరం వెంకట కృష్ణం రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడు పాయం రమేష్, ఏఈడబ్ల్యూసీఎ జిల్లా కార్యదర్శి జోగ రాంబాబు, మాజీ ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి మాట్లాడారు.

తపాలా సేవలు వినియెగించుకోండి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

తపాల సేవలను వినియోగించుకోవాలని పోస్టల్ అసిస్టెంట్ సూపరిండెంట్ రంజిత్ కుమార్ చౌదరి అన్నారు. అబ్బుగూడెం గ్రామంలో బీవో, ఎస్ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన తపాల సేవలు కార్యక్రమానికి రంజిత్ కుమార్ చౌదరి హాజరైనారు. పోస్ట్ ఆఫీస్లో పి.ఓ.యస్.బి ఇన్సురెన్స్ చేయడం వల్ల కుటుంబానికి ఎంతో అండ అని అన్నారు. తపాల శాఖ గ్రామీణ ప్రజల కోసం చిన్న మొత్తాల పొదుపు, సేవింగ్ అకౌంట్స్, పిపిఎఫ్ టిడి, ఎస్.సి.ఎస్.ఎస్,యంసిఎస్ఎస్లతో అధిక వడ్డీలు తీసుకోవచ్చు అని తపాల బీమా ఆర్పి ఎల్ఐ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులుతో పాటు ప్రొఫెషనల్ డిగ్రీ ఉన్నవారు కూడా జీవిత బీమా పథకం పిఎల్ఐ ద్వారా పొందవచ్చు అని అన్నారు. ఐపిపిబి జనరల్ ఇన్సూరెన్స్ సంవత్సరానికి 520 రూపాలు ప్రీమియం చెల్లించి 10 లక్షలు, 755 రూపాయలు చెల్లించి 15 లక్షలు భీమా పొందవచ్చు అని అన్నారు.ఈ కార్యక్రమంలో యంఓ సత్యనారాయణ,రాజేంద్ర నాయక్, బిపిఎం శ్రీనివాసరెడ్డి, అబ్బుగూడెం బిఓ,పోస్టల్ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజె రమేష్ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు, వ్యవసాయ కార్మికులకు, మహిళలకు ఇతర అన్ని వర్గాలకు వ్యతిరేకంగా ఉన్నదని తెలిపారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పన మాట ఏమో గాని ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రయివేటుపరం చేస్తూ యువతను మరింత నిరుద్యోగులుగా మారుస్తున్నదని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇమ్మంటే కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని అన్నారు. స్థానిక పాత మార్కెట్ సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీ సాక్షిగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నిరసన కార్యక్రమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు డి.లక్ష్మి, సీఐటీయూ నాయకులు వై.వెంకట రామారావు, నాగరాజు, లక్ష్మణ్, రామకృష్ణ, కేవీపీఎస్ జిల్లా నాయకులు కోరాడ శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు కొరసా రవి, ప్రజాసంఘాల నాయకులు సక్కుబాయి, రాధ, కనక శ్రీ, వెంకట్రావు, నాగమ్మ, లక్ష్మీకాంతం, తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాద రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి

- బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్
- విధుల బహిష్కరణ, బైక్ ర్యాలీ


నవతెలంగాణ-ఇల్లందు

పోలీస్ అధికారులు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని, న్యాయవాద పరిరక్షణకు చట్టం తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జనగాంలో న్యాయవాద దంపతులుపై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి బంద్ కు పిలుపునిచ్చారు. న్యాయవాదులు ర్యాలీగా బయలుదేరి కొత్త బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం అధ్యక్షుడు భూక్య రవికుమార్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పాల్పడితే ముందు ముందు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తీక్ సీనియర్ న్యాయవాదులు, మేకల దుర్గయ్య దంతాల ఆనంద్, ఎస్వి నరసయ్య, పి.బాలకృష్ణ, టి.మహేశ్వరరావు, వి.నాగేశ్వరరావు, పి.యాకయ్య, కొండ నారాయణ, ఎస్డి రబ్బాని పాల్గొన్నారు.

కోతుల బెడద నివారించండి

ఎంపీడీఓకు గ్రామస్తుల వినతి

నవతెలంగాణ - అశ్వారావుపేట



కోతుల బారి నుంచి విద్యార్థులను కాపాడాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కుమారికి ఆసుపాక గ్రామస్తులు వినతి పత్రం అందచేశారు. పాఠశాలలోకి వచ్చి విద్యార్థులను గాయప రుస్తున్నాయని పేర్కొన్నారు. ఇళ్లలోకి చొరబడి వంట సామగ్రి, ఇతర వస్తువులను సైతం ధ్వంసం చేస్తూ, బయటకు తీసుకు వెళ్తున్నాయని, పెంకుటిళ్ల పై కప్పులు, పెంకులను పగల కొట్టం వల్ల వర్షాలకు ఇళ్ల కురుస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎంపీఓ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

పేద వారికి అండగా నిలవడం సంతోషకరం

- నాగేశ్వరరావు జన్మదిన వేడుకలలో కోరం, డీవీ

నవతెలంగాణ-ఇల్లందు

ఎంతో మంది పేదలకు ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు సహాయ, సహకారాలు అందించడం చాలా గొప్ప విశేషయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు జన్మదిన సందర్భంగా శుక్రవారం మండలం అధ్యక్షుడి వారి ఇంటి వద్ద ఇల్లందు నియోజకవర్గం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు విచ్చేసి ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరావుని కలిసి శాలువాలతో, పూలదండతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి స్వీట్లు తినిపించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరి నాగేశ్వరరావు ఇలాగనే మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని అన్నారు. అతి చిన్న వయసులోనే మీరు ఇల్లందు ఆర్యవైశ్య మహాసభకు మండల అధ్యక్షుడిగా, ఫెర్టిలైజర్స్ ఎండ్ పెస్టిసైడ్స్, సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా మంచి ఉన్నతమైన స్థాయిలో ఉండటం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు కండె రమేష్, యువజన సంఘం అధ్యక్షుడు సరేంద్రుల అను, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, పిఎసిఎస్ చైర్మెన్, మండల, జిల్లా ఫెర్టిలైజర్స్ వ్యాపారులు పెద్ద సంఖ్యలో ప్రొద్దుటూరి నాగేశ్వరావు ఇంటి వద్దకు వచ్చి మండల అధ్యక్షుడికి శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-కొత్తగూడెం

పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి హేమచంద్ర బాబు ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు గమనించాలని కోరారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు గంగా హుస్సేన్ బస్తి, ఫ్యూన్ బస్తి, ఏ-పవర్ హౌస్ బస్తి, రామవరం, 2-ఇంక్లైన్, గరిమెల్లపాడు, చిట్టిరామవరంలోని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



ఆదివాసీలు ఐక్యం కండి

- హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడుదాం
- యూటీఎఫ్ జిల్లా నాయకులు మురళీమోహన్

నవతెలంగాణ-చర్ల

ఆదివాసీలు ఐక్యం కావాలని, హక్కుల పరిరక్షన కోసం ఐక్యంగా పోరాడుదామని యూటీఎఫ్ జిల్లా నాయకులు బెండబోయిన మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మురళీమోహన్ మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా 90 దేశాల్లో 7 వేల భాషలతో మాట్లాడుతూ 5 వేల భిన్న సంస్థలు పాటిస్తూ అడవి తల్లిని నమ్ముకున్న ఆదివాసీలకు నేటికీ వారికి రావాల్సిన ఫలాలు అందడం లేదన్నారు. భవిష్యత్తులో ఆదివాసీ మనగూడ ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉన్నదని, ప్రభుత్వాలు ఆడే చదరంగ క్రీడలో ఎన్నో హక్కులు, చట్టాలు కోల్పోతున్నామని జీవో నెంబర్ 3ని అమలు చేయాలని, స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం నరేష్, యూటీఎఫ్ మండల నాయకులు ఉయిక బాలకృష్ణ, మచ్చ రామారావు, తాటి నాగమణి, సమ్మక్క, బందెల చంటి, దొడ్డి హరి నాగ వర్మ, కొరస వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సీతయ్య, వరలక్ష్మి, షారోన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించండి

నవతెలంగాణ-చంద్రుగొండ

నేడు 33/11కేవి చంద్రుగొండ ఉపకేంద్రం నందు మరమ్మతులు ఉన్నందున వినియోగదారులు సహకరించాలని ఏఈ నరసింహారావు కోరారు. ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు చంద్రుగొండ, అయ్యన్నపాలెం, తిప్పనపల్లి, మహమ్మద్ నగర్, సత్యనారాయణ పురం, బాలికుంట, బెండాలపాడు, గుర్రాయి గూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు, వినియోగదారులు సహకరించగలరని కోరారు.

మెడికల్ గ్రౌండ్స్ ద్వారా చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ఏరియాలోని సింగరేణి ఉద్యోగులు నివాసముంటున్న పివి కాలనీ ఎంసీ, టీ-2 టైప్ క్వార్టర్స్‌ను మెడికల్ గ్రౌండ్స్ ద్వారా ఛేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కౌన్సిలింగ్‌ను క్వార్టర్ ఎలట్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్టు పర్సనల్ మేనేజర్ ఎస్.రమేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎస్ఓ టు జీఎం కార్యాలయం నందు కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఏరియా క్వార్టర్ ఎలట్మెంట్ కమిటీ అధికారి, ఎస్ఓ టు జీఎం డీ.శ్యామ్ సుందర్ సమక్షంలో జరిగిన ఈ కౌన్సిలింగ్‌లో ఎంసీ, టీ-2 టైప్ క్వార్టర్స్ పై భాగంలో నివాసముంటున్న ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులు అనారోగ్యం కారణాల వల్ల మెట్లు ఎక్కి దిగడానికి ఇబ్బంది పడుతున్నవారికీ పై క్వార్టర్ నుండి కింది క్వార్టర్ కేటాయించాలని 33 మంది ఉద్యోగులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం అర్హత గల ఉద్యోగుల జాబితాను రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం డి.శ్యామ్ సుందర్, డీజీఎం(పర్సనల్) ఎస్ రమేశ్ డా.సురేశ్ ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ వి.కృష్ణం రాజు, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ గురుకుల కళాశాలలో వైద్యశిబిరం

నవతెలంగాణ-అశ్వారావుపేట

ముస్లిం మైనారిటీ కళాశాలలో అశ్వారావుపేట (వినాయకపురం) పీహెచ్సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ పర్యవేక్షణలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న నలుగురు విద్యార్థినీలకు మలేరియా నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఇందులో ఎవరికీ మలేరియా సోకినట్టు (నెగిటివ్ ఫలితాలు రావడంతో) నిర్ధారణ కాకపోవడంతో సాదారణ జ్వరాలకు ఇచ్చే మందులు అందజేసారు. మరో పది మందికి కాలానుగుణంగా వచ్చే చిరు వ్యాధులకు చికిత్సలు అందజేశారు. మరో ఇద్దరు విద్యార్థినులకు కండ్లకు సంబంధించిన చికిత్సలు అవసరం అని కళాశాల యాజమాన్యంకి తెలియజేశారు. ముఖ్యంగా ఈ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే వెంటనే మా వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ విజిటర్ దుర్గమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఆశా అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్ళపల్లిని ప్లాస్టిక్ రహిత మండలంగా మార్చాలి

- స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో డీపీఓ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఆళ్లపల్లి మండలాన్ని ప్లాస్టిక్ రహిత మండలంలోగా మార్చాలని డీపీఓ చంద్రమౌళి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చివరి రోజు డీపీఓ మండలాన్ని ఆకస్మికంగా సందర్శించి, పలు చోట్ల కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్నారు. దీనిలో భాగంగా మండలంలో చేపట్టిన పూర్తి కార్యక్రమాల వివరాలను స్థానిక ఎంపీఓ బత్తిన శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలో పలు గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. దానికి గాను అనంతోగు, పాటూరు, మర్కోడు, నడిమిగూడెం, తదితర గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశించిన విధంగా స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలు అన్ని విజయవంతం చేయాలని కోరారు. మొక్కలు నాటడమే కాదు వాటి పెంపకంపై శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డివిజినల్ పంచాయతీ అధికారి ఆర్.రమణారావు, ఎంపీడీవో డి.శ్రీను, పంచాయతీ కార్యదర్శులు శిరీష, త్రివేణి, నాగరాజు, అన్వేష్, జబ్బార్, ఈసీ భద్రయ్య టీఏలు శోభన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు మండల కేంద్రమైన బూర్గంపాడులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్ర వారం ఈ కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యం.డి.ముజా హిద్, ఎంపీడీఓ కె.జామలా రెడ్డి, ఎంపీఓ యస్.సునీల్ కుమార్, ఏపీఓ విజయ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య ఐసీడీఎస్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పందెం రాయుళ్లు అరెస్టు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని రాజపురం గ్రామంలో కోడి పందాల ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సబ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు రాజపురం గ్రామంలో జమాయిల్ తోటలో కోడి పందాలు నిర్వహిస్తున్నారు అని సమాచారం రావడంతో పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లి దాడులు చేయగా ఐదుగురు వ్యక్తులు, రెండు కోడి పుంజులు, ముడు సెల్ ఫోన్లు, రూ.3000 నగదు స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేశామని అన్నారు. వారిపై కేసు నమోదు చేశామని తెలియజేశారు.

ఈ దాడుల్లో కానిస్టేబుల్ జీవన్, భాస్కర్ పాల్గొన్నారు.



రుణమాఫీ అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని బేతంపూడి సొసైటీ చైర్మెన్ లక్కినేని సురేందర్ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం రైతులకు రుణమాఫీ పంపిణీ చేసినట్టు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేస్తుందని అన్నారు. ఈ రుణాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే లక్ష్యం



కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన మంత్రి

నవతెలంగాణ-పాల్వంచ

స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా గ్రూప్ యాక్టివిటీ కింద ఓం సాయిరాం మహిళా సంఘం, వినాయక పేద ప్రాంత సమాఖ్య భరతమాత పట్టణ సమాఖ్య కొత్తగూడెం మున్సిపాలిటీ వారు రూ.6,00,000 బ్యాంకు రుణ సహాయంతో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వారికి రుణ సదుపాయాలు అందించి వివిద ఆదాయాభివృద్ధి కార్యక్రమం చేపట్టుటకు ప్రణాళికలను సిద్ధం చేసినట్టు ఆయన తెలిపారు. మహిళా సాధికారతను సాధించుటకు రాబోయే 5 సంవత్సరాలలో చిరు వ్యాపారాలను ప్రోత్సహిస్తూ సంఘ సభ్యులకు నైపుణ్యం పనిలో శిక్షణ ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడం ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్స్‌ను నెలకొల్పడం మిని ఇండస్ట్రీయల్ పార్క్, వడ్డీ రుణాలు, లోన్స్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయుట ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో వారికి కావాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అక్క చెల్లెమ్మలందరూ ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. కొత్తగూడెంలో మొత్తం 5 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మొదటి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. మహిళా శక్తి క్యాంటీన్‌లలో ఆహారం అమ్మ చేతి వంటలా ఉండాలన్నారు. నాణ్యతకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యా చందన, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపల్ కమిషనర్లు, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, మెప్మా డీఎంసీ రాజేష్, మహిళా సంఘ సభ్యులు, క్రీడాకారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల పిల్లలకు అందుబాటులోకి టెన్నిస్ క్రీడా

టెన్నిస్ సింథటిక్ కోర్టు ప్రారంభత్సంలో మంత్రి

పట్టణంలోని శ్రీనివాస్ కాలనీ క్రీడా మైదానంలో నూతనంగా ఏర్పాటు చేసిన సింథటిక్ టెన్నిస్ కోర్టులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెన్నిస్ క్రీడ అందరికీ అందని ద్రాక్ష వలె కాకుండా పట్టణంలోని అన్ని వర్గాల పిల్లలకు అందుబాటులోకి తేవాలనీ క్రీడా శాఖాధికారులకు ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన టెన్నిస్ క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసిన టెన్నిస్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ యుగేందర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. జిల్లాలోని పలుచోట్ల క్రీడా మైదానాలను గుర్తించాలని జిల్లా స్పోర్ట్స్ అధికారి పరంధామ రెడ్డికి సూచనలు చేశారు. ఆర్చరీ క్రీడాకారులను అభినందించి, అనంతరం క్రీడా మైదానంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, రాష్ట్ర మార్క్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి షాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి కృష్ణ, టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు జకరయ్య, వై.వెంకటేశ్వర్లు, చీఫ్ కోచ్ అన్నం వెంకటేశ్వర్లు, టెన్నిస్ సీనియర్ క్రీడాకారులు, పాల్గొన్నారు.



కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెంలో మరోసారి బీఆర్ఎస్‌కు ఎదురు దెబ్బ తగిలింది. బీఆర్ఎస్ నాయకుడు, వనమా వెంకటేశ్వరరావుకు అనుచరుడుగా ఉన్న కనుకుంట్ల శ్రీనివాస్ (కేకే) శుక్రవారం కాంగ్రెస్ గూటికి చేరారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొత్తగూడెం పర్యటనలో భాగంగా చుంచుపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సమక్షంలో కాంగ్రెస్ కండువ కప్పుకున్నారు. బీఆర్ఎస్ యూత్‌లో ఫాలోయింగ్ ఉన్న కనుకుంట్ల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్‌గా చెప్పవచ్చు. కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఆళ్ల మురళి ఆధ్వర్యంలో కెకె చేరారు. ఆయనతో పాటు మున్సిపల్ కౌన్సిలర్ మోరె రూప, మున్సిపల్ కో-ఆప్షన్ నెంబర్ కనుకుంట్ల పార్వతి, పోస్ట్ ఆఫీస్ వాసు, మాజీ బీఆర్ఎస్ మహిళా టౌన్ ప్రెసిడెంట్ మాట్ల గాయత్రి, మోహనా చారి, మున్నా, ఈశ్వర్ గుడివాడ కొసన సంధ్య రాము, ఆదిలక్ష్మి, సంగీత్, చింటూ, త్రిమూర్తులు, కనుకుంట్ల కిరణ్ తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన వారిని మంత్రి కండువలు కప్పి ఆహ్వానించారు.

మంచినీళ్లు అనుకుని దోమల మందు తాగిన పారిశుధ్య కార్మికురాలు

- ఆసుపత్రిలో చికిత్స...
- పరామర్శించిన పలువురు

నవతెలంగాణ-కొత్తగూడెం

మంచినీళ్ల అనుకుని పారిశుధ్య కార్మికురాలు దోమల మందు తాగి అస్వస్థతకు గురైన సంఘటన కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. కొత్తగూడెం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికురాలు బత్తుల ఓదమ్మకు దాహం వేయడంతో బాటిల్‌లో ఉన్న దోమల మందును మంచినీళ్లుగా భావించి తాగింది. అస్వస్థతకు గురైంది. ఈ సంఘటన శుక్రవారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని 8వ వార్డులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... ఓదమ్మ పారిశుధ్య విధులు నిర్వహిస్తుంది. అదే ప్రాంతంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దోమల మందు ఫాగింగ్ చేస్తున్నారు. అక్కడే పనులు చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికురాలకు దాహం వేయడంతో మంచినీళ్ల అనుకొని పొరపాటున దోమల మందు తాగింది. దీంతో అస్వస్థకు గురి కావడంతో స్థానికులు ఆమెను కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయ స్వామి ఓదమ్మను పరామర్శించారు. ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఓదమ్మకు చికిత్స అందిస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు రక్షణ కరువు : బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్

కొత్తగూడెం మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ కరువైందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ ఆరోపించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బత్తుల ఓదెమ్మను పరామర్శించి, మాట్లాడారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా కార్మికుల ప్రాణాల మీదకు వస్తుందని అన్నారు. దోమలకు కొట్టాల్సిన మందును మంచినీళ్ల బాటిల్‌లో పోసి ఇవ్వడమేంటని ప్రశ్నించారు..? ఇటీవల కరెంట్ షాక్ తగిలి దుర్గాప్రసాద్ అనే కార్మికుడు హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఘటన జరిగి 20 రోజులు గడవక ముందే ఇలా జరగడమంటే మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున రావు, వంగా రవిశంకర్, మురళి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన సాంప్రదాయాన్ని కాపాడుదాం



- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మణుగూరు

పెరుగుతున్న ఆధునీకత వలన గిరిజన సాంప్రదాయం అంతరించిపోతుందని, గిరిజనుల హక్కుల కోసం పోరాడిన వీరులను స్మరించుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజన సాంప్రదాయ నృత్యాలు, కొమ్ము కోలాటాలతో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొనగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ విద్యార్థి, యువజన, ఉద్యోగ, రైతు సంఘాలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మేధావులు, తారతమ్య బేధాలు లేకుండా ఆదివాసులు దృశ్యాలు చేస్తూ భారీగా ఊరేగించారు. 14 పంచాయతీలలో అన్ని గ్రామాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని గిరిజనలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ పెరుగుతున్న ఆధునీకత వలన గిరిజన సాంప్రదాయాలు, సంస్కృతి అంతరించి పోతున్నాయని అన్నారు. కాపాడే బాధ్యత గిరిజనులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందా సంతోష్ కుమార్, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, సీనియర్ ఆదివాసీ నాయకులు, ఆదివాసీ ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గిరిజనుల అభివృద్ధితోనే సమగ్రాభివృద్ధి

పినపాక : ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం మండలంలోని ఈ.బయ్యారం క్రాస్ రోడ్డులో నిర్వహించగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ మహిళలతో, ఆదివాసీ జేఏసీ నాయకులతో కలిసి నృత్యం చేసి, డప్పు వాయించారు. గిరిజన చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాక్ నాయకులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ

టేకులపల్లి : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బోడు గ్రామంలో తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ కల్తీ సత్యనారాయణ అధ్యక్షతన కొమరం బీమ్ విగ్రహావిష్కరణ ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు మూర్తి సత్యం, ఆదివాసీ ఆల్ ఇండియా కన్వీనర్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అవునూరి మధులు మాట్లాడారు. ఆదివాసీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సాంస్కృతికంగా వెనకబడిన వారని అన్నారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో పోరాడిన బిర్సం ముండా, గుండాధర్, ఖాన్ సింధు, కొమరం భీమ్, రాంజీ గోండు, కోటన్న, బాటన్న, లింగన్నలు అనేకమంది ఈ పోరాటంలో భాగస్వామ్యులైనారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ దొర కుంజ సాంబయ్య, పటేల్ మాడె లాలయ్య, ఎట్టి నరసింహారావు, మేడె ప్రదీప్, కుంజ శివ, ముడిగ నరసింహారావు, పూనెం .స్వామి, ఎట్టి ప్రశాంత్, ఈసాల రవి, గుమ్మడి సమ్మయ్య టీచర్ యూనియన్, జోగా రాంబ్రహ్మం టీచర్ యూనియన్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజనులు మండల వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ సందర్భంగా గిరిజన గూడేలలో జెండాలను ఎగురవేశారు. అనంతరం మండల కేంద్రమైన లక్ష్మీ నగర్‌లో జరిగే భారీ ప్రదర్శన, ములకపాడు క్రీడ మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు వాహనాలు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా మండల కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం భారీ ప్రదర్శనగా లక్ష్మీ నగరం నుంచి ములకపాడు క్రీడా మైదానం వద్దకు కొమ్ము నృత్యాలు, ఆదివాసీ గేయాలు, డప్పుల దరువులు, డీజే హడావుడితో ఏజెన్సీ ప్రాంతం ఆదివాసి జెండాలతో రెపరెపలాడింది. భారీ ప్రదర్శనగా మైదానం వద్దకు వచ్చిన ఆదివాసీ పెద్దలు అక్కడే భారీ బహిరంగ సభలో మాట్లాడారు. ఆదివాసీ నాయకుడు కుంజా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలు అమలు కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అశోక్ కుమార్, జేఏసీ గౌరవ అధ్యక్షులు కొమరం దామోదరావు, కుంజ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ తెల్లం సీతమ్మ మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి,నాయకులు తెల్లం హరికృష్ణ, సోయం కామరాజు, సోంది మల్లూరు, కనితి రాముడు, సరియం కోటేశ్వరరావు, కారం పుల్లయ్య, మట్ట వెంకటేశ్వరరావు, మర్మం చంద్రయ్య, ముర్రం వీరభద్రం, కనితి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా సేవలు అందుకోండి

నవతెలంగాణ-చర్ల



గ్రామీణ ప్రాంతాలలో తపాలా కార్యాలయం సేవలు సద్వినియోగపరుచుకోవాలని ఏఎస్పీ ఐ.అశోక్ కుమార్ కోరారు. శుక్రవారం భారతప్రభుత్వం తపాలా శాఖ భద్రాచలం సబ్ డివిజన్‌కు చెందిన లింగాపురం బ్రాంచ్ పోస్టు ఆఫీసుకు సంబంధించి డీసీడీపీ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా పోస్ట్ ఆఫీస్‌లో లభిస్తున్న అన్ని రకాల పీవోఎస్‌బీ, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవల గురించి ఆయన వివరించారు. ప్రతి తపాలా కార్యాలయాలలో ఈ పథకాలు అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు. పోస్టల్ సిబ్బంది అందరూ ఈ పదకాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎం రవికుమార్, పీఏ వెంకటేశ్వర్లు, ఎంఓలు అనందగోపాల్, దుర్గాప్రసాద్ పోస్టల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని సీతారాంపురం గ్రామంలో సీపీడబ్ల్యూడీ నిధుల ద్వారా సుమారు రూ.36 కోట్లతో నిర్మిస్తున్న ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ పాఠశాల నిర్మాణ పనులను తహశీల్దార్ ఎం.అశోక్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అంగన్వాడీ టీచర్ కే.రాధను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ వెంట కార్యాలయ సిబ్బంది విజయ్ తదితరులు ఉన్నారు.



ప్రాజెక్టు అలుగు నిర్మాణం వెంటనే చేపట్టాలి

- మాజీ జెడ్పీటీసీ వెంకటరెడ్డి

నవతెలంగాణ-చంద్రుగొండ

మండల రైతుల ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయినటువంటి వెంగళరావు ప్రాజెక్టు అలుగు నిర్మాణం వెంటనే చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొణకండ్ల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... వెంగళరావు సాగర్ అలుగు తెగిపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ వెంటనే జోక్యం చేసుకొని ప్రభుత్వంతో మాట్లాడి, నిధులు మంజూరి చేయించాలన్నారు. అధికారుల వైపల్యం వల్లనే నిధులు రాకుండా పోతున్నాయని ఆరోపించాడు. ఇన్నాళ్లు నాకు జెడ్పీటీసీగా పనిచేసే అవకాశం కల్పించిన మండల ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నాడు. గత ప్రభుత్వం కొనసాగించిన అభివృద్ధిని ఈ ప్రభుత్వం సైతం కొనసాగించాలన్నారు. ఏజెన్సీ ఏరియాలోని రైతులందరికీ షరతులు లేకుండా రుణమాపీ వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశంలో గుంపెన సొసైటీ వైస్ చైర్మెన్ నల్లమోతు వెంకటనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దారా వెంకటేశ్వరరావు, మద్దిరాల చిన్నపిచ్చయ్య, సత్తి నాగేశ్వరరావు, కన్నయ్య కాక లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల కేంద్రమైన బూర్గంపాడులో జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నాయకులు యడమకంటి సుధాకర్ రెడ్డి, నిమ్మల హరీష్ యాదవ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు మందా నాగరాజు, భజన సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను చేశారు. జెండా ఆవిష్కరణ చేసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బూర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. స్వచ్ఛదనం పచ్చదనం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ గొప్ప దనాన్ని, యువజన విభాగం ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక యువకులు, కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | ఆగస్టు 10, 2024 | www.navatelangana.com

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం

- ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి

నవతెలంగాణ- ఖమ్మం



క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మహిళలు అంతా ఐక్యమై మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని, మహిళలకి ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని, ప్రజలందరికీ ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవన విధానం మెరుగుపడే విధంగా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలపై ఉందని ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి అన్నారు . శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా డే సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఐద్వా నాయకురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ వినేష్ పొగట్ 100 గ్రాముల బరువు ఎక్కువ ఉందనే సాకుతో ఆమెని ఒలంపిక్ క్రీడల నుంచి రిజెక్ట్ చేసిన పద్ధతి చూస్తే కావాలని కుట్ర చేసినట్లు ఉందన్నారు. మహిళలపై జరుగుతున్న ఈ కుట్రలను అర్థం చేసుకోవాలంటే చైతన్యంగా మహిళలంతా ఆలోచించి ప్రగతి వైపు పయనించాలని, అప్పుడే నిజమైన స్వాతంత్రం వస్తుందని అన్నారు .ఈ సెమినార్‌లో జిల్లా ఉపాధ్యక్షురాల్లు మెరుగు రమణ, మెహరున్నీసా బేగం, అమరావతి, పకీరమ్మ, బీబీ, రజిత , అజిత, పద్మ కుమారి, అరుణ, సుగుణమ్మ, ఫరీదా, సునీత, పుష్పరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మోహన్ రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మత్తులలో భాగంగా ఉదయం 7 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. కావునా మండల వ్యాప్తంగా ఉన్న విద్యుత్ వినియోగదారులు రెండు గంటలసేపు ఏర్పడే విద్యుత్ అంతరాయానికి సహకరించాలన్నారు.

సెల్ టవర్ ఎక్కి యువకుడి ఆందోళన

నవతెలంగాణ-వైరా

సిరిపురం (కేజీ) గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రభుత్వ పథకాలు తమకు అందటం లేదని శుక్రవారం సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. సిరిపురం (కేజీ) గ్రామానికి చెందిన నారపోగు నాగకృష్ణ తన తండ్రి భిక్షంకు 69 సంవత్సరాలు ఉన్నప్పటికీ వృద్ధాప్య పింఛన్ మంజూరు కాలేదని ఆందోళనకు దిగాడు. అలాగే 2017లో తమకున్న వ్యవసాయ పొలం మీద తన తండ్రి భిక్షం యూనియన్ బ్యాంకు రూ.50 వేలు రుణం తీసుకుంటే దానికి ఇప్పటి వరకు రూ.38 వేలు వడ్డీ అయ్యిందని, మొత్తం బ్యాంకుకు రూ.88 వేలు చెల్లించాల్సి ఉంటే ప్రభుత్వం ఇటీవల లక్షన్నర లోపు రైతులకు రుణమాఫీ చేసిందని కానీ తమకు రుణమాఫీ కూడా కాలేదని సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. దాంతో విషయం తెలుసుకున్న గ్రామంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు అధికారులతో మాట్లాడి మీ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించాడు.

వైభవంగా నెల నెలా.. వెన్నెల 7వ వార్షికోత్సవం

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నెల నెలా..వెన్నెల ఏడవ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభ సూచకంగా కార్యక్రమాన్ని కళా పరిషత్ గౌరవ అధ్యక్షులు వివి.అప్పారావు, అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిన రవి, నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, సీనియర్ కళాకారులు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్ బాబు బయ్యన, డాక్టర్ వేల్పుల విజేత, అన్నాబత్తుల రాణి, కురవెల్ల ప్రవీణ్, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, కట్ల కృష్ణార్జునరావ్, అరవపల్లి లక్ష్మీనారాయణలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కళా రంగ ఉద్దండులు వి.వి అప్పారావుకి స్తంభాద్రి అవార్డు ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆత్మీయ అతిథులు మిత్ర గ్రూప్ అధినేత కురివెళ్ల ప్రవీణ్ మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలుగా నిరాటంకంగా నిర్వహించడం అంటే గొప్ప విషయమని, ఇటువంటి కార్యక్రమాలకు తమలాంటి వాళ్ళ ప్రోత్సాహం, సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు.

ఎస్సైగా కూచిపూడి జగదీష్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



తిరుమలాయపాలెం ఎస్సైగా కూచిపూడి జగదీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దంతాలపల్లి పోలీస్‌స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. తిరుమలాయపాలెం ఎస్సైగా పనిచేస్తున్న బైరెడ్డి గిరిధర్ రెడ్డి గూడూరు ఎస్సైగా బదిలీ అయ్యారు.

మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారం

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారం అని, మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ సిలార్ అన్నారు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మండల పరిధిలోని మహమ్మదాపురం, మేడేపల్లి, దమ్మాయిగూడెంలో జరిగిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామాలలో చెత్తాచెదారం తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో నరసింహారావు, ఈసీ అరుంధతి, టిఏలు వెంకటేశ్వర్లు, మనోహర్, ఎఫ్‌ఏలు రాజు, వెంకయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలపై అసిస్టెంట్ కమిషనర్‌కు సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

48వ డివిజన్‌లోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) త్రీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 48వ డివిజన్లో సారథి నగర్, మేకల నారాయణ నగర్‌లో సిసి రోడ్లు లేకపోవడం వల్ల వర్షం వచ్చినప్పుడు నీరు నిల్వ ఉంటుందని, దీంతో ప్రజలు నడవడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.. అలాగే రోడ్లమీద అక్కడక్కడ గుంతలు పడి ప్రయాణం చేయాలంటే వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.రామకృష్ణ, మద్దెల పుల్లారావు, హనుమంతరావు, తోకల బాబు పాల్గొన్నారు.

నిరాడంబరుడు బుద్ధదేవ్ భట్టాచార్య

- కారేపల్లిలో సంతాప సభ

నవతెలంగాణ-కారేపల్లి

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, మార్క్సిస్ట్ యోధుడు బుద్ధదేవ్ భట్టాచార్య నిరాండబర జీవితాన్ని గడిపిన మహానుభావుడని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర అన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం కారేపల్లిలో బుద్ధదేవ్ భట్టాచార్య మరణానికి సంతాప సభ నిర్వహించారు. బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సంస్మరణ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ముక్కా సీతారాములు, హమాలీ యూనియన్ నాయకులు ఆరేల్లి శ్రీరాములు, సంపత్, సైదులు, రాయుడు, హనుమంతరావు, ప్రతాప్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధారం పాఠశాలలో శుద్ధజల యూనిట్ ప్రారంభం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం సిద్ధారం ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎన్ఆర్ఐ దంపతుల సహకారంతో విద్యార్థుల కోసం శుక్రవారం శుద్ధజల యూనిట్‌ను ప్రారంభించారు. బెల్జియంలో స్థిరపడిన కొడాలి సునీల్‌బాబు, హిమబిందు ఈ శుద్ధజల యూనిట్ ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ప్యూరిఫైర్ వాటర్ పరికరాలను ఏర్పాటు చేయడంపై ఎన్ఆర్ఐ దంపతులకు ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్ఎం కొక్కెరపాటి వెంకటేశ్వరరావు (కేవీ), ఉపాధ్యాయులు నాగమణి, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎంఎస్‌వో నక్కా రాజేశ్వరరావు, కాంప్లెక్స్ హెచ్ఎం శైలకుమారి పాల్గొన్నారు.

సకినవీడులో స్వచ్ఛదనం కార్యక్రమం

ఎర్రుపాలెం : మండల పరిధిలోని సకినవీడు గ్రామంలో పచ్చదనం- స్వచ్ఛదనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి శీలం రామకృష్ణారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్ కోట లక్ష్మి, మంగళపూడి బుజ్జమ్మ, తిరుమలశెట్టి సామ్రాజ్యం, గ్రామదీపిక మల్లారపు సైదమ్మ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రామాల భాస్కర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసు సిస్టంతో ఆటలా..!

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని కంప్యూటర్ తో పిల్లలు ఆటలాడుకుంటున్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న డీఏవో కార్యాలయంలో ఓ అధికారిణి కుమారునికి ఇలా సిస్టంను అప్పగించారు. ఎదురుగా స్నాక్స్ ఉంచడంతో ఆ పిల్లవాడు ఎంచక్కా కంప్యూటర్లో గేమ్స్ ఆడుకుంటున్నాడు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ఎంతో విలువైన సమాచారం ఉండే సిస్టంతో పిల్లలు ఆటలాడుతుంటే... పొరపాటున డేటా డిలిట్ అయితే ఏంటనే.. ప్రశ్న తలెత్తుతోంది.

కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం పేదలకు పంగా నామం

నవతెలంగాణ-ములకలపల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశాలలో పేదల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా, బడా కార్పొరేట్ కారులకు అనుకూలంగా ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని శుక్రవారం ప్రధాన రహదారిపై కేంద్ర ప్రభుత్వ విధానాలపై రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, రైతులు, రైతు కూలీలు ఐక్యంగా ఉద్యమాలు పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోడియం వెంకటేశ్వర్లు, గౌరీ నాగేశ్వరరావు, గోగ్గల ఆదినారాయణ, నిమ్మల మధు, వెంకటేశ్వర్లు, రవీందర్, రాఘవయ్య, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సభ్యుల పదవీ విరమణ సభ

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మండల పరిషత్ కార్యవర్గ సభ్యుల పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సభలో పాల్గొని ఎంపీపీ భూక్య సోనా, కొఆప్షన్ సభ్యులు జక్కుల సుందర్, ఎంపీటీసీ బాబురావు, కొల్లు పద్మ, తరాల రామ్మూర్తిలను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉర్దుఘార్ ఛైర్మెన్ అన్వర్ పాషా, ఆత్మకమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్, మైనారిటీ మండల అధ్యక్షుడు ఇక్బాల్, బండ్ల రత్నాకర్, రామకృష్ణ, తుర్పటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఎముకలు విరిగి ఆస్పత్రిలో చేరిన సాయికిరణ్
- లక్ష్మీపురం బీసీ గురుకులంలో ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యం
- కలెక్టర్ స్పందించి కుటుంబానికి తగు న్యాయం చేయాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం, లక్ష్మీపురంలోని బీసీ బాలుర గురుకులంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా, ఖమ్మం జిల్లా చింతకాని మండలానికి చెందిన విద్యార్థి దండుగుల సాయి కిరణ్ ముక్కు, ఎముకలు విరిగి ఆసుపత్రిలో చేరాడు. ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ కారణంగా ఓ విద్యార్థి సాయి కిరణ్‌ను కొట్టి ముక్కు ఎముకలు విరగగొట్టాడు. ఎముకలు విరిగిన సాయికిరణ్ ఖమ్మం పట్టణ కేంద్రంలోని ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్‌కు కనీసం రూ.లక్ష అవసరం ఉండగా ఆ కుటుంబం డబ్బు లేక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంది. ఆపరేషన్‌కు డబ్బులు లేని పరిస్థితుల్లో వడ్డీలకు తీసుకు వచ్చి ఆపరేషన్ చేయించాల్సిన దుస్థితి నెలకొంది. ఇంత జరిగినా కనీసం ఆర్‌సీఓ, డీసీఓ పట్టించుకోకపోవడంతో కుటుంబం ఎస్ఎఫ్ఐని ఆశ్రయించింది. బీసీ గురుకులాల్లో ఆర్‌సీఓ, డీసీఓ ప్రిన్సిపాల్‌ల నిర్లక్ష్యం తార స్థాయికి చేరింది. బీసీ గురుకులల్లో విద్యార్థులకు నాణ్య మైన పౌష్టికాహారం అందించడం లేదు. రెగ్యులర్ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. అద్దె బిల్డింగ్‌లలో తీవ్రమైన సమస్యలు ఉన్నాయి. వీటన్నింటినీ ఆర్‌సీఓ కనీస పర్యవేక్షణ చేయడం లేదు.



గతంలోనూ ఓ విద్యార్థిని తన తప్పేమీ లేకపో యినా గురుకులం నుండి టీసీ ఇచ్చి పంపిన సందర్భాలు ఉన్నాయి. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా కనీసం పట్టించుకోవడం లేదు. ఆర్‌సీఓ ఇంట ర్మీడియట్ అడ్మిషన్లలో తనకు నచ్చిన వారికి మాత్రమే అడ్మిషన్లు ఇస్తుంది. పేద పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వడం లేదు, విద్యార్థులు సప్లిమెంటరీ పాస్ అనే పేరుతో అడ్మిషన్ తిరస్కరిస్తున్నారు. బిసి గురుకులాల్లో కేవలం కుటుంబం సంవత్సర ఆదాయం ఆధారంగానే అడ్మి షన్లు ఇవ్వాల్సి ఉండగా, మెరిట్ పేరుతో పేద విద్యా ర్థులకు అడ్మిషన్లు తిరస్కరిస్తున్నారు. బీసీ గురుకులాల్లో ఇటువంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయి. పాఠశాల విద్యార్థులకు అడ్మిషన్లు కేటాయించే విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలుమార్లు తమ దృష్టికి తీసుకువెళ్లినా పేద విద్యార్థులకు కనీసం అడ్మిషన్లు కేటాయించడం లేదు. పలుకుబడి ఉన్న నాయకులు నాయకులు రెకమండేషన్లు చేస్తే అడ్మి షన్లు దొరికే పరిస్థితి ఉంది.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకులల్లో తీవ్రమైన సమస్య లున్నప్పటికీ రీజినల్ కోఆర్డినేటర్ అంజలి ఏనాడు కనీసం పట్టించుకున్నది లేదని, కనీసం ఓ విద్యాసంస్థను సందర్శించిన సందర్భం లేదని ఆయన అన్నారు. హాస్టల్లో విద్యార్థులు కొట్టుకుంటే కింద పడ్డారు అని చెప్పేసి లెటర్ రాయాలంటూ, హౌస్ మాస్టర్ మరో టీచర్ వేధించడం ఏంటి? తక్షణమే విద్యార్థి కుటుంబానికి తగు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి ఆసుపత్రికి అయ్యే ఖర్చు బీసీ గురుకులాల కమిషనరేట్ భరించాలని, తక్షణమే బీసీ గురుకుల కమిషనర్, కలెక్టర్ స్పందించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని కుటుంబానికి తగు న్యాయం చేయాలని ఆయన అన్నారు.

ఆదివాసీ సంస్కృతి అత్యంత ప్రాచీనమైనది

- సీపీఐ(ఎం) నాయకులు పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట

దేశంలోనే ఆదివాసీ సంస్కృతి అత్యంత ప్రాచీనమైనదని, ఉనికి కోల్పోతున్న సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో సంఘం నాయకులు మడకం నాగేశ్వరరావు అధ్యక్షతన నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మండలంలోని నందిపాడులో నిర్వహించారు. స్థానిక మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు ఊకే వీరాస్వామి ముందుగా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పుల్లయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చిరంజీవి, మాజీ సర్పంచ్ బుల్లెమ్మ, కారం సూరిబాబు, జోగారావు, పెద్ద ప్రసాద్, సీతయ్యలు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్-మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో

సీపీఐ ఎంఎల్-మాస్ లైన్ ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో అశ్వారావుపేట కార్యాలయంలో పార్టీ మండల నాయకుడు బాడిశ లక్ష్మణ్ రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి వాసం బుచ్చి రాజులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ మండల కార్యదర్శి కుంజా అర్జున్, పీఓడబ్ల్యూ మండల కార్యదర్శి కంగాల భూ లక్ష్మీ, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధే నా అజెండా : మాజీ ఎమ్మెల్యే మెచ్చా

ఆదివాసీ అభివృద్ధే నా అజెండా అని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో గల కొమరం భీం విగ్రహం వద్ద పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజన మహిళా ఉద్యోగులతో కలిసి ఆదివాసీ నృత్యం చేసారు. ఈ కార్యక్రమంలో సత్యవరపు సంపూర్ణ, మందపాటి రాజమోహన్ రెడ్డి, నియోజకవర్గ, మండల స్థాయి ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

అధికారం ఉన్నా లేకున్నా ఆదివాసీల అభివృద్ధికే తోడ్పడతా : మెచ్చా

దమ్మపేట : అధికారం ఉన్నా లేకున్నా ఆదివాసీల అభివృద్ధికి తోడ్పడతానని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం దమ్మపేటలో జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ



దినోత్సవ వేడుకలలో మెచ్చా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా మెచ్చా స్వగ్రామంలో ఆదివాసీ జెండాను ఆవిష్కరించి కొమరంభీమ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకలో మెచ్చా పాల్గొని కొమరం భీమ్ విగ్రహానికి, సోయం గంగులు విగ్రహాలకు పులమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం ఆధ్వర్యంలో...

గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం పురష్కరించుకొని మండల కేంద్రం దమ్మపేట, అంకంపాలెం, ముకుందాపురం గ్రామాల్లో గిరిజన సంఘం జెండాలు ఎగురవేశారు. అంకంపాలెంలో జరిగిన కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు పెనుబల్లి నానారావు జెండా ఎగురవేయగా దమ్మపేటలో రావుల శోభన్ బాబు, ముకుందాపురంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు పిట్టల అర్జున్ రావులు జెండాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, శ్రీనివాసరావు, రాంప్రసాద్, మారు సీతారాములు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పాలకులు పటిష్టంగా అమలు చేయాలి

ఆదివాసీ చట్టాలను పాలకులు పటిష్టంగా అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి పేర్కొన్నారు. మాస్‌లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని స్థానిక మార్కెట్‌యార్డులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము, వగ్గేలప్రసాదు, రాముడు, వీరబాబు, నాగేష్, నాగరాజు, వరలక్ష్మి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా గుర్తించాలి

ప్రభుత్వం ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినోత్సవంగా గుర్తించాలని ఆదివాసీ నాయకుడు సున్నం శ్రీను కోరారు. దమ్మపేట గ్రామ శివారులో యార్లగడ్డ భాస్కర్ రావు నగర్‌లో దినోత్సవం ఘనంగా నిర్వహించారు, ఈ



కార్యక్రమంలో ఆదివాసి నాయకుడు సున్నం శ్రీను, గంటా వెంకటేశ్వరరావులు జెండా ఆవిష్కరించారు. అనంతరం శ్రీను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు తంబళ్ల రవి, పాకనాటి శ్రీను, సీపీఐ మండల సహాయ కార్యదర్శి యార్లగడ్డ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు : మండల కేంద్రంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తెల్లం నరసింహారావు దొర, కొమరం భీం ఫౌండేషన్ మండల అధ్యక్షుడు బచ్చల లక్ష్మయ్య, కార్యదర్శి పూనెం సూరయ్య, కోశాధికారి ఇర్పా రామారావు, ఉపాధ్యక్షులు రామ్మూర్తి, మహిళా సంఘం నాయకురాలు కోడెం సీతాకుమారి, ఎమ్మార్పిఎస్, బీఎస్పీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆగస్టు-9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జండాలు ఎగరవేసి, ర్యాలీ నిర్వహించారు. నిర్వహించిన మండల సమావేశంలో అధ్యక్షుడు పడిగ నారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలెం కోటి మాట్లాడారు. ఈ సందర్భంగా కొమరంభీమ్, అల్లూరి సీతారామరాజు, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో చందా సంతోష్, సంసింగారం మాజీ సర్పంచ్, బచ్చల భారతి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు వరుస శ్రీనివాస్, డివిజన్ నాయకులు కొమరం సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్ : కొమరం భీం ఆశయ సాధనకు ఆదివాసీలు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ పేర్కొంది. శుక్రవారం కొమరం భీమ్ కమిటీ హాల్ ప్రాంగణంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కిన్నెరసాని, ఒడ్డుగూడెం, తోగూడెం, సూరారం ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఆదివాసీ నాయకులు సోయం సత్యనారాయణ, సోయం లక్ష్మయ్య దొర, అరేం ప్రశాంత్, రామకృష్ణ, కుంజా దుర్గా, తురసం దశరాజ్, రమేష్, వెంకాట్, అంజి, రవి, బాలు, మహిళలు పాల్గొన్నారు.

పినపాక : ఆదివాసులకు ప్రభుత్వం మరింత సౌకర్యాలు కల్పించాలన్నాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ చేపట్టి ఎస్టీలకు న్యాయం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మడివి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ఆదివాసీలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కొమ్ము నృత్యాలు, ప్రత్యేక అలంకరణలు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఈ బయ్యారం క్రాస్ రోడ్లో గల కొమరం భీమ్ విగ్రహం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు దుబ్బ గోవర్ధన్, కరకగూడెం సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమరం కాంతారావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కరకగూడెం : ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కొమరం భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజన సాంస్కృతిక సంప్రదాయ నృత్య వేషధారణలతో కోయ, కొమ్ము నృత్యలు నిర్వహించారు. ముఖ్య నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేగా కాళికా, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాయం నర్సింహారావు, ఆదివాసీ మెడికల్ అసోసియేషన్ నాయకులు కృష్ణయ్య, ఆదివాసీ జాక్ అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి సాంబమూర్తి, ఆదివాసీ యువత పాల్గొన్నారు.

ములకలపల్లి : ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ నాయకులు డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ఆదివాసీ జెండాను ఆవిష్కరించి కొమరం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సీనియర్ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘ జేఏసీ రాష్ట్ర నాయకులు కోండ్రు సుందర్రావు, మిడియం బుల్లబ్బాయి, మడకం చిరునవ్వు, గడ్డం ఉదయ్, మెచ్చా నాగేశ్వరరావు, కీసరి రమేష్, ఊరబెద్ది వెంకన్న, శేషగిరి, మాజీ ఎంపీపీ మట్ల నాగమణి, కుంజా రాజులు, నారాయణ, ఆదివాసీ సంఘం ఉపాధ్యాయులు పూనె పూర్ణ, కారం సురేష్, మాజీ సర్పంచ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత ఆదివాసీ జెండాను సీనియర్ నాయకులు పొడియం వెంకటేశ్వర్లుతో కలిసి ఆవిష్కరించి అనంతరం మహనీయులకు నివాళు లర్పించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పులి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్లు గొగ్గల ఆదినారాయణ, గడ్డం వెంకటేశ్వర్లు, పులి వెంకటేశ్వర్లు, కొండ్రు రాఘవయ్య, కొండ్రు గంగరాజు, రావుల నాగేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- డీఎంఅండ్‌హెచ్ఓ మాలతి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే దోమల నివారణకు పరిష్కార మార్గమని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి మాలతి అన్నారు. శుక్రవరం పాతర్లపాడు, జల్లేపల్లి గ్రామపంచాయతీలో ఆమె పర్యటించారు. గ్రామాలలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ, ఏఎన్ఎమ్‌లు, ఆశ వర్కర్లతో కలిసి వార్డుల్లో తిరిగారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ప్లాస్టిక్ డబ్బాలు, పాత టైర్లు, వాడి పారేసిన కొబ్బరి బోండాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఒకసారి డెంగీ వ్యాధి వస్తే లక్షల్లో ఖర్చు చేసుకోవడమే కాకుండా కొన్నిసార్లు ప్రాణాలకే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. నిల్వ నీటిలోనే దోమలు గుడ్లు పెట్టి లార్వా ద్వారా డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతకరమైన వ్యాధులకు కారణమైన దోమలు వృద్ధి చెందుతాయని ప్రజలకు వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధుల నుంచి తమను తాము కాపాడుకోవచ్చని, అందుకే ప్రభుత్వం ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడేను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షేక్ సిలార్, ఎంపీఓ సూర్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి విజయనిర్మల, మండల వైద్యాధికారులు డా. అలివేలు, ఏఎన్ఎం సీతా, పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కొమరం భీమ్ విగ్రహానికి మట్టా నివాళి

నవతెలంగాణ-పెనుబల్లి

ఆదివాసి హక్కుల సాధనకై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కొమరం భీం అని సత్తుపల్లి ఎమ్మెల్యే సలహాదారులు మట్టా దయానంద్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న కొమరం భీమ్ విగ్రహానికి మట్టా దయానంద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ నాయకులు తెల్లం సురేష్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, సంఘం నాయకులు పద్దం తిరుపతిరావు, కుంజ నాగేంద్రబాబు, పదం శివ, కొరస బుచ్చాలు, కొరస గంగాధర్, కాక రుద్ర జారాణి, కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు, మల్లం పుల్లారావు గోగినేని రమేష్, బొర్రా కోటేశ్వరరావు, వంగ దామోదర్ పాల్గొన్నారు.

కామేపల్లి : మండల పరిధిలోని ఓటవాగు ప్రాంతంలో నివసిస్తున్న ఆ దేవసేల్ల కాలనీలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆదివాసీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి దినోత్సవ జెండాను ఎగరవేసి కొమరమ్ భీమ్ చిత్రపటానికి ఆదివాసీల సంఘం రాష్ట్ర నాయకులు, కెప్టెన్ బంజర మాజీ సర్పంచ్ ఆరెం రవి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మాజీ ఎంపిటిసి గుగులోతు గబ్రూ నాయక్, కాలసాని వెంకట భిక్షం శేఖర్ సమ్మయ్య సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు పారితోషకంతో సరి

- ఆరోగ్య వ్యవస్థలో ఆశాలు కీలకపాత్ర
- ప్రభుత్వం కనీస వేతనం అమలు పరచాలని వినతి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

2005వ సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌లో భాగంగా సమాజానికి ఆరోగ్య వ్యవస్థకు మధ్య వారధిగా పనిచేయడానికి ప్రభుత్వం ఆశా వర్కర్లను ప్రవేశపెట్టింది, ప్రధానంగా ఆశాలు అత్యంత ప్రజానీకానికి ఆరోగ్య సంబంధిత సూచనలు సలహాలు అందించడంలో వెన్నుముకగా పనిచేస్తున్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు పారితోషకం తోటే ప్రభుత్వం సరిపెడుతుందని ఆశా కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి సాహిత్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ



సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 18వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతినెల 5వ తారీఖున వేతనాలు చెల్లించాలని, జూలై 30న హెల్త్ కమిషనర్ హామీలను వెంటనే అమలు పరచాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు సుధా, ఉష, విజయ, ఏ.సుమని, సుజాత, మరియమ్మ, ధనలక్ష్మి, బేతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛదనం

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల తరగతిగదులతోపాటు, ఆవరణము శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. పచ్చని చెట్లతో కళాశాల ఆవరణం ఆకర్షణయంగా ఉండేందుకు అందరూ కృషి చేశారని ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వాల్మీకి కిషోర్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మోదుగు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన పాడి రైతులు

- పాలడబ్బాలతో జాతీయ రహదారిపై ఆందోళన

3నెలలుగా బిల్లుల బకాయిలు



నవతెలంగాణ - స్టేషన్ ఘనపూర్

పాల బిల్లుల చెల్లింపు విషయంలో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ విజయ పాడి రైతులు రోడ్డెక్కారు. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలో ప్రధాన జాతీయ రహదారిపై పాలడబ్బాలతో శుక్రవారం పెద్దఎత్తున నిరసన చేపట్టారు. సుమారు మూడు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నియోజక వర్గ పరిధి చిల్పూరు మండలం క్రిష్టాజీగూడెం సొసైటీ అధ్యక్షులు సాదం రమేష్ మాట్లాడారు. పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు మూడు నెలల బిల్లుల బకాయిలు ఉన్నాయని తెలిపారు. 15 రోజులకు చెల్లించే పాల బిల్లు ఐదు విడుతలు (75 రోజులుగా) పెండింగ్‌లో ఉండిపోయాయని, ఈనెల 30వ తేదీ దాటితే మరో విడుత పెండింగ్ అవుతుందని తెలిపారు. ఇన్ని రోజులుగా డబ్బులు ఇవ్వకుండా ఉంటే తాము బతుకులెట్లా అని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో దాణా కొనుగోలు, ఇతర ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించే వరకూ ధర్నాను విరమించేది లేదని జాతీయ రహదారిపై బైటాయించారు. 15రోజుల్లో పెండింగ్ పాల బిల్లులు విడుదల చేయకపోతే పాడి రైతులందరినీ ఏకంచేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు మునిగెల వెంకన్న, నక్క ప్రశాంత్, గోనెల నాగరాజు, వీర్ల రాజయ్య లక్ష్మణ్ రెడ్డి, అట్ల అంజిరెడ్డి, కోల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి'కట్టలు

మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

- రూ.2.93 కోట్ల నగదు..
- మొత్తం రూ.6.07 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు
- నగదు నిల్వలతో షాకైన అధికారులు
- ఏకకాలంలో నాలుగుచోట్ల సోదాలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి రెవెన్యూ ఆఫీసర్ నరేందర్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున జరిపిన ఈ తనిఖీల్లో ఆయన ఇంట్లో రూ.2.93కోట్ల నగదు నిల్వలు చూసి ఏసీబీ అధికారులు షాకయ్యారు. కట్టలుగా నగదు ఉండటంతో వాటిని లెక్కించడానికి అప్పటికప్పుడు కౌంటింగ్ మిషన్లను తెప్పించారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏండ్లుగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి రెవెన్యూ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దాసరి నరేందర్‌కు ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు ఫిర్యాదులు అందడంతో నిజామాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులు అతని ఇంట్లో దాడులు నిర్వహించారు. దాంతోపాటు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, కోటగల్లి, నిర్మల్‌లోని బంధువుల ఇండ్లలోనూ సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో రూ.6.07 కోట్ల విలువ చేసే అక్రమాస్తులున్నట్టు అధికారులు గుర్తించారు. నరేందర్ ఇంట్లో గుర్తించిన రూ.2.93 కోట్ల నగదుతో పాటు అతని భార్య బ్యాంకు అకౌంట్‌లో రూ.1.10 కోట్లు, అర కిలోకు పైగా బంగారు ఆభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 1.98 కోట్ల విలువ చేసే 17 స్థిరాస్తులను గుర్తించినట్టు ఏసీబీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. అనంతరం నరేందర్‌ను విచారించేందుకు కస్టడీలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఈ స్థాయిలో అక్రమాస్తులతో ఉద్యోగి పట్టుబడటం ఇదే మొదటిసారి కావడం చర్చనీయాంశంగా మారింది.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రీమీలేయర్ వర్తించదు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘావాల్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ, ఇతర ఎంపీలు పాల్గొన్నారు. కాగా, ఈ విషయాన్ని ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో మంత్రి మేఘావాల్ కూడా వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీల్లో క్రీమీలేయర్ అనేది సుప్రీంకోర్టు న్యాయ మూర్తుల పరిశీలన మాత్రమేనని, ఈ విషయంలో ప్రజల్ని ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టించవద్దని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టులే ముందంజ

సీపీఐ(ఎం) జిల్లా నాయకులు బండి రమేష్



నవతెలంగాణ-ముదిగొండ

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కమ్యూనిస్టులు ముందుంటారని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ అన్నారు. మండల పరిధిలో చిరుమర్రి గ్రామంలో మాజీ ఎంపీటీసీ కోలేటి అరుణ పదవి విరమణ సన్మాన సభ శుక్రవారం రాత్రి సిపిఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి సామినేని రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 40 కోట్ల పెట్టుబడిదారుల సమాజంలో సుఖం ఉంటుందని, కష్టనష్టాలతో ఉండేదే కమ్యూనిస్టు సమాజమన్నారు. ఐదు నెలలు అమెరికాలో ఉన్న కమ్యూనిస్టు భావజాలం తగ్గలేదన్నారు. చికాకు నగరాన్ని సందర్శించి ఎర్రజెండా గద్దను చూసి మరింత ఉత్సాహం వచ్చిందన్నారు. కోలేటి అరుణ ఐదు సంవత్సరాల ఎంపీటీసీ పదవి కాలంలో ప్రజా సమస్యల కోసం కృషి చేసిందన్నారు.ఎంపీపీగా హరిప్రసాద్ సిపిఐ(ఎం) బలపరచిందని ఆనాటి నుండి నేటివరకు ఐదేళ్ల కాలంలో హరి ప్రసాద్ నిరంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. వైస్ ఎంపీపీగా మంకెన దామోదర్ ప్రజల కోసం పనిచేశారన్నారు.మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ మాట్లాడుతూ సిపిఐ(ఎం) పార్టీ సహకారంతోనే తన ఎంపీపీగా ఐదేళ్ల పదవిలో ఉన్నానని చెప్పారు. రాష్ట్రంలో ఐదు అంచల వ్యవస్థను రద్దు చేసి,మూడంచల వ్యవస్థను ప్రవేశపెట్టాలన్నారు. మహిళా సమస్యలపై హైదరాబాదు,ఢిల్లీలో జరిగిన ఆందోళనలో పాల్గొని ఎంపీటీసీ అరుణ తన వంతు పాత్ర పోషించిందని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అన్నారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తామని మాజీ ఎంపీటీసీ కోలేటి అరుణ చెప్పారు. అనంతరం మాజీ ఎంపిటిసి కోలేటి అరుణతోపాటు, ఎంపీపీ సామినేని హరిప్రసాద్,గ్రామ మాజీ ఉప సర్పంచ్,వార్డు మెంబర్లకు బొకేలు అందించి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం)మండల నాయకులు కోలేటి ఉపేందర్, టిఎస్.కళ్యాణ్ వేల్పుల భద్రయ్య, వంద్రకోల రాంబాబు, మందరపు వెంకన్న, కందుల భాస్కరరావు, పద్మ, సొసైటీ డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు, గ్రామ నాయకులు నెమిలి సైదులు, బండి శేఖర్, గాలి శ్రీనివాసరావు, ఉన్నం కోటేశ్వరరావు, చావగాని మాధవరావు, సామినేని రాంబాబు, మోర రామకృష్ణ, వినుకొండ రాణి, హైస్కూల్ హెచ్‌ఎం ఎన్వికె ప్రసాద్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సామినేని నాగేశ్వరరావు, ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, చిరుమర్రి, వెంకటాపురం, గ్రామపెద్దలు, సిపిఐ(ఎం)కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'డిండి'ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

ఇప్పటికే చాలా ఆలస్యం.. ఇక ఊరుకునేది లేదు

నిర్లక్ష్యం చేస్తే ప్రజా పోరాటాలకు సిద్ధం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ జిల్లా కేంద్రంలో సదస్సు



నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ఆమోదించకుండా కావాలనే గత ప్రభుత్వం ఎనిమిదేండ్లుగా పెండింగ్‌లో పెట్టిందని, ఈ ప్రభుత్వమైనా యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టును పూర్తి చేయాలని సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను వెంటనే ఆమోదింప జేయాలని, నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని పెద్ద గడియారం చౌరస్తాలో సదస్సు ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జూలకంటి మాట్లాడారు. 2015లో పథకం ప్రారంభమైతే నేటి వరకు కనీసం డీపీఆర్‌ను ఆమోదించలేదని, పర్యావరణ అనుమతులు కూడా తీసుకోలేదని అన్నారు. 27 కిలోమీటర్ల టన్నెల్ తవ్వాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఎటువంటి ప్రతిపాదనా కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, జిల్లాలోని ఇద్దరు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్టు చెప్పారు. వారంతా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు 400 నుంచి 500 గ్రామాలకు తాగు నీరు, 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వాల్సి ఉందని, జిల్లాకు ప్రాణం వంటిదని అన్నారు. నాలుగు నియోజకవర్గాల రైతాంగానికి ఉపయోగపడే ప్రాజెక్టు విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఊరుకునే ప్రసక్తే లేదని, పెద్దఎత్తున ప్రజా ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రిటైర్డ్ ఇంజినీర్ ఇంద్రసేనారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. డిండి ఎత్తిపోతల పథకంపై ప్రజలను చైతన్య పరుస్తూ ప్రభుత్వానికి హెచ్చరిక చేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే ఎస్ఎల్‌బీసీ, మూసీ ప్రాజెక్టులను సందర్శించామని తెలిపారు. మూసీ ప్రాజెక్టు కాలువలు పూడుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని, వెంటనే మరమ్మతులు చేపట్టి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఫ్లోరైడ్ సమస్యలు పరిష్కారం కావాలంటే డిండి ఎత్తిపోతల పథకం అమల్లోకి రావాలని, సత్వరమే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సింగరాయపల్లి, గొట్టముక్కల, చింతపల్లి, శివన్నగూడెం తదితర ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. నాగార్జునసాగర్ ఎస్ఎల్బీసీ, డిండి ప్రాజెక్టులు అందుబాటులోకొస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. ఆరు నెలల్లోపు డీపీఆర్ ఫైనల్ చేసి.. ప్రాజెక్టు పూర్తిస్థాయి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, జిల్లా నాయకులు నారి ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, సిహెచ్.లక్ష్మినారాయణ, దోనూరు నర్సిరెడ్డి, దొడ యాదిరెడ్డి, మహ్మద్ సలీం, కంబాలపల్లి ఆనంద్, నల్లా వెంకటయ్య, నాంపల్లి చంద్రమౌళి, కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, అవిశెట్టి శంకరయ్య, జిట్ట నగేష్ పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ విషయంలో.. రైతాంగాన్ని మోసం చేస్తున్న ప్రభుత్వం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని



పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘం

నవతెలంగాణ-అశ్వాపురం

సీతారామ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే ప్రారంభం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి పంచాయతీలోని కుమ్మరిగూడెం, బీజీ కొత్తూరు గ్రామాల వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులను శుక్రవారం రైతు సంఘం రాష్ట్ర బృందం పరిశీలించింది. అనంతరం విలేకర్లతో కాసాని మాట్లాడారు. కుమ్మరిగూడెం వద్దనున్న గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయలేదని ఆరోపించారు. ప్రజల చిరకాల వాంఛ అయిన సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా ప్రజలతో చెలగాటమాడు తుందని అన్నారు. ఈ ప్రాజెక్టు గోదావరి బ్యాక్ వాటర్‌ను నిల్వచేసేందుకు నిర్మించిన ఈ ప్రాజెక్టు పనులు ఇంకా పూర్తి కాలేదని, లాక్‌లు ఏర్పాటు చేయలేదని అన్నారు. కేవలం వర్షపు నీటి ఆధారంగా రెండో పంప్ హౌస్ వద్ద 15వ తేదీన ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభోత్సవానికి ప్రభుత్వం సిద్ధపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు కింద మూడున్నర లక్షల ఎకరాలు సాగులోకి రావాల్సి ఉండగా నేడు 40 నుంచి 50 వేల ఎకరాలు మాత్రమే పరిమితం చేశారన్నారు. జిల్లాలోని 8 మండలాల నుంచి ప్రాజెక్టు కాలువలు ప్రవహిస్తున్నా ఈ జిల్లా భూభాగానికి నీరు రాకపోవడం దారుణమని తెలిపారు. జిల్లా మంత్రి అయిన తుమ్మల నాగేశ్వరరావు ఆయన వ్యక్తిగత స్వార్థంతో జిల్లా ప్రజలకు ద్రోహం చేసి ఇతర ప్రాంతాలకు నీటిని తరలించడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. భద్రాద్రి జిల్లాకి జరుగుతున్న సాగునీటి వనరుల అన్యాయంపై జిల్లా రైతాంగం ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి సీతారామ ప్రాజెక్టు లాకులు ఏర్పాటు చేసి ఈ జిల్లాలో మూడున్నర లక్షల ఎకరాలకి సాగునీరు అందించిన తర్వాతనే మిగిలిన జలాలను ఇతర ప్రాంతాలకు తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతాంగాన్ని సమీకరించి నీటి విడుదలను అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎలమంచి వంశీకృష్ణ, అన్నవరపు సత్య నారాయణ, సహాయ కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, సాంబశివరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించం

(మొదటిపేజీ తరువాయి)

పలికారు. అక్కడే ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. గిరిజన యోధులైన కొమరం భీం, రాంజీ గోండు విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. తొలితరం స్వాతంత్ర సమరయోధుడు, ఆదివాసీల ఆరాధ్యుడు రాంజీ గోండు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. నీట్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు. క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శిస్తున్న విద్యార్థులను సత్కరించారు. ఆదివాసీ ఫుడ్స్ పేరుతో వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులను సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది బడ్జెట్‌లో ఎస్టీల సంక్షేమం కోసం రూ.17వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామని చెప్పారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా వారికి కేటాయించిన నిధులను వారి అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీ గూడేలకు అభివృద్ధి ఫలాలు అందిన ప్పుడే సమాజం పురోగమిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఆదివాసీ గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎక్కడో కొండా కోనల్లో, వాగులు, వంకల వద్ద నివసించే ఆదివాసులు హైదరాబాద్ వంటి నగరాల్లో తమ హక్కులపై చర్చించే స్థాయికి ఎదగడం అభినందనీయమని సీతక్క ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తమ అభివృద్ధిని నిర్దేశించుకునేలా ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. అయితే గిరిజనులు, ఆదివాసీలు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసినప్పటికీ...ఆ జాతులు అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా కులాలు, జాతుల పేర అణగారిన వర్గాలపై అణచివేత కొనసాగిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం అవసరమైన ప్రణాళికల ను మేధావులు, ఉన్నతాధికారులు రచిస్తే అమలు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎస్టీల అభ్యున్నతికి అవసరమైన నిధులను కేటాయిస్తామన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా.. అధికారులు, మేధావులు, ప్రభుత్వం కలిసి పనిచేస్తే సమానత్వం సాధ్యమవుతుందని చెప్పారు. ఆదివాసీ ప్రాంతాల్లో విద్యా, వైద్యం, ఉపాధి, రవాణా, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను అందించే విధంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ పరిపాలనా తీరు వల్ల ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయాయని సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏ పరిధిలో అమల్లో ఉన్న జీవో నెంబర్ 3 ను గత ప్రభుత్వం రద్దు చేసిన కారణంగా.. స్థానిక గిరిజనులు ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని గుర్తు చేశారు. ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్లు ఇచ్చినా కోర్టు కేసుల్లో అవి నలిగిపోయా యన్నారు. బడ్జెట్‌లో గత ప్రభుత్వం వేల కోట్లు కేటాయించినా.. నిధులను పక్కదారి పట్టించి ఆదివాసీలకు తీరని అన్యాయం చేసిందని తెలిపారు. అందుకే గిరిజనులు, ఆదివాసీలను అభివృద్ధిపథంలో నిలిపేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. బడ్జెట్‌లో కేటాయించిన ప్రతి రూపా యినీ ఏజెన్సీ ప్రాంతాలు, గిరిజన గ్రామాలకు వెచ్చించి ఆదిమ జాతి ప్రజల అభివృద్ధికి తోడ్పాటునిస్తామని చెప్పారు.

మూడో సారి గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని సవరించి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. గ్రామసభల అనుమతులు లేకుండానే ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో యథేచ్ఛగా మైనింగ్ చేసేలా కేంద్రం చట్ట సవరణ చేయడాన్ని మంత్రి తప్పుబట్టారు. ఢిల్లీలో అనుమతి తీసుకుంటే చాలు.. గ్రామ పంచాయతీ అనుమతుల్లేకుండా అటవీ ప్రాంతాల్లో మైనింగ్ విధ్వంసం జరగొచ్చున్న విధంగా కేంద్రం చర్యలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాల్లో మైనింగ్‌కి విచ్చలవిడిగా అనుమతిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. అడవిలో ఉన్న గ్రామాలకు రోడ్లు వేసేందుకు ఎందుకు అనుమతులివ్వడం లేదని ప్రశ్నించారు. కొన్ని కార్పొరేట్ కంపెనీలకు సంపద కట్టబెట్టేందుకు వీలుగా మోడీ సర్కార్ మైనింగ్ అనుమతులను ఇష్టారాజ్యంగా ఇస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్ తరాలకు వినాశకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రయత్నాలను అడ్డుకునేందుకు అంతా కలిసి కట్టుగా పోరాటం చేయాల్సిన అవసరముంద న్నారు. ఆదివాసుల మూలంగానే అడవులు మిగులుతున్నాయని చెప్పారు. అడవులను కాపాడుతున్న ఆదివాసీ బిడ్డలపై తప్పుడు ప్రచారాం మానుకో వాలని హితవు పలికారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఆది వాసీల అభివృద్ధికి నిరంతరం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు.

కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, కాంగ్రెస్ ఎమ్మెల్యే మురళి నాయక్, ట్రైకార్ చైర్మెన్ బెల్లయ్య నాయక్, ఆదిలాబాద్ పార్ల మెంటు ఇంచార్జ్ ఆత్రం సుగుణ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ శరత్, గురుకులాల కార్యదర్శి కె. సీతాలక్ష్మీ, ఇతర ఉన్నతాధికారులు, మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ పురోహితులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళ ప్రసవ వేదన

ఆదివాసీ మహిళలకు నేటికీ ప్రసవ వేదన తప్పడం లేదు. సరైన రోడ్లు, రవాణా సౌకర్యం లేక ప్రసవానికి అవస్థలు పడుతూనే ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజే ఓ తల్లికి గర్భశోకం మిగిలింది. శుక్రవారం కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో గర్భిణీకి పురిటి నొప్పులు రాగా సరైన రవాణా సౌకర్యం లేక ఆలస్యం అవ్వడంతో అంబులెన్స్ వద్దకు రాగానే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అంతలోనే ఆ శిశువు మృతిచెందింది. కడుపులో ఉన్న మరో బిడ్డ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు.

కాలి నడకన వాగు దాటి ప్రసవం

- ఆస్పత్రికెళ్లేసరికే పుట్టిన ఆడ శిశువు మృతి
- కడుపులో మరో శిశువు పరిస్థితి విషమం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని టిమ్రన్ మోవాడ్ బండగూడకు చెందిన ఆదివాసీ మహిళ ఆత్రం ధర్మబాయికి 7వ నెలలోనే నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబీకులు 108కి ఫోన్ చేశారు. గ్రామానికి రావాలంటే మధ్యలో ఉన్న వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో 108 వాహనం వాగు వరకు వచ్చి ఆగింది. దీంతో గర్భిణీ గ్రామం నుంచి 1.5 కిలోమీటర్ నడుచుకుంటూ వచ్చి వాగు దాటింది. ఈ సమయంలో వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొంత భయానికి గురైన మహిళకు అంబులెన్స్ ఎక్కే సమయంలో నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే సిబ్బంది అప్రమత్తమై డెలివరీ చేశారు. ఆడబిడ్డ పుట్టింది. కానీ, మరో శిశువు కడుపులో ఉందని గమనించి వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చేసరికి పుట్టిన శిశువు మరణించడం, కడుపులో ఉన్న శిశువు పరిస్థితి కూడా కొంత విషమంగా ఉండటంతో వైద్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. ఓ వైపు పుట్టిన బిడ్డ చనిపోవడం.. మరో వైపు కడుపులో ఉన్న బిడ్డ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆ తల్లి కన్నీరుమున్నీరైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మించి తమ కష్టాలు తీర్చాలని ఆదివాసీ గ్రామ ప్రజలు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందిస్తారో లేదో చూడాలి.

పెద్దాపూర్ గురుకులంలో మరో విద్యార్థి మృతి

పక్షం రోజుల్లో రెండు మరణాలు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు విద్యార్థులు
- సిబ్బంది నిర్లక్ష్యంపై కోరుట్ల ఎమ్మెల్యే ఆగ్రహం
- పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వవిప్ లక్ష్మణ్‌కుమార్



నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న మోక్షిత్



అనిరుధ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

నవతెలంగాణ-మెట్‌పల్లి

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం మరో విద్యార్థి మృతి చెందాడు. జులై 26న కూడా ఓ విద్యార్థి చనిపోయాడు. ఆ ఘటనను మరువకముందే అస్వస్థతతో మరో విద్యార్థి మృతి చెందడం కలకలం రేపుతోంది. వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. తోటి విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన అడ్మాల కృష్ణారెడ్డి -ప్రియాంక దంపతుల కొడుకు అడ్మాల అనిరుధ్ (11) గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి భోజనం అనంతరం విద్యార్థులందరూ పడుకోగా.. అర్ధరాత్రి 12 గంటల తరువాత అనిరుధ్ కడుపులో నొప్పిగా ఉందని ఏడుస్తూనే తోటి మిత్రులకు చెప్పాడు. ఉదయం 5గంటల సమయంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అందరినీ నిద్రలేపారు. కానీ, అనిరుధ్ కడుపులో బాగా నొప్పిగా ఉందంటూ ఏడవడంతో కేర్ టేకర్ మదనయ్య వెంటనే కోరుట్ల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకొని విగతజీవిగా ఉన్న కొడుకును చూసి బోరున విలపించారు. తమ కొడుక్కు ఎలాంటి అనారోగ్య సమస్యలూ లేవని తల్లిదండ్రులు, బంధువులు తెలిపారు. కాగా, అస్వస్థతకు గురైన అదే తరగతికి చెందిన మరో ఇద్దరు విద్యార్థులు మల్యాల మండలం తక్కల్లపల్లికి చెందిన హేమంత్, మెట్‌పల్లి మండలం ఆత్మకూరుకు చెందిన మొండి మోక్షిత్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి మెట్‌పల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మోక్షిత్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెట్‌పల్లి ఆర్డీఓ శ్రీనివాస్ పాఠశాలలోనే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

పిల్లలను ఇంటికి తీసుకెళుతున్న తల్లిదండ్రులు



గురుకుల పాఠశాలలో వరుస ఘటనలతో భయాందోళనకు గురైన తల్లిదండ్రులు విద్యార్థులను ఇంటికి తీసుకెళ్తున్నారు. అధికారులు ప్రత్యేక సెలవులు ఇచ్చి.. పాఠశాలలో సమస్యలను పరిష్కరించి, విద్యార్థుల మృతికి కారణాలు తెలుసుకొని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకుని భరోసా ఇస్తేనే తిరిగి పాఠశాలకు పంపిస్తామని తల్లిదండ్రులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ పాఠశాలను సందర్శించి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, తల్లిదండ్రుల అనుమానాలను నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సిబ్బంది నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాఠశాలను సందర్శించి ఘటనపై ఆరా తీశారు. విద్యార్థి మృతిపై సిబ్బంది నిర్లక్ష్య సమాధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందికి పాఠశాలలో జరిగిన విషయం తెలియకపోవడం పట్ల ఎమ్మెల్యే విస్మయం వ్యక్తం చేశారు. విద్యార్థులు చనిపోతున్నా సిబ్బంది తీరులో మార్పు రాలేదన్నారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు.

ఈరోజుల్లో భార్యా, భర్త ఇద్దరూ ఉద్యోగం చేస్తేనే ఇల్లు గడిచేది. ఇద్దరూ కలిసి సంపాదించినప్పుడు ఇద్దరూ కలిసి ఖర్చుపెట్టడం కూడా తెలిసుండాలి. లేకపోతే ఒకరి డబ్బులు ఇంటి కోసం ఖర్చు పెట్టి మరొకరివి సేవింగ్ చేసుకోవాలి. అప్పుడే వారి సంసారం హాయిగా సాగిపోతుంది. భవిష్యత్తులో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు రాకుండా జాగ్రత్తపడొచ్చు. అంతేగానీ సంపాదించింది ఎవరి ఖర్చు వాళ్లు చేసుకుంటే ఉపయోగం వుండదు. అలాంటి ఓ సమస్యతోనే ఐద్వా అదాలత్‌కు వచ్చింది పద్మ. మరి ఆమె సమస్య పరిష్కారం అయ్యిందో లేదో మీరే చదవండి...

డిన్నర్ ఆలస్యమైతే?

రాత్రి 9:00 గంటల తర్వాత డిన్నర్ చేస్తే.. ఆరోగ్యానికి హాని కలుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. నిద్రకు, భోజనానికి మధ్యలో కనీసం రెండు గంటల గ్యాప్ ఉండటం చాలా ముఖ్యం. భోజనం తిన్నవెంటనే నిద్రపోతే.. ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. అందుకే సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల మధ్యలో డిన్నర్ పూర్తి చేయాలని నిపుణులు చెబుతున్నారు.

జీర్ణక్రియ సమస్యలు...

రాత్రిపూట మన ఆహార అలవాట్లు.. జీర్ణక్రియపై ఎఫెక్ట్ చూపుతాయి. రాత్రి పూట ఆలస్యంగా భోజనం చేస్తే.. డైరెక్ట్‌గా వెళ్లి



పడుకుంటాం. భోజనం చేసిన తర్వాత ఎలాంటి యాక్టివిటీ ఉండదు. దీని వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. ఎసిడిటీ, కడుపు ఉబ్బరం, గ్యాస్ట్రిక్, ఇతర జీర్ణవ్యవస్థ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

బరువు పెరుగుతారు..

రాత్రిపూట భోజనం ఆలస్యంగా చేస్తే.. బరువు పెరిగే అవకాశం ఉంది. సమయానికి ఆహారం తీసుకోకపోవడం వల్ల.. శరీరంలో జీవక్రియ మందగిస్తుంది. జీవక్రియ నెమ్మదిగా ఉంటే.. కేలరీలు సరిగ్గా బర్న్ కావు, శరీరంలో ఫ్యాట్ పెరగడం ప్రారంభమవుతుంది.


బీపీ పెరుగుతుంది..

రాత్రి ఆలస్యంగా తినడం వల్ల బీపీ, డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. రాత్రి డిన్నర్ ఆలస్యంగా తింటే.. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయి. రక్తంలో కొవ్వును పెంచుతుంది. దీంతో గుండె జబ్బుల ప్రమాదం మరింతగా పెరుగుతుంది.

నిద్రలేమి సమస్య..

రాత్రిపూట నిద్రసరిగ్గా రావడం లేదని.. చాలా మంది కంప్లైంట్ చేస్తూ ఉంటారు. దీనికి ప్రధాన కారణం.. రాత్రిపూట ఆలస్యంగా తినడం. డిన్నర్ లేట్‌గా తింటే.. ఆహారం సరిగ్గా జీర్ణం కాక నిద్ర కూడా సరిగా పట్టదు.

కలిసి నిర్ణయించుకోండి



పద్మకు 28 ఏండ్లు ఉంటాయి. భర్త సుధాకర్. వీరి పెండ్లి జరిగి రెండేండ్లు అవుతుంది. ఇంకా పిల్లలు లేరు. ఇద్దరూ ఉద్యోగస్తులు. తల్లిదండ్రులు ఊరిలో ఉంటారు. వీరు ఉద్యోగరీత్యా సిటీలో ఉంటున్నారు. సుధాకర్ ప్రవర్తన పద్మకు విచిత్రంగా అనిపించేది. ఎందుకంటే 'ఇంట్లో ఇద్దరూ కలిసి ఉంటున్నాం కాబట్టి ఇంటి కిరాయి ఇద్దరం కలిసి చెరిసగం కట్టాలి' అంటాడు. సరుకులు మాత్రం తీసుకొస్తాడు. కానీ పద్మను మాత్రం 'నువ్వు నా కంటే ఎక్కువ తింటున్నావు, సరుకులు మధ్యలో అయిపోతే నువ్వే తీసుకురావాలి' అంటాడు. ఇంటికి ఎవరైనా చుట్టాలు వస్తే 'ఇక ఎప్పుడు పోతారు' అని అడుగుతాడు. సుధాకర్ తల్లిదండ్రులు వచ్చినా పరిస్థితి అంతే. ఇంట్లో బియ్యం, సరుకులు అయిపోతున్నాయి, మీరు ఊరికి వెళ్ళిపోండి' అని పంపించేస్తాడు.

కన్న తల్లిదండ్రులనే ఇలా పంపించేస్తే ఇక తన తల్లిదండ్రులు వచ్చి ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో అని పద్మ ఆందోళన చెందేది. ఇద్దరూ కలిసి ఎక్కడికైనా సరదాగా వెళ్లినా 'నీ డబ్బు నువ్వు ఖర్చు చేసుకో, నావి నేను చూసుకుంటాను' అంటాడు. సినిమాకు వెళ్లినా సుధాకర్ టికెట్ తీసుకుంటే కూల్‌డ్రింక్స్ పద్మ తీసుకురావాలి. పోనీ 'మొత్తం ఖర్చు నేనే పెట్టుకుంటాను' అని పద్మ అన్నా ఆమె మాట వినడు. ఒక రోజు ఇద్దరూ కలిసి హెూటల్‌కు వెళ్లారు. అక్కడ సుధాకర్ కంటే పద్మ అదనంగా చికెన్ తెప్పించుకుంది. దాంతో 'దానికి బిల్లు నేను కట్టను' అని అక్కడి నుండి వెళ్లిపోతాడు. ఇలా తన పిసినారి భర్త వింత ప్రవర్తనను భరించలేక పోయింది పద్మ. రేపు పిల్లలు పుడితే పరిస్థితి ఎలా ఉంటుందో అనే భయంతో పిల్లలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది.

ఇలాంటి పరిస్థితుల్లోనే ఆమె ఐద్వా అదాలత్‌కు వచ్చి తన సమస్య చెబుతూ 'ఇంటి ఖర్చులు, కిరాయి, ఎవరైనా బంధువులు వచ్చినా, ఏదైనా ఫంక్షన్‌కి వెళ్ళినా, ఎప్పుడైనా బయటకు వెళ్లాల్సి వచ్చినా ఆ ఖర్చులన్నీ నేను చూసుకుంటాను. సుధాకర్‌కు వచ్చే జీతం మొత్తం సేవింగ్స్ చేద్దాం అంటే అతను ఒప్పుకోవడం లేదు. పోనీ నా జీతం అయినా సేవింగ్స్ చేసి సుధాకర్ డబ్బులు ఖర్చు పెడదామంటే దానికీ ఒప్పుకోడు. ఇలాంటి పరిస్థితుల్లో అతనితో బయటకు వెళ్లాలన్నా భయంగా ఉంది. 'నీ డబ్బులు నువ్వే ఇవ్వు' అని ఆయన అన్నప్పుడు అక్కడ పని చేసే వాళ్లు నావైపు విచిత్రంగా చూస్తున్నారు. నాకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఇలాంటి పద్ధతి సరైనది కాదని ఆయనతో ఎలాగైనా మీరే మాట్లాడి నా సంసారాన్ని నిలబెట్టండి' అంటూ బాధగా చెప్పింది.

> **'నువ్వు నా కంటే ఎక్కువ తింటున్నావు, సరుకులు మధ్యలో అయిపోతే నువ్వే తీసుకురావాలి' అంటాడు. ఇంటికి ఎవరైనా చుట్టాలు వస్తే 'ఇక ఎప్పుడు పోతారు' అని అడుగుతాడు. సుధాకర్ తల్లిదండ్రులు వచ్చినా పరిస్థితి అంతే. ఇంట్లో బియ్యం, సరుకులు అయిపోతున్నాయి, మీరు ఊరికి వెళ్ళిపోండి' అని పంపించేస్తాడు.**

సుధాకర్‌ను పిలిచి మాట్లాడితే 'ఆమె ఉద్యోగం చేస్తుంది కాబట్టి అన్ని ఖర్చుల్లో సగం పెట్టుకొమ్మని చెబుతున్నాను. అందులో తప్పేముంది. ఇద్దరు స్నేహితులు కలిసి బయటకు వెళ్ళినపుడు ఇద్దరూ కలిసి ఖర్చు చేస్తారు. అలాంటిది మేమిద్దరం కలిసి జీవితాంతం జీవించాలి అనుకుంటున్నాం. అలాంటప్పుడు సగం ఖర్చులు ఆమె పెట్టుకుంటే తప్పేముంది. ఇంట్లో ఇద్దరం ఉంటున్నాం కనుక ఇద్దరం కిరాయి కట్టాలి. అసలు ఇందులో తప్పేముందో నాకేం అర్థం కావట్లేదు' అంటూ వాదించాడు.

దానికి మేము 'మీరిద్దరూ స్నేహితులు కాదు, భార్యాభర్తలు. ముందు అది గుర్తించండి. స్నేహితులు వేరూ భార్యాభర్తలు వేరూ. స్నేహితులు ఈరోజు ఉంటే రోజు మీతో ఉండకపోవచ్చు. కానీ మీ భార్య మీతో జీవితాంతం కలిసి బతకాలి. రేపు మీకు పిల్లలు పుడతారు. అప్పుడు ఆమె కొన్ని రోజులు ఉద్యోగం చేయలేకపోవచ్చు. అప్పుడు మరి పిల్లల ఖర్చులు ఎలా పంచుకుంటారు. మీ ఆలోచన సరైనది కాదు. మీరు దీన్ని జాగ్రత్తా అనుకుంటున్నారు. కానీ మీ ప్రవర్తనతో మీరు మీ జీవితంలో చాలా నష్టపోతున్నారు. సరుకులు అయిపోతున్నాయని కన్న తల్లిదండ్రులను కూడా ఇంటికి రానియ్యకుండా ఆపేస్తున్నారు. ఇదంతా మీకు మంచిది కాదు. మీరు ఇలాగే ప్రవర్తిస్తే పద్మ మీతో జీవితాంతం కలిసి బతకడం కష్టం.

భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ వచ్చే డబ్బును జాగ్రత్తగా కలిసి ఖర్చు పెట్టుకోవాలి. కానీ ఇలా ఎవరిది వారు సగం సగం పంచుకుంటే మీది భార్యాభర్తల సంబంధం ఎలా అవుతుంది? చూసే వాళ్లు మీ గురించి ఏమనుకుంటారో ఆలోచించండి. ఇద్దరూ కలిసి ఓ నిర్ణయం తీసుకోండి. పద్మ డబ్బు ఇంటి ఖర్చులకు ఉపయోగించి మీ డబ్బును సేవింగ్స్ చేయడమో లేదా మీ డబ్బు ఖర్చు పెట్టి ఆమె డబ్బు సేవింగ్స్ కోసం ఉపయోగిస్తే మంచిది' అన్నాం. దానికి అతని ఒప్పుకోలేదు.

'ఆమె సేవింగ్ చేసి ఇచ్చినా ఆమె నుండి నేను తీసుకోలేను. అది నాకు ఇష్టం లేదు' ఇంకో మార్గం ఏమైనా చెప్పండి అన్నాడు. దానికి మేము 'ముందు మీ ఆలోచనా పద్ధతి మార్చుకోండి. పద్మ ప్రతి నెలా తన జీతంలో కొంత మీకు ఇస్తుంది. ఇంట్లోకి సరుకులు, కిరాయి, బంధువులు వచ్చినా, మీరు బయటకు వెళ్ళినా మొత్తం ఖర్చులు ఇందులో నుండే ఖర్చు చెయ్యండి. ఏమైనా మిగిలితే వచ్చే నెలకు ఉపయోగించుకోండి. ప్రతి దానికి లెక్కలు రాసుకోండి. అలాగే మీరిద్దరూ ఎప్పుడైనా బయటకు వెళితే ఆ బిల్లు మొత్తం ఒకసారి మీరు కడితే మరోసారి పద్మ కడుతుంది. అంతేకానీ అక్కడే కూర్చొని సగం సగం అంటూ లెక్కలు వేయడం మానుకోండి. ముందు పిల్లల గురించి ఆలోచించండి. ఇద్దరూ మిగిలిన డబ్బులు సేవింగ్ చేయండి. అది కూడా ఇద్దరూ చర్చించుకొని ఓ నిర్ణయం తీసుకోండి. ఆర్థిక విషయాల్లో భార్యాభర్తల మధ్య రహస్యాలు ఉండ కూడదు. సంపాదించింది కలిసి ఖర్చు చేయడం, జాగ్రత్త చేసుకోవడం నేర్చుకోండి' అని చెప్పి పంపించాము.

వాళ్లిద్దరూ మళ్లీ ఆరు నెలల తర్వాత ఐద్వా అదాలత్‌కు వచ్చారు. ఇప్పుడు పద్మకు మూడో నెల. ప్రస్తుతం సుధాకర్‌లో బాగా మార్పు వచ్చిందనీ, అంతకు ముందులా ప్రవర్తించడం లేదని సంతోషంగా చెప్పింది.

- వై వరలక్ష్మి, 9948794051

వక్ఫ్ బిల్లుపై జేపీసీ

కమిటీలో 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ ఎంపీలు

వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనే రిపోర్టు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రతిపక్షాల డిమాండ్ మేరకు కేంద్ర ప్రభుత్వం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేసింది. మొత్తం 31 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన జేపీసీలో 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. శుక్రవారం ఈ మేరకు కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు లోక్‌సభలో జేపీసీ సభ్యుల పేర్లను ప్రకటించారు. జేపీసీ సభ్యులుగా బీజేపీ ఎంపీలు జగదాంబికా పాల్, నిషికాంత్ దూబే, తేజస్వి సూర్య, అపరాజిత సారంగి, సంజయ్ జైస్వాల్, దిలీప్ సైకియా, అభిజిత్ గంగోపాధ్యాయ, డికె అరుణ, కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గొగోయ్, ఇమ్రాన్ మసూద్, మొహమ్మద్ జావేద్, ఎస్‌పి ఎంపీ మౌలానా మొహిబుల్లా నాద్వి, టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ, డీఎంకే ఎంపీ ఎ రాజా, టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జేడీయూ ఎంపీ దిలేశ్వర్ కమైత్, శివసేన (ఠాక్రే) ఎంపీ అరవింద్ సావంత్, ఎన్‌సిపి (శరద్ పవర్) ఎంపీ సురేష్ గోపీనాథ్, శివసేన (షిండే) నరేష్ గణపత్, ఎల్‌జెపి ఎంపీ అరుణ్ భారతి, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పేర్లను ప్రతిపాదించారు. అదేవిధంగా జేపీసీ కోసం పది మంది సభ్యుల పేర్లను సిఫారసు చేయాలని రాజ్యసభను కోరారు. కేంద్ర ప్రతిపాదనను లోక్‌సభ ఆమోదించింది. జేపీసీ సమావేశం నిర్వహించేందుకు కోరం మొత్తం సభ్యుల్లో మూడో వంతు సభ్యులుండాలి. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో మొదటి వారం చివరి రోజున సభలో కమిటీ రిపోర్టును ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు.

ఆ భూములపై పెద్దల కన్ను

(మొదటిపేజీ తరువాయి)

నెలలుగా ప్రభుత్వ భూమిని చదును చేస్తూ.. రోడ్లు వేస్తున్నారు. ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద కొండలు, గుట్టలు ఉండటంతో వీటిని పెద్ద పెద్ద మిషన్లతో తొలగిస్తున్నారు. బ్లాస్టింగ్‌లు కూడా జరుపుతున్నారు. ఇక్కడ ఇంత జరుగుతున్నప్పటికీ.. రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రాంతాల్లోనూ ఇదే దందా కొనసాగుతున్నట్టు అధికారవర్గాల సమాచారం.

అసైన్డ్ భూమిలో దర్జాగా రోడ్లు నిర్మాణం

ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తిరుగు లేకుండాపోయింది. అసైన్డ్ భూముల్లో నుంచి సుమారు 10 ఎకరాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ విషయం వెలుగులోకి వచ్చినా అధికారులు చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇదే ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోడ్లు వేశారు. కానీ అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా అసైన్డ్‌దారులకు పీవోటీ కింద నోటీసులు జారీ చేస్తామని చెప్పడం విడ్డూరం. ప్రభుత్వ అధికారులకు అమాయకులైన అసైన్డ్‌దారులకు నోటీసులు ఇచ్చేందుకు ధైర్యం ఉంది కానీ, ప్రభుత్వ భూముల్లో రోడ్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు జంకుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసలు ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారో లెక్క తేల్చాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. తక్షణమే ఆ రోడ్ల నిర్మాణాలు నిలిపివేసి, ఆ భూములను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కలం బలం నిరూపిస్తున్న పత్రిక

(మొదటిపేజీ తరువాయి)

దినపత్రిక నవ తెలంగాణ. ప్రజా సమస్యలను ప్రజలలోకి వెళ్లి, ఉన్నది ఉన్నట్టుగా రాసే గుండెనిబ్బరం ఉన్న విలేకరులతో, అది ఏ పార్టీ అయినా ప్రజల పక్షాన ఉందో లేదో తెలియజేస్తూ , కార్పొరేట్ రంగంలో జరుగుతున్న పొరపాట్లను కలం బలంతో నిరూపిస్తూ తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకుని నూరు వసంతాల వైపుకి అడుగులు వేస్తున్న నవతెలంగాణ దినపత్రిక ఇలాగే స్ఫూర్తిమంతంగా కొనసాగాలని కోరుకుంటూ అభినందనలు తెలియజేస్తున్నాను.

తెలంగాణ ఫ్యూచర్ స్టేట్..

(మొదటిపేజీ తరువాయి)

నిలవాలని ఆయన ఆకాంక్షించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్' రౌండ్‌టేబుల్‌లో టెక్ యూనికార్న్ సీఈవోలను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. ఐటీ యూనికార్న్ ప్రతినిధులందరూ తెలంగాణకు రావాలంటూ ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు. 'మీ భవిష్యత్తును ఆవిష్కరించు కోండి, అందరం కలసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుదాం...' అని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకూ తమ బృందం న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ, టెక్సాస్‌లో పర్యటించిందని రేవంత్ ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పుడు కాలిఫోర్నియాలో అడుగుపెట్టామని చెప్పారు. అమెరికాలో ప్రతీ రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యముందనీ, దాన్ని సూచించే నినాదమూ ఉందని అన్నారు. 'అవుటాఫ్ మెనీ.. వన్' అనేది న్యూయార్క్ స్టేట్ నినాదం, టెక్సాస్‌ను లోన్ స్టార్ స్టేట్ అని పిలుస్తారు, కాలిఫోర్నియాకు యురేకా అనే నినాదముందని వివరించారు. మన దేశంలో మాత్రం రాష్ట్రాలకు ఇలాంటి నినాదాలేవీ లేవన్నారు. అందువల్ల ఇప్పటి నుంచి తెలంగాణకు అలాంటి ఒక లక్ష్యాన్ని, నినాదాన్ని ట్యాగ్‌లైన్‌గా రూపొందించాలని వ్యాఖ్యానించారు. అదే 'తెలంగాణ..ఫ్యూచర్ స్టేట్...' అని తెలిపారు. ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందని సీఎం బృందంలోని సభ్యుడైన మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను తమ ప్రభుత్వం అనుసరిస్తోందని వివరించారు. ఒకసారి హైదరాబాద్‌కు వచ్చి తమ పాలసీలను పరిశీలించాలంటూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనికార్న్ కంపెనీ వ్యవస్థాపకులను ఆయన ఆహ్వానించారు. పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సదుపాయాలను పరిశీలించాలని ఆయన వారిని కోరారు.

శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్ భేటీ

ప్రఖ్యాత అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించేందుకు వీలుగా అమెరికాలో పర్యటిస్తున్న సీఎం, అక్కడి కాలిఫోర్నియాలో పలువురు గ్లోబల్ బిజినెస్ లీడర్లతో సమావేశాలు, చర్చలు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా అడోబ్ సీఈవోతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ నిర్మాణం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటు తదితరాంశాలను నారాయణ్‌కు ఆయన ఈ సందర్భంగా వివరించారు. వాటిపట్ల శంతను కూడా ఆసక్తి కనబరిచారు. ఆయా ప్రాజెక్టుల్లో భాగస్వామ్యాన్ని పంచుకునేందుకు అంగీకరించారు. టెక్ విజనరీ అయిన నారాయణ్‌ను కలుసుకోవటం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. భేటీలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

ఆ ప్రమాదానికి సీఎం రేవంతే పూర్తి బాధ్యత వహించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుంకిశాల ప్రాజెక్టు పంప్‌హౌజ్ నీట మునిగిన ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. పురపాలక శాఖను కూడా పర్యవేక్షిస్తున్న సీఎం అసమర్థత, చేతగానితనం వల్లే ఆ ఘటన జరిగిందని ఆయన విమర్శించారు. ఈ విషయంలో ప్రభుత్వ తప్పిదం లేకుంటే వారం రోజులపాటు దాన్ని ఎందుకు పెట్టారని నిలదీశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస యాదవ్ తదితరులతో కలిసి కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న సమయంలోనే సుంకిశాల ఘటన సంభవించిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ విషయాన్ని సభలో ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని చెప్పారు. కానీ రేవంత్ సర్కారు అలా చేయలేదని విమర్శించారు. అంటే ప్రమాదం జరిగిన విషయమే ప్రభుత్వానికి తెలియ దా? లేక తెలిసినా తెలియనట్టు నటించారా..? అని ప్రశ్నించారు. సంఘటన గురించి తెలిసినా కావాలనే గోప్యంగా ఉంచారని దుయ్యబట్టారు. హడావుడిగా పనులు ప్రారంభించటంతోనే ఈ దుస్థితి దాపురించిందంటూ అధికారులు చెబుతున్నారని వాపోయారు. అదృష్టవశాత్తూ కూలీలు షిఫ్టు మారిన సమయంలో ఈ ప్రమాదం జరిగిందనీ, లేదంటే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం సంభవించేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వాస్తవాలను మరుగుపరిచిన ప్రభుత్వం, తమ మీద, తమ పార్టీ మీద తప్పుడు ప్రచారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తన బాధ్యతను తాను నెరవేర్చకుండా బీఆర్‌ఎస్‌పై నిందలు మోపటం సిగ్గుచేటని విమర్శించారు. ఘటనపై పూర్తిస్థాయి న్యాయ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఓట్ల కోసం కాళేశ్వరంపై అడ్డగోలు వాదనలు చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత అవన్నీ పసలేనివిగా తేలాయంటూ ఎద్దేవా చేశారు.

33 జీవోను ఉపసంహరించాలి

స్థానికుల హక్కులను కాపాడాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థుల స్థానికతకు సంబంధించిన నిబంధనలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 33 స్థానికులకు నష్టం చేస్తుందనీ, ఈ జీవోను తక్షణమే ఉపసంహరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సవరణ ప్రకారం తెలంగాణ బిడ్డలనే స్థానికేతరులుగా పరిగణించే ప్రమాదముందని తెలిపారు. స్థానికతకు సంబంధించిన ఆదేశాలు స్థానికుల హక్కులు పరిరక్షించేవిగా ఉండాలి తప్ప స్థానికులకే నష్టం చేయకూడదని పేర్కొన్నారు. 33 జీవో ఫలితంగా స్థానికులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వైద్య విద్యకు పరిమితం చేసినా తర్వాత కాలంలో అన్ని రంగాలకూ ఇవే నిబంధనలు వర్తింపజేయనున్నారని వివరించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అమల్లోకి వచ్చిన జీవో నెంబర్ 114 (2017, జులై 5న)లో పొందుపరిచిన నిబంధనలను పునరుద్ధరిస్తూ తక్షణం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వైద్య రంగంతోపాటు అన్ని రంగాలకూ అది వర్తించేవిధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు.

33 జీవోను వెనక్కి తీసుకోవాలి

పాఠశాలలో చదివిన కాలాన్ని స్థానికతగా నిర్ణయించాలి : ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

రాష్ట్రంలో మెడికల్ ప్రవేశాలకు (ఎంబీబీఎస్, బీడీఎస్) స్థానికత నిర్ణయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం జీవోనెంబర్ 33ను జారీ చేసిందనీ, దాని వల్ల తెలంగాణ విద్యార్థులు కూడా తమ స్థానికతను కోల్పోయే అవకాశముందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. విద్యార్థులకు నష్టం కలిగించే 33 జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ విద్యార్థులు కూడా ఇతర రాష్ట్రాల్లో తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు చదివే అవకాశముందని తెలిపారు. 33 జీవో వల్ల తెలంగాణ విద్యార్థులు కూడా స్థానికేతరులుగా మారే ప్రమాదముందని పేర్కొన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరు నుంచి 12వ తరగతి వరకు ఏడేండ్లలో నాలుగేండ్లు చదివి ఉంటే స్థానికులుగా పరిగణించారని గుర్తు చేశారు. ప్రస్తుతం తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు చదివితేనే స్థానికులనడం వల్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చిన చదివిన వారు కూడా స్థానిక కోటాలో సీట్లు పొందే అవకాశముందని వివరించారు. దీంతో స్థానికులకు నష్టం జరిగే అవకాశముందని పేర్కొన్నారు. మెడికల్ విద్య ప్రవేశాల్లో కూడా ఉద్యోగ నియామకాల కోసం తీసుకుంటున్న స్థానికతనే ఒకటి నుంచి ఏడో తరగతి పాఠశాల విద్యను ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు. 33 జీవోకు సవరణలు చేసి స్థానిక విద్యార్థులకు న్యాయం జరిగేలా ఉత్తర్వులు విడుదల చేయాలని సూచించారు.

కేసీఆర్ మానస పుత్రిక సుంకిశాల

(మొదటిపేజీ తరువాయి)

సుఖేందర్‌రెడ్డితో కలిసి మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ఎస్‌ఎల్బీసీ సొరంగ పనులు పూర్తి చేసి ఉంటే సుంకిశాల ప్రాజెక్టు అవసరమే ఉండేది కాదని చెప్పారు. ఏఎంఆర్పీ నుంచి హైదరాబాద్‌కు తాగునీళ్లు సక్రమంగా అందుతున్నా కమీషన్ల కోసం రూ.2,200 కోట్లు వెచ్చించారని విమర్శించారు. సుంకిశాల నిర్మాణ డిజైన్ చేసింది, కాంట్రాక్టుకు ఇచ్చింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. సుంకిశాల నష్టం రూ.10 నుంచి 15 కోట్లు ఉంటుందని, దాన్ని కాంట్రాక్టు సంస్థే భరిస్తుందని, ప్రభుత్వానికి ఎలాంటి నష్టమూ లేదని చెప్పారు. ఎస్‌ఎల్బీసీ సొరంగం పనులు మొత్తం 44 కిలోమీటర్లు కాగా.. ఇప్పటికి 35 కిలోమీటర్లు పూర్తి అయిందన్నారు. మరో 9 కిలోమీటర్లు పూర్తి చేసి రెండు లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్‌కు తాగునీటిని అందిస్తామని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సుంకిశాల ప్రాజెక్టును 2021 జులైలో నాటి కేసీఆర్ ప్రభుత్వం కాంట్రాక్ట్ సంస్థతో అగ్రిమెంట్ చేసుకుందన్నారు. టన్నెల్ సైడ్ వాల్‌ని జులై 2023లో పూర్తి చేశారని చెప్పారు. సుంకిశాల ప్రాజెక్టు కాంగ్రెస్ కట్టింది కాదు.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లతో పాటు సుంకిశాల కూడా బీఆర్‌ఎస్ పాపమే.. బీఆర్‌ఎస్ హయాంలో మొదలు పెట్టిన మిగిలిన నిర్మాణాల పరిస్థితి కూడా భవిష్యత్‌లో తేలుతుందని అన్నారు. కాంగ్రెస్ రాగానే కూలిందంటూ.. గత పాలకులు సుంకిశాల పాపాన్ని తమపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును అందరూ వ్యతిరేకించినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం కమీషన్ల కోసమే ప్రారంభించిందని విమర్శించారు. సుంకిశాల పంప్‌హౌస్ ప్రాజెక్టు పనులను 2021లో రూ.2,200 కోట్లకు మేఘా సంస్థ కాంట్రాక్టు దక్కించుకోగా.. ఇప్పటి వరకు రూ.1,500 కోట్లు ఖర్చు పెట్టారని వివరించారు. ఇన్‌టెక్ వెల్‌లో సంపు, పంపుహౌస్, 3 టన్నెళ్లు, సూపర్ స్ట్రక్చర్ నిర్మిస్తున్నారని తెలిపారు. పంపింగ్ మెయిన్స్‌లో 50 కిలోమీటర్ల మేర 3 వరుసల 2,325 ఎంఎం డయా పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టు ఇన్‌టెక్ వెల్ పనులు ఇప్పటి వరకు 60 శాతం, పంపింగ్ మెయిన్ పనులు 70 శాతం, ఎలక్ట్రో మెకానికల్ పనులు 40 శాతం పూర్తయ్యాయన్నారు. అయితే, సాగర్ రిజర్వాయర్‌లోకి భారీ వరద చేరుకోవడంతో ఒత్తిడికి తట్టుకోలేక రిటెయినింగ్ వాల్ కుప్పకూలిందన్నారు. సాగర్‌లోకి భారీ స్థాయిలో వరద వస్తుందని ఊహించలేకపోయామని జలమండలి అధికారులు చెప్తున్న తీరు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌లోకి వరద జులై నెలాఖరు నుంచి మొదలైందన్నారు. ఆగస్టు 1న సాగర్ నీటిమట్టం 530 అడుగులు మాత్రమే ఉందన్నారు. 590 అడుగుల నుంచి 450 అడుగుల వరకు నీటి మట్టాలు పడిపోయినా సొరంగ మార్గం ద్వారా సుంకిశాల పంపుహౌస్‌లోకి నీటిని తరలించే విధంగా డిజైన్ చేశారన్నారు. కానీ 530 అడుగుల మేర 169 టీఎంసీల నీటి ధాటినే రిటెయినింగ్ వాల్ తట్టుకోలేకపోవడం నిర్మాణంలోని లోపాలను ఎత్తి చూపుతున్నదని అన్నారు. వాస్తవానికి పంపుహౌస్‌లో మోటార్లు బిగించిన తర్వాత సొరంగం పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇక్కడ అధికారులు మోటార్లు బిగించకముందే మూడు సొరంగ మార్గాల్లో మూడో మార్గాన్ని ఓపెన్ చేసి పెట్టారని చెప్పారు. రిటెయినింగ్ వాల్, గేట్ల నిర్మాణం పూర్తి కావడం, సొరంగ మార్గాన్ని తెరిచే ఉంచడంతో ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. సాగర్‌లో 530 అడుగులకు నీరు చేరగానే సొరంగం గుండా పంపుహౌస్‌లోకి నీరు ప్రవేశించే క్రమంలో ఒత్తిడికి గురై, రిటెయినింగ్ వాల్ కూలిపోయిందని తెలిపారు. వాటర్ లీక్ అవుతున్నట్టు అక్కడ పనిచేస్తున్న సిబ్బంది అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదనే ప్రచారం జరిగిందన్నారు.

సైడ్ వాల్ ఘటన దురదృష్టకరం: గుత్తా

సుంకిశాల ప్రాజెక్టు సైడ్ వాల్ కూలిపోవడం దురదృష్టకరమని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి వెళ్లిన సమయంలో, అలాగే వర్షాభావ పరిస్థితులు, వేసవిలో సైతం ఎలాంటి ఇబ్బందీ లేకుండా హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని సరఫరా చేసేందుకు 2021లో గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. 2014 నుంచి 2022 వరకు సుంకిశాల ప్రాజెక్టు పనులు జరగలేదని, 2022 డిసెంబర్ వరకు ఈ ప్రాజెక్టుపై 875 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని వివరించారు. సాగర్‌లోకి వచ్చిన భారీ వరద ఒత్తిడి వల్ల ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్, డీపీఆర్‌ఓ వెంకిటేశ్వర్ రావు, సాగర్ డ్యామ్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, మెట్రో వాటర్ ఎస్‌ఈ సుదర్శన్, జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ కర్నాటి లింగారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

నవచిత్రం



కథ అద్భుతం

ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావు చిత్ర సీమలోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు. వైవిఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని 'న్యూ టాలెంట్ రోర్స్ ఏ' బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్నారు.
హీరో మహేష్ బాబు బర్త్‌డేని సెలబ్రేట్ చేసుకుంటూ శుక్రవారం మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన క్రేజీ అప్డేట్స్ అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వైవిఎస్ చౌదరి మాట్లాడుతూ,'ఈ కథని నేను రాసుకున్నాను. దీనికి అర్ధవంతమైన మాటలు రాయడానికి సమర్ధవంతమైన సాయి మాధవ్ బుర్ర లాంటి మాటల రచయిత కావాలి. ఈ సినిమాతో ఆయనతో పని చేయడం చాలా ఆనందంగా ఉంది. సినిమాకి సంగీతం, సాహిత్యం ప్రాణంగా భావిస్తుంటాను. కీరవాణి యుగపురుషుడు లాంటి వారు. అలాంటి మహానుభావుడితో ఈ సినిమా చేసిన చేయడం చాలా సంతోషంగా ఉంది. చంద్రబోస్ సాహిత్యం మహా అద్భుతంగా ఉండబోతోంది. నేను పరిచయం చేసిన ఎంతో మంది హీరోయిన్స్ స్టార్స్‌గా వెలిగారు. ఈసారి మన తెలుగు అమ్మాయి వీణ రావుని కథానాయికగా పరిచయం చేస్తున్నాం. తను మంచి కూచిపూడి డ్యాన్సర్. ఈ మూవీలో అతిరథ మహారథులు ఇంకెందరో ఉంటారు. అలాగే కొత్త ట్యాలెంట్‌ని కూడా ప్రోత్సహిస్తున్నాం. సోషల్ మీడియా వేదికగా వివరాలు చెబుతాం. మేము చెప్పిన ప్రమాణాలు అనుగుణంగా మీ ట్యాలెంట్స్‌ని మాకు పంపించవచ్చు.దాని నుంచి కొంతమందిని ఎంపిక చేస్తాం' అని అన్నారు.
'న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌లో వైవిఎస్ చౌదరి, కీరవాణి, చంద్రబోస్ లాంటి మహామహులతో కలిసి పని చేసే అవకాశం ఇచ్చిన నిర్మాత యలమంచిలి గీతకి ధన్యవాదాలు. కథ విన్నాను, చాలా మంచి కథ. బ్యానర్‌లానే ప్రతిబింబించే ప్రతిభ గర్జిస్తే ఎలా ఉంటుందో సినిమా కూడా అలానే ఉంటుంది. మంచి డైలాగ్స్ రాసే అవకాశం ఉన్న కథ. ప్రాణం పెట్టి ఈ సినిమాకి పని చేస్తాను' అని డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా చెప్పారు.

ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో..



ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఓ భారీ పాన్ ఇండియా మూవీ తెరకెక్కనుంది. 'కెజియఫ్, సలార్' చిత్రాల తర్వాత నీల్ డైరెక్షన్‌లో తెరకెక్కుతోన్న ఈ మూవీకి ఎన్టీఆర్ నీల్ అనే వర్కింగ్ టైటిల్‌ను పెట్టారు. ఎప్పుడో అధికారికంగా ప్రకటించిన ఈ చిత్రం అందరి ఆశలను నిజం చేస్తూ శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది.
హైదరాబాద్‌లో ఈ చిత్ర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్, ఆయన కుటుంబ సభ్యులతో పాటు డైరెక్టర్ ప్రశాంత్ నీల్, పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. అభిమానులకు ఆనందాన్నిచ్చేలా 'ఎన్టీఆర్ నీల్' ప్రాజెక్ట్‌ను జనవరి 9, 2026లో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కానుంది.
బ్లాక్ బస్టర్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌తో మెప్పించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పుడు ఎన్టీఆర్ వంటి మ్యాన్ ఆఫ్ మాసెస్‌ను నెక్ట్స్ రేంజ్‌లో ప్రాజెక్ట్ చేస్తారనటంలో సందేహం లేదు. ఈ విషయం ఫ్యాన్స్‌లో మరింత ఆసక్తిని పెంపొందిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై నందమూరి కళ్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, రవి శంకర్ ఎలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: భువన్ గౌడ, సంగీతం: రవి బస్రూర్, ప్రొడక్షన్ డిజైన్: చలపతి.

హైదరాబాద్‌లో కీలక షెడ్యూల్


అజిత్

హీరో అజిత్ కుమార్‌తో మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న బిగ్గెస్ట్ ఎంటర్‌టైనర్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ తెలుగు-తమిళ ద్విభాషా చిత్రానికి ఆదిక్ రవిచంద్రన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు.
ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అజిత్ కుమార్‌ని మూడు డిఫరెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌లో ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.
ఈ షెడ్యూల్‌లో అజిత్ కుమార్, ఇతర నటీనటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రం 2025 సంక్రాంతికి విడుదల కానుంది. అజిత్ అభిమానులకు, ఆడియన్స్‌కు గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందించడానికి ఈ సినిమా రెడీ అవుతోంది. ఈ చిత్రానికి రచన - దర్శకత్వం: ఆదిక్ రవిచంద్రన్, డీవోపీ: అభినందన్ రామానుజం, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, ఎడిటర్: విజయ్ వేలుకుట్టి, ప్రొడక్షన్ డిజైనర్: జి ఎం శేఖర్, స్టంట్స్: సుప్రీం సుందర్, కలోయన్ వోడెనిచరోవ్.

తల్లి మనసు ప్రారంభం



ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ నిర్మాతగా తొలిసారి సినీ రంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ చిత్రం ద్వారా వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శుక్రవారం అన్నపూర్ణా స్టూడియోలో ఈ చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత పోకూరి బాబురావు క్లాప్ నివ్వగా, ఏషియన్ గ్రూప్ ఎం.డి.భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. హాస్య నటుడు బ్రహ్మానందం, దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు తదితరులు పూజా కార్యక్రమాలలో పాల్గొని, చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందజేశారు.
చిత్ర సమర్పకులు ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ, 'నా దగ్గర ఎంతో మంది సహాయ, కో- డైరెక్టర్లుగా పనిచేశారు. వి.శ్రీనివాస్ (సిప్పీ)లో అద్భుతమైన టాలెంట్ చూసి, ఆయనకు అవకాశం కల్పించాం' అని అన్నారు. 'ఓ మధ్య తరగతి తల్లి చుట్టూ తిరిగే చక్కటి కుటుంబ కథా చిత్రమిది. ఆమె మనోవేదన, సంఘర్షణను ఇందులో ఆవిష్కరిస్తున్నాం' అని దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) చెప్పారు. నిర్మాత ముత్యాల అనంత కిషోర్ మాట్లాడుతూ,'నాన్న పేరు నిలబెట్టేలా ఈ సినిమా ఉంటుంది. ప్రారంభం రోజు నుంచి యాభై రోజుల పాటు నిర్విరామంగా జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ పార్ట్ పూర్తి చేస్తాం. నవంబర్ లేదా డిసెంబర్‌లో ఈ సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

బ్యూటీఫుల్ క్యారెక్టర్ చేశా..


భాగ్యశ్రీ బోర్సే

రవితేజ, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మాత టి.జి.విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే శుక్రవారం మీడియాతో ముచ్చటించారు.

- మాది మహారాష్ట్రలోని ఔరంగాబాద్. మా నాన్న ఉద్యోగ రీత్యా లాగోస్ (నైజీరియా) షిఫ్ట్ అయ్యారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ కోసం ముంబై వచ్చినపుడు మోడలింగ్‌లోకి ఎంట్రీ ఇచ్చాను. తర్వాత కొన్ని కమర్షియల్స్ చేశాను. మంచి అవకాశం ఎదురు చూస్తున్నప్పుడు ఈ సినిమా కోసం ఇచ్చిన ఆడిషన్‌లో ఎంపికయ్యాను. నా తొలిసినిమానే రవితేజతో నటించడం ఎగ్జైటింగ్‌గా అనిపించింది.
- ఇందులో నా పాత్ర పేరు జిక్కీ. తెలుగు మార్వాడి గర్ల్. చాలా క్యూట్, లవబుల్. డైరెక్టర్ ఈ క్యారెక్టర్‌ని చాలా బ్యూటీఫుల్‌గా తీర్చిదిద్దారు. బచ్చన్ లైఫ్‌లో జిక్కీ చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుంది. ఇందులో క్యాసెట్ రికార్డింగ్ షాప్‌లో ఓ సీన్ ఉంటుంది. ఆ సీన్ చేసిన తర్వాత 'ఐయాం ప్రౌడ్ ఆఫ్ యూ' అని డైరెక్టర్ అన్నారు. అది నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది.
- తొలి సినిమాకే తెలుగులో డబ్బింగ్ చెప్పడం, పాటల్లో నా డ్యాన్స్ మూమెంట్స్ ట్రెండింగ్‌లో ఉండటం చాలా ఆనందంగా ఉంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ హౌస్‌తో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్ పీరియన్స్.

సరికొత్తగా రాధే కృష్ణ


సైదులు, భ్రమరాంబికా

ఎస్ వి క్రియేషన్స్ బ్యానర్ పై ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఎస్.ఎస్.సైదులు హీరోగా భ్రమరాంబిక, అర్పిత లోహి హీరోయిన్లుగా ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్న చిత్రం '1980 రాధే కృష్ణ'. ఎం ఎల్ రాజా సంగీత దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాని తెలుగు, బంజారా భాషల్లో విడుదల చేస్తున్నారు. శుక్రవారం ఈ చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా నిర్మాత బెక్కం వేణుగోపాల్, నిర్మాత రామ్ తాళ్లూరి, హీరో సోహెల్, ఆటో రాంప్రసాద్ హాజరై, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా నిర్మాత ఊడుగు సుధాకర్ మాట్లాడుతూ, 'రామ్ తల్లూరి ముందు నుంచి నన్ను సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. అలాగే బెక్కం వేణుగోపాల్ చెప్పిన మార్పుల్ని బడ్జెట్ చూసుకోకుండా చేశాం. టీజర్‌కి వాయిస్ ఓవర్ ఇచ్చిన తనికెళ్ల భరణికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. ప్రేక్షకులు ఈ సినిమాని మంచి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.
'ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మంచి సర్‌ప్రైజ్ ఉంది. కచ్చితంగా అందరికీ సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని హీరో ఎస్ ఎస్ సైదులు చెప్పారు. హీరోయిన్ భ్రమరాంబికా మాట్లాడుతూ, '1980లో రాధే కృష్ణ అప్పటి పరిస్థితులకు తగినట్టు ఈ సినిమాని తీశారు డైరెక్టర్ ఇస్మాయిల్. విజువల్‌గా పాషా ఇంకా బాగా చూపించారు. మ్యూజిక్, సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది' అని తెలిపారు. 'తనికెళ్ల భరణిని అప్రోచ్ అవ్వడానికి సపోర్ట్ చేసిన మహేంద్ర సింగ్ మాస్టర్‌కి కృతజ్ఞతలు. భరణి వాయిస్‌తో టీజర్‌కి ఒక కొత్త ఫీల్ వచ్చింది. అదేవిధంగా బెక్కం వేణుగోపాల్ క్లైమాక్స్‌కి చేసిన సజెషన్స్ బాగా హెల్ప్ అయ్యాయి. తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని దర్శకుడు ఇస్మాయిల్ షేక్ చెప్పారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో

బీజేపీ విధానాలకు అడ్డుకట్ట

కార్మిక, ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలి

- ఉపాధి హామీకి నిధులు కేటాయించాలి : రాష్ట్ర వ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నిరసన
- ప్రధాని మోడీ, బడ్జెట్ ప్రతుల దహనం



నవతెలంగాణ- హిమాయత్ నగర్/ మొఫిసిల్ విలేకరులు

దేశాన్ని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెట్టే బీజేపీ ప్రభుత్వ విధానాలను క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో అడ్డుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. బడ్జెట్‌ను సవరించి సామాన్యులకు రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశాయి. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జాతీయ పిలుపులో భాగంగా రాష్ట్రంగా శుక్రవారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. ప్రధాని మోడీ, కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తాలో పది కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నేతల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని, ఉపాధిహామీ చట్టానికి నిధులు పెంచాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని, ఎరువుల సబ్సిడీకి కోతలు నివారించి నిధులు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26000లు నిర్ణయించాలని, కార్పొరేట్ విత్తన కంపెనీలకు ప్రభుత్వ నిధులు కేటాయించొద్దని నినాదాలు చేశారు. ఈనెల 14 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్య పద్మ, బి.రాము, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, ఆర్.వెంకట్రాములు, ప్రసాదన్న, శంకర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ కార్పొరేట్ సంస్థలకు 5% పన్ను రాయితీ ఇచ్చిందని, బడా కార్పొరేట్ కంపెనీలకు విత్తన పరిశోధన సంస్థ నుంచి నిధులు కేటాయించేందుకు సిద్ధపడ్డారని అందులో భాగంగానే అమెజాన్, సిన్‌జెంటా, బేయర్ లాంటి కంపెనీలకు కేంద్ర వ్యవసాయ పరిశోధన సంస్థ ద్వారా నిధులు ఇచ్చేందుకు నిర్ణయించారని అన్నారు. రైతు సంఘాలతో మాట్లాడకుండా విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోమని హామీ ఇచ్చి ఇప్పుడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని అన్నారు. ఉపాధి హామీ చట్టానికి నిధుల్లో కోత పెట్టిందని, ఎరువుల సబ్సిడీకి కూడా కోత పెట్టిందని అన్నారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన పోరాటం ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో బీజేపీకి గుణపాఠం చెప్పినా పాఠాలు నేర్చుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్మిక సంఘాల నాయకులు బాల్‌రాజ్, వెంకటేష్, బోస్, శివబాబు, యూసుఫ్, చంద్రశేఖర్, అంజద్‌ఖాన్, వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26000 నిర్ణయించాలని ఆందోళన చేసిన పట్టించుకోలేదని, పనిగంటలను పోరాడి సాధించుకుంటే వాటిని కేంద్ర ప్రభుత్వం కాలరాసిందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను పేదలకు అనుకూలంగా సవరించాలని, బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని ఆపాలని, అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన అందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పని పద్మ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, నగర అధ్యక్షులు కుమార్, ప్రజా సంఘాల నాయకులు ప్రదీప్, రామకృష్ణ, రామ్‌చందర్, జి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. దమ్మపేటలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలో సీపీఐ(ఎం), సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాజీవ్ చౌక్ వద్ద ఆందోళన చేశారు. రాజేంద్రనగర్ కాటేదాన్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఉమ్మడి నల్లగొండలో వివిధ రూపాల్లో నిరసనలు జరిగాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో ప్లకార్డులు, నల్ల బ్యానర్ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఐద్వా ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. సూర్యాపేటలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు.

కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో నిరసనలు చేపట్టారు. మెదక్ జిల్లా కౌడిపల్లి బస్టాండ్ వద్ద, సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటలో నిరసన ప్రదర్శన తీశారు. వనపర్తిలో ర్యాలీ నిర్వహించారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886